శుక్రవారం
5•1•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 209
• పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
Dwaraka

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

అరుణాచల్‌లో తోకముడిచిన డ్రాగన్

అంతర్జాతీయ సరిహద్దును దాటి చైనా బలగాల చొరబాటు

కిలోమీటరు దూరంలో రోడ్డు నిర్మాణానికి యత్నం

అడ్డుకున్న ఐటీబీపీ బృందాలు.. నిర్మాణ సామగ్రి జప్తు

భారత్ ప్రతిఘటనతో వెనుదిరిగిన చైనా బలగాలు

5

పాకిస్థాన్ రేంజర్ల కాల్చివేత

- జవాన్ హత్యకు ప్రతీకారం తీర్చుకున్న బీఎస్ఎఫ్
- 12 నుంచి 15మంది పాక్ సైనికుల హతం
- రెండు మోర్టార్ స్థావరాలు, నాలుగు ఔట్‌పోస్టుల పేల్చివేత
- చొరబాటుకు యత్నించిన ఉగ్రవాది హతం

న్యూఢిల్లీ, జనవరి 4:

అకారణంగా భారత జవాన్‌ను పొట్టనబెట్టుకున్న పాకిస్థాన్‌పై బీఎస్ఎఫ్ ప్రతీకారం తీర్చుకుంది. భద్రతాదళాలు బుధవారం రాత్రి పాక్ ఆర్మీ పోస్టులపై మెరుపుదాడులు చేశాయి. సరిహద్దులలోని దాయాది దేశం ఆర్మీ పోస్టులను ధ్వంసం చేసి.. 12 నుంచి 15 మంది పాకిస్థాన్ రేంజర్లను హతమార్చాయి. ఈ ఆపరేషన్‌లో అనేకమంది పాక్ జవాన్లు గాయపడినట్టు సమాచారం. బుధవారం సాయంత్రం సాంబాసెక్టార్‌లో పాక్ సైన్యం ఏకపక్షంగా కాల్పులకు దిగింది. కవ్వింపుచర్యలేవీ లేకపోయినా, భారత సైన్యం లక్ష్యంగా జరిపిన కాల్పుల్లో సరిహద్దు భద్రతాదళం (బీఎస్ఎఫ్)కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ రాధాపడా హజారా(50) తీవ్రంగా గాయపడ్డారు. పుట్టినరోజునాడే పాక్ కాల్పుల్లో గాయపడిన ఆయన దవాఖానలో ప్రాణాలు విడిచారు. ఈ ఘటన భారత సైన్యంలో ప్రతీకారేచ్ఛను రగిలించింది. సరిహద్దుల్లో పాక్ యథేచ్ఛగా కాల్పుల ఉల్లంఘనకు పాల్పడుతూ మోర్టార్ షెల్స్, చిన్న ఆయుధాలతో దాడులు జరుపుతున్నది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి ఆపరేషన్ నిర్వహించిన భారత సైన్యం సరిహద్దు వెంట ఉన్న నాలుగు పాక్ ఆర్మీ పోస్టులను ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్‌లో 12నుంచి 15మంది పాక్ రేంజర్లు హతమైనట్టు భావిస్తున్నారు. భీకర కాల్పులతో పాకిస్థాన్ సైనిక పోస్టులపై భారత జవాన్లు విరుచుకుపడ్డారు. 'బుధవారం సాయంత్రం పాకిస్థాన్ ఏకపక్షంగా కాల్పుల్ని ప్రారంభించింది. తేలికపాటి ఆయుధాలతో ప్రారంభించి క్రమంగా మోర్టార్ షెల్స్‌తో దాడి వరకూ వెళ్లింది. ఈ క్రమంలో బీఎస్ఎఫ్ జవాన్ హజారా ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు

మిగతా 5వ పేజీలో

మెట్ట మాగాణి కావాలి

గోదావరి జలాలతో తెలంగాణ సస్యశ్యామలం ▪ గడువులోగా కాళేశ్వరం 9వ ప్యాకేజీ పూర్తి

రెండు లక్షల ఎకరాలకు సాగునీరు ▪ నిర్వాసితులకు న్యాయపరంగా పరిహారం

విల్లాను తలపించేలా డబుల్ బెడ్రూం ఇండ్లు ▪ మే వరకు అంతర్జాతీయ డ్రైవింగ్‌స్కూల్

మున్సిపల్ పట్టణాభివృద్ధి, ఐటీశాఖల మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తేతెలంగాణ:

'గోదావరి జలాలతో తెలంగాణ మెట్టప్రాంతం సస్యశ్యామలమవుతుంది. బీడుపడ్డ భూములు మళ్లీ ప్రాణం పోసుకొంటాయి. కాళేశ్వరం ప్రాజెక్టు తొమ్మిదో ప్యాకేజీ పనులు గడువులోగా పూర్తిచేసి రైతుల కండ్లల్లో వెలుగులు చూడాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష' అని రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. తొమ్మిదో ప్యాకేజీ ద్వారా రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని పునరుద్ఘాటించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో మంత్రి కేటీఆర్ గురువారం పెద్దపల్లి ఎంపీ బాల్క సుమన్‌తో కలిసి ఆకస్మిక పర్యటన జరిపారు. తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లివద్ద నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇండ్లు, కోనరావుపేట మండలం మల్కపేట వద్ద కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను పరిశీలించారు. ధర్మారం వద్ద నిర్మిస్తున్న భూగర్భ కాల్వను సందర్శించి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కాళేశ్వరం తొమ్మిదో ప్యాకేజీ పనులు పూర్తయితే మెట్ట ప్రాంతం సస్యశ్యామలమవుతుందని అన్నారు. ఇంతకాలం నీళ్లు లేక బీళ్లుగా మారిన పొలాలన్నీ పచ్చని చేలతో కళకళలాడాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పమని పేర్కొన్నారు. అనంతరం మల్కపేట రిజర్వాయర్ కింద ముంపునకు

మిగతా 2వ పేజీలో



గురువారం సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేటలో భూగర్భ కాలువ పనుల గురించి మంత్రి కేటీఆర్‌కు వివరిస్తున్న అధికారులు. చిత్రంలో ఎంపీ బాల్క సుమన్, కలెక్టర్ కృష్ణభాస్కర్ కూడా ఉన్నారు.

14,400 కానిస్టేబుల్ పోస్టులు త్వరలో భర్తీ

ఆర్థికశాఖ క్లియరెన్స్.. సీఎం కేసీఆర్ వద్దకు ఫైలు

త్వరలో నియామక ప్రక్రియకు శ్రీకారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



నిరుద్యోగులకు మరో శుభవార్త. కొత్త సంవత్సరం ప్రారంభంలోనే పోలీసుశాఖలో 14,400 కానిస్టేబుళ్ల నియామకానికి ఆర్థికశాఖ అనుమతి మంజూరుచేసింది. ఇందుకు సంబంధించిన ఫైల్ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనుమతికోసం వెళ్లినట్టు సమాచారం. దీనిపై సీఎం సంతకం చేసిన తర్వాత నియామక ప్రక్రియ మొదలవుతుంది. ఇందుకు సంబంధించి త్వరలోనే పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నుంచి నోటిఫికేషన్ వెలువడనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో శాంతి భద్రతల నేపథ్యంలో పోలీసు అవసరాలను దృష్టిలో ఉంచుకున్న ముఖ్యమంత్రి ఈ శాఖకు ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారు. సిబ్బంది సంఖ్యను పెంచాలని నిర్ణయం తీసుకుంటూ, శాఖాపరంగా నివేదిక కోరారు. రాష్ట్రంలో 30,000 కానిస్టేబుల్ ఉద్యోగాలు అవసరమంటూ పోలీసు అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. శాంతి భద్రతలకు అత్యధిక ప్రాముఖ్యమిస్తున్న ప్రభుత్వం ఈ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. తొలుత 12,000 పోస్టులకు, ఆ తర్వాత దాదాపు 3,000 పోస్టులకు ఆర్థికశాఖ క్లియరెన్స్ ఇచ్చింది. ఇందులో 12,000 పోస్టుల నియామక ప్రక్రియ పూర్తయి, అర్హత పొందిన కానిస్టేబుల్ అభ్యర్థులు శిక్షణ కూడా తీసుకుంటున్నారు. ఇప్పుడు మిగతా 14,400 కానిస్టేబుల్ పోస్టుల నియామానికి కూడా ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చింది.

24 గంటల విద్యుత్‌పై రాష్ట్రాల ఆరా

- తెలంగాణ విధానంపై దేశవ్యాప్తంగా చర్చ
- రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్ ప్రతినిధుల ఆసక్తి
- ఇంత తక్కువకాలంలో ఎలా సాధ్యమైంది?
- సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ప్రతినిధి వర్మ
- ఏమేం చర్యలు తీసుకొన్నారు: సీబీఐపీ సభ్యుడు వాహి
- ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుతో వివిధ రాష్ట్రాల అధికారుల సంభాషణలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటలపాటు విద్యుత్తు సరఫరా ప్రారంభించటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నది. వివిధ రాష్ట్రాల ఉన్నతస్థాయి అధికారులు, మంత్రులు, పలువురు ముఖ్యమంత్రులు ఈ పథకంపై ఆరా తీస్తున్నారు. మరికొందరు అధికారులు తెలంగాణలో పర్యటించి క్షేత్రస్థాయి అధ్యయనం చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న ఉన్నతాధికారులు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులతో ఆయా రాష్ట్రాల అధికారులు ఈ విషయంపైనే సంభాషిస్తున్నారు. మీకెలా సాధ్యమయ్యిందని ఆశ్చర్యంగా ప్రశ్నిస్తున్నారు. కొన్ని రాష్ట్రాల నుంచి తెలంగాణ అధికారులకు ఫోన్ చేసి మరీ 24 గంటల విద్యుత్తుపై వివరాలు సేకరిస్తున్నారు. పలు రాష్ట్రాల విద్యుత్తుశాఖ మంత్రులు, సీఎంలు మనం ఎందుకు ఇవ్వలేకపోతున్నామంటూ ఆయా రాష్ట్రాల విద్యుత్తు సంస్థల అధికారులను వాకబుచేస్తున్నట్టు తెలిసింది. తెలంగాణలో ఏమైనా క్షేత్రస్థాయి ఇబ్బందులు తలెత్తుతున్నాయా? వాటిని ఎలా అధిగమిస్తున్నారు? అనే అంశంపై కూడా ఆరా తీస్తున్నారు. గుజరాత్ లాంటి రాష్ట్రాలు తెలంగాణలో అమలవుతున్న విద్యుత్తుపై ప్రత్యేకంగా ఆసక్తి కనబర్చడం విశేషం. ఢిల్లీలో సీబీఐపీ అవార్డును స్వీకరించేందుకు

మిగతా 11వ పేజీలో

సిద్దిపేట డబుల్ రికార్డు

243 గ్రామాలు, మూడు మున్సిపాలిటీల్లో 70 సంస్థలతో ఇండ్ల నిర్మాణం

- అత్యున్నత ప్రమాణాలతో శరవేగంగా పనులు
- నిత్యం పర్యవేక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు
- దసరానాటికి పూర్తి.. దశలవారీగా గృహప్రవేశాలు
- మోడల్ కాలనీలుగా నర్సపురం, సంగాపూర్, దుబ్బాక
- జాతీయ అవార్డుకు సిద్దిపేట జిల్లా పేరు సిఫార్సు చేసిన ప్రభుత్వం



సిద్దిపేట నర్సపురం వద్ద డబుల్ బెడ్‌రూం ఇండ్లు

కత్తుల శ్రీనివాస్‌రెడ్డి/సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణంలో రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా ప్రథమస్థానంలో నిలుస్తూ రికార్డులు సృష్టిస్తున్నది. అత్యున్నత నాణ్యత ప్రమాణాలు, నిపుణులైన ఇంజినీర్ల పర్యవేక్షణలో 243 గ్రామాలు, మూడు మున్సిపాలిటీల్లో 70 నిర్మాణ సంస్థలు డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తిచేస్తున్నాయి. సీఎం కే చంద్రశేఖర్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామాల్లో పూర్తయిన ఇండ్ల స్ఫూర్తితో రాష్ట్రమంతటా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇండ్ల నిర్మాణంలో అగ్రగామిగా ఉన్న సిద్దిపేట జిల్లాను జాతీయ స్థాయి పురస్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖమంత్రి టీ హరీశ్‌రావు ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షాసమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి ఇండ్ల నిర్మాణం వేగంగా పూర్తయ్యేందుకు చర్యలు తీసుకొంటున్నారు. దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి నిరంతరం నియోజకవర్గంలో పర్యటిస్తూ డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్నారు.

జెట్ స్పీడ్‌తో నిర్మాణం

సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల్లో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం జెట్‌స్పీడ్‌తో కొనసాగుతున్నది. 2015, 2016 సంవత్సరాల్లో సిద్దిపేట

జిల్లాకు మంజూరైన మొత్తం ఇండ్లు: 11,421	
నిర్మాణం చేపట్టినవి	: 10,526
నిర్మాణం పూర్తయినవి	: 1630
ప్లాస్టరింగ్ దశలో	: 193
గోడల నిర్మాణ దశలో	: 826
స్లాబ్ దశలో	: 1174
ఇతరత్రా నిర్మాణ దశల్లో	: 6703

జిల్లాకు మొత్తంగా మంజూరైన 11,421 ఇండ్లలో 11,329 ఇండ్లను గ్రామాలవారీగా అధికారులు కేటాయించారు. 11,102 ఇండ్లకు టెండర్లు పిలిచి, 10,859 ఇండ్లకు టెండర్లు పూర్తిచేసి, 10,526 ఇండ్ల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో 1630 ఇండ్లు పూర్తయ్యాయి. ప్లాస్టరింగ్ దశలో 193, గోడల నిర్మాణ దశలో 826, స్లాబ్ దశలో 1174, ఇతరత్రా నిర్మాణ దశల్లో 6703 ఇండ్లు ఉన్నాయి. గజ్వేల్ నియోజకవర్గానికి 4024, సిద్దిపేటకు 3110, దుబ్బాకకు 3385, హుస్నాబాద్‌కు 240, మానకొండూరుకు 255, జనగామకు 315 ఇండ్లు మంజూరు చేశారు. వీటిలో ఎర్రవల్లి, నర్సన్నపేట గ్రామాల్లో ఇండ్లను లబ్ధిదారులకు 2016 డిసెంబర్‌లోనే అందజేశారు. ఇటీవలే సిద్దిపేట అర్బన్ మండలం పిట్టలవాడలో, తొగుట మండలం గోవర్ధనగిరి పిట్టలవాడలో పూర్తయిన ఇండ్లను లబ్ధిదారులకు అందించారు. పూర్తయిన మరికొన్ని ఇండ్లలో మంచి రోజులు రాగానే దశలవారీగా గృహ ప్రవేశాలు

మిగతా 12వ పేజీలో

ఫీజులు పెంచొద్దు

వచ్చే విద్యాసంవత్సరానికి పాతవే వర్తింపు

- ప్రైవేటు స్కూళ్లకు విద్యాశాఖ స్పెషల్ సీఎస్ రంజీవ్ ఆర్ ఆచార్య ఆదేశాలు
- ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ సిఫార్సులను ఇంకా పరిశీలించాల్సి ఉన్నదని వెల్లడి
- విద్యాశాఖ నిర్ణయంతో విద్యార్థుల తల్లితండ్రులకు ఊరట
- సంతోషం వ్యక్తంచేసిన స్కూల్స్ స్టూడెంట్స్ పేరెంట్స్ అసోసియేషన్
- ఫీజుల పెంపుదలకు అనుమతించండి: ప్రైవేటు స్కూల్ యాజమాన్యాల సంఘం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రైవేట్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు, తల్లితండ్రులకు కాస్త ఊరట లభించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడేంతవరకు స్కూల్ ఫీజులు పెంచొద్దని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని అన్నిరకాల ప్రైవేటు పాఠశాలల్లో పాత ఫీజులనే (2017-18) వచ్చే విద్యా సంవత్సరంలో (2018-19) కూడా కొనసాగించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని స్టేట్ సిలబస్ పాఠశాలలతో పాటు సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ, కేంబ్రిడ్జ్ బోర్డుల నుంచి అఫిలియేషన్ పొందిన ప్రైవేట్‌స్కూళ్లకు కూడా ఈ నిర్ణయం వర్తిస్తుందని స్పష్టంచేసింది. ఈ మేరకు వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని గురువారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య ఆదేశించారు. ప్రాంతీయ విద్యాధికారులకు, జిల్లా విద్యాధికారులకు ఆదేశాలను జారీచేయాలని సూచించారు. వాస్తవానికి ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ సిఫారసుల ప్రకారం ఫీజులు పెరుగుతాయని తల్లితండ్రుల సంఘాలు, విద్యార్థులు ఆందోళన చెందారు. అయితే, ప్రైవేటు స్కూల్ ఫీజుల నియంత్రణపై ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ సమర్పించిన నివేదికను ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిశీలించాల్సి ఉన్నదని.. ఈ ప్రక్రియ ఆలస్యమవుతున్నందున పాత ఫీజులనే కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు జీ కిషన్ తెలిపారు. ప్రస్తుతం

మిగతా 11వ పేజీలో

కామారెడ్డి జిల్లాలో వీఆర్ఏ హత్య

- ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపిన ఇసుక మాఫియా
- గ్రామస్థుల ఆగ్రహం.. ఇసుక వ్యాపారిపై దాడి

పిట్లం, నమస్తే తెలంగాణ:



వీఆర్ఏ బోయిని సాయిలు (ఫైల్)

కామారెడ్డి జిల్లాలో ఇసుకాసురులు దారుణానికి ఒడిగట్టారు. అక్రమ రవాణాను అడ్డుకొనేందుకు ప్రయత్నించిన వీఆర్ఏ సాయిలును ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్యచేశారు. డ్రైవర్ దురుసుగా ట్రాక్టర్ నడుపటంతో దాని చక్రాలకింద పడి వీఆర్ఏ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జుక్కల్ నియోజకవర్గం పిట్లం మండలం కంభాపూర్ శివారుల్లోని కాకివాగు పరివాహక ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి ఈ దారుణం జరిగింది. పిట్లం మండలంలోని పలుగ్రామాల మీదుగా పారే కాకివాగులో అక్కడక్కడ ఇసుక నిల్వలు ఉన్నాయి. ఇక్కడ ఇసుక తవ్వకాలకు ప్రభుత్వ అనుమతులు లేకపోయినప్పటికీ, స్థానిక ఇసుక

మిగతా 11వ పేజీలో



గవర్నర్‌తో టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల భేటీ

ఉద్యోగాల భర్తీ అంశంపై వివరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌తో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, కమిషన్ సభ్యులు సీ విఠల్, మంగారి రాజేందర్, మసినుద్దీన్ ఖాద్రీ, మన్మథరెడ్డి, సీహెచ్ సాయిలు, సీహెచ్ విద్యాసాగర్‌రావు, కే రామ్మోహన్‌రెడ్డి, బీ చంద్రావతి, కార్యదర్శి వాణీప్రసాద్ గురువారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా సమవేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపడుతున్న ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు సంబంధించిన పలు వివరాలను టీఎస్‌పీఎస్సీ చైర్మన్ చక్రపాణి సహా సభ్యులు గవర్నర్‌కు వివరించారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై గవర్నర్ సంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం. సిండికేట్ బ్యాంక్ జనరల్ మేనేజర్ ఎస్పీ శర్మ, మేజర్ జనరల్ సందీప్ శర్మలు వేర్వేరుగా గవర్నర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

రేపటినుంచి డీజీపీల సదస్సు



- సైబర్ టెర్రరిజం సహా పలు అంశాలపై చర్చ
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ప్రధాని
- ప్రధాని ఎదుట రాష్ట్ర పోలీసుల సాంకేతికత ప్రదర్శన
- టెక్నాలజీ ప్రదర్శనకు కేవలం తెలంగాణ పోలీస్‌కే అవకాశం: డీజీపీ మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అన్ని రాష్ట్రాల డీజీపీల సదస్సు శనివారం నుంచి మూడురోజులపాటు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని టేకాన్పూర్ బీఎస్‌ఎఫ్ అకాడమీలో జరుగనున్నది. సైబర్ టెర్రరిజం, సమాజంపై సోషల్ మీడియా ప్రభావం సహా పలు కీలక అంశాలపై ఈ మూడురోజుల సదస్సులో చర్చించనున్నారు. అన్ని రాష్ట్రాల డీజీపీలతోపాటు కేంద్ర పోలీసు బలగాలకు చెందిన ఉన్నతాధికారులు సైతం ఈ సదస్సుల్లో పాల్గొననున్నారు. ఈ సదస్సునుద్దేశించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ కీలక ఉపన్యాసం చేయనున్నారు.

తెలంగాణ పోలీస్‌శాఖకు అరుదైన గౌరవం

అన్ని రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొంటున్న ఈ సదస్సులో తెలంగాణ పోలీస్‌శాఖకు అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ పోలీసులు విజయవంతంగా అమలు చేస్తున్న పలు టెక్నాలజీ, నేర పరిశోధనలో నూతన విధానాలు, సాంకేతిక పరికరాల వినియోగంపై ప్రధాని మోదీ ముందు రాష్ట్ర పోలీసులు ప్రదర్శన ఇవ్వనున్నారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో విజయవంతంగా అమలు చేస్తున్న హైదరాబాద్‌కాప్, హ్యాక్‌ఐ, క్రైం అండ్ క్రిమినల్ డేటా, సోషల్ మీడియా మానిటరింగ్ యూనిట్, ట్రాఫిక్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, ఇన్వెస్టిగేషన్ అనాలసిస్, ఫేషియల్ రికగ్నైజేషన్ యూనిట్ వంటి కీలక అంశాలు, వీటి అమలులో తెలంగాణ పోలీసులు సాధించిన ప్రగతి, వివిధ యాప్‌ల వినియోగం, వాటి ద్వారా వస్తున్న ఫలితాలు తదితర అంశాలపై ప్రధాని ఎదుట డెమో ఇవ్వనున్నారు. అదేవిధంగా సైబర్ ఫోరెన్సిక్ పరికరాలు, ఫింగర్‌ప్రింట్స్ బ్యూరోలో అందుబాటులోకి తెచ్చిన అత్యాధునిక పరికరాల గురించి వివరించనున్నారు. రాష్ట్ర పోలీసులు తీసుకొచ్చిన నూతన సంస్కరణలను, తెలంగాణ పోలీసులు సాధిస్తున్న ప్రగతిని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి అన్ని రాష్ట్రాల డీజీపీలతోపాటు పోలీసు ఉన్నతాధికారులకు వివరించనున్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే టెక్నాలజీ అంశాలపై డెమో ఇచ్చే అవకాశం లభించిందని డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు.



సంక్రాంతికి 84 ప్రత్యేక రైళ్లు

దక్షిణమధ్య రైల్వే ప్రకటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 84 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. కాచిగూడ-విశాఖపట్నం వయా గుంటూరు, విజయవాడ (రైలు నంబర్ 07016) రైలు ఫిబ్రవరి 6, 13, 20, 27 (ప్రతి మంగళవారం) సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి విశాఖపట్నానికి మరుసటిరోజు ఉదయం 7.50కి చేరుకుంటుంది. విశాఖ-తిరుపతి 07479 నంబర్‌గల రైలు ఫిబ్రవరి 7, 14, 21, 28 తేదీలలో (ప్రతి బుధవారం) రాత్రి 7.05కు బయలుదేరి తిరుపతికి మరుసటిరోజు ఉదయం 9.25కు చేరుకుంటుంది. తిరుపతి-కాచిగూడ (నంబర్ 07146) రైలు జనవరి 8, 15, 22, మార్చి 1వ తేదీల్లో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. హైదరాబాద్-విశాఖపట్నం (రైలు నంబర్ 07148) రైలు జనవరి 10, 12 తేదీల్లో సాయంత్రం 5.45కి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.15కు విశాఖపట్నానికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07147 నంబర్ రైలు జనవరి 11,13 తేదీల్లో సాయం త్రం 6.50కి బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.45కు హైదరాబాద్‌కు చేరుకుంటుంది.

ప్రశాంతంగా సీడీపీవో పరీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖలోని చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, అడిషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిట్టు టీఎస్‌పీఎస్సీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. మొత్తం 12,310 మంది దరఖాస్తు చేసుకోగా.. 59% మంది పరీక్షకు హాజరైనట్టు పేర్కొన్నది. ఉదయం సెషన్‌కు 7,357 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 7,353 మంది హాజరయ్యారని వివరించింది.

ముహూర్తం

సూర్యోదయం: 6.51 గంటలకు

సూర్యాస్తమయం: 5.52 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, చతుర్థి రాత్రి 7.02 వరకు, తదుపరి పంచమి. నక్షత్రం: ఆశ్లేష తె. 3.54 వరకు తదుపరి మఖ. అమృత ఘడియలు: తె. 2.27 నుంచి 4.03 వరకు, రాహుకాలం: ఉదయం 10.59 నుంచి 12.21 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.03 నుంచి 9.47 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.44 నుంచి 1.28 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 3.05 నుంచి 4.41 వరకు.

లోకం పోకడ



పైన కాంగ్రెస్ గుర్తు, కింద బీజేపీ గుర్తులా అనిపిస్తున్నది.. అనవసరంగా ఓట్లు వాళ్ళకు పోతాయ్.. మార్చేద్దాం!!

రైతులు విజ్ఞులు.. కాంగ్రెస్‌కే విజ్ఞతలేదు

- అవసరమైనమేరకే రైతులు విద్యుత్ వాడుకొంటున్నారు
- అభివృద్ధిని అడ్డుకోవడమే కాంగ్రెస్ లక్ష్యం
- నాడు కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎందుకు అడ్డుకోలేదు?
- ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్న
- 24 గంటల ఉచిత విద్యుత్తుతో రైతులు సంతోషంగా ఉన్నారని వెల్లడి
- 1104 యూనియన్ కార్మికుల పక్షపాతి అని మంత్రి ప్రశంస



గురువారం మింట్ కాంపౌండ్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ట్రాన్స్‌కో జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి తదితరులు

హైదరాబాద్/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రైతులకు 24 గంటల విద్యుత్ విజయవంతమైందని విద్యుత్ శాఖమంత్రి జీ జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగం విషయంలో రైతులకు విజ్ఞత ఉన్నదని, కాంగ్రెస్‌కే విజ్ఞత, విచక్షణ లేవని ఆయన అన్నారు. రైతులు అవసరమైన మేరకే విద్యుత్ వాడుకుంటున్నారని, ఉదయం తొమ్మిది గంటలకు 9340 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకంలో ఉంటే, సాయంత్రానికి అది 7900 మిలియన్ యూనిట్లకు తగ్గుతున్నదని, రైతులు యథేచ్ఛగా వాడుకుంటే విద్యుత్ వినియోగం తగ్గేది కాదని ఆయన అన్నారు. రైతులు స్వచ్ఛందంగానే కరెంటు మోటర్లను అసరమైనప్పుడు వేసుకుని, ఆ తర్వాత ఆపేస్తున్నారని, ఆన్‌ఆఫ్ స్టార్టర్లను ఏర్పాటు చేసుకుంటున్నారని ఆయన అన్నారు. తెలంగాణ అంధకారమైపోతుందని నాడు కిరణ్‌కుమార్‌రెడ్డి ఏ మనస్తత్వంతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చారో ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కూడా అదే మనస్తత్వంతో పొంతనలేకుండా మాట్లాడి తమ తెలివి తక్కువతనాన్ని బయటపెట్టుకుంటున్నారని మంత్రి విమర్శించారు. కరంటు గొప్పతనమంతా కాంగ్రెస్‌దే అయితే నాడు కిరణ్‌కుమార్‌రెడ్డి అడ్డగోలు ప్రకటనలను ఒక్క కాంగ్రెస్ మంత్రి కూడా ఎందుకు ఖండించలేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయాలను చూసి కాంగ్రెస్ నాయకులు అక్కసుతో నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. మింట్ కాంపౌండ్ తెలంగాణ చౌరస్తాలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్లను మంత్రి జగదీశ్‌రెడ్డి, సీఎండీ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వప్రతినిధి వేణుగోపాలాచారి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ. కార్మిక నాయకుడిగా, రైతు బంధువుగా, ప్రజలకు పెద్దన్నగా, ఆడపిల్లలకు తండ్రిలాగా పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అని గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన మూడున్నరేండ్లలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం టీఆర్‌ఎస్ ప్రభుత్వమనిచెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని విపక్షాలు అడ్డుకొంటున్నాయని ఆరోపించారు. కేసులతో ప్రాజెక్టులను, ఉద్యోగాలను అడ్డుకోవడమే ధ్యేయంగా ప్రతిపక్షాలు పనిచేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూర్చొని 24 గంటలు విద్యుత్ సరఫరా చేయడానికి మా సోనియమ్మ ప్రణాళికలు రూపొందించిందంటూ నీతులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇవన్నీ ముందుగా తెలిసినప్పుడు ఎన్నికల ముందు తెలంగాణలో నిర్వహించిన బహిరంగసభలో ఎందుకు వివరించలేదని ప్రశ్నించారు. అసలు విద్యుత్‌ను ఎలా ఉత్పత్తి చేస్తున్నాం.. ఎక్కడి నుంచి కొంటు న్నాం.. ఎలా సరఫరా చేస్తున్నామనే విషయాలపై పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కు అవగాహన ఉన్నదా అని నిలదీశారు. విజ్ఞత కలిగిన ఏ నాయకుడైన సరఫరా అవుతున్న విద్యుత్తును ఏవిధంగా వాడుకోవాలో రైతులకు వివరించాలని కోరారు. నాయకులకు విజ్ఞత లేకున్నా.. కానీ రైతులకు విద్యుత్‌ను ఏవిధంగా ఉపయోగించుకోవాలో అవగాహన ఉన్నదని మంత్రి జగదీశ్‌రెడ్డి వివరించారు. విద్యుత్ సరఫరాపై ఆనాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన ఆరోపణలకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎందుకు స్పందించలేదని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. విద్యుత్‌రంగంలోని ఉద్యోగులందరికీ త్వరలోనే శుభవార్త వస్తుందని చెప్పారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను విద్యుత్‌శాఖలో పూర్తిస్థాయిలో తొలిగించేందుకు సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారని అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి సారథ్యంలోవిద్యుత్‌రంగం దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు తెలిపారు. సీబీఐపీ అవార్డును విద్యుత్‌సంస్థ అందుకోవడం గర్వంగా ఉన్నదన్నారు. ఈ అవార్డు కార్యక్రమానికి హాజరైన ఇద్దరు కేంద్ర మంత్రులు, స్థానిక రాష్ట్ర మంత్రులు తమతో 24 గంటల విద్యుత్తు సరఫరా ఎలా సాధ్యమైయిందని అడిగినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ఆలోచన విధానంతో పాటు మంత్రులు, విద్యుత్‌సంస్థ అధికారులు, సిబ్బంది సహాయ సహకారాలున్నాయని వారికి వివరించినట్లు స్పష్టంచేశారు. విద్యుత్ కార్మికులకు తెలంగాణ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారనీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి సముద్రాల వేణుగోపాలచారి తెలిపారు. కార్యక్రమంలో 1104 యూనియన్ అధ్యక్షుడు పద్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి సాయిబాబా, సీఎండీలు రఘుమారెడ్డి, గోపాల్‌రావు, నాయకులు జనార్దన్‌రెడ్డి, సుధాకర్‌రావు, సుధీర్‌రావు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి పథకంపై కసరత్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

- పథకం స్ఫూర్తికి బ్యాంకులు గండికొట్టే ప్రమాదం
- పాత బకాయిల కింద జమచేసుకోకుండా వ్యూహరచన
- ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ
- పరిశీలనలో మొబైల్‌వ్యాలెట్, పేటీఎం, రూపేకార్డు
- త్వరలో పైలట్ ప్రాజెక్టు



రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.8 వేల చొప్పున వ్యవసాయ పెట్టుబడి అందించేందుకు అనుసరించాల్సిన విధానంపై ప్రభుత్వం మేలైన మార్గాలను అన్వేషిస్తున్నది. అవినీతిరహిత విధానాన్ని ఎంచుకోవటానికి రాష్ట్రంలోని ఓ గ్రామంలో ప్రయోగాత్మక అధ్యయనం చేపట్టాలని భావిస్తున్నది. మొబైల్‌వ్యాలెట్ ద్వారా కానీ, రూపేకార్డు ద్వారా కానీ ఆ మొత్తాన్ని రైతులకు అందించే దిశలో ఓ పైలట్ ప్రాజెక్టు చేపట్టనుంది. ఈ పెట్టుబడిని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవేస్తే.. ఆయా బ్యాంకులు ఆ మొత్తాన్ని పాత అప్పుల కింద జమచేసుకొనే ప్రమాదం ఉన్నదని ప్రభుత్వం భావిస్తున్నది. ఆ సహాయాన్ని నేరుగా రైతులకు అందించే విధంగా వ్యూహరచన చేస్తున్నది. పథకంలో ఇబ్బందులు రాకూడదని, రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయశాఖతో ఒక సర్వే చేయించారు. ఇంతటితో సంతృప్తి చెందని ముఖ్యమంత్రి కేసీఆర్, రెవెన్యూశాఖ అధ్వర్యంలో భూ రికార్డుల ప్రక్షాళన కూడా చేయించారు. సుమారు కోటీ యాభై లక్షల ఎకరాల వ్యవసాయభూమి సాగులో ఉన్నదని గుర్తించారు. రెండు పంటలకు కలిపి ఎకరానికి రూ.8 వేల చొప్పున అందించటం వలన సుమారు రూ.12 వేల కోట్లు ఖర్చు అవుతుందని అధికారుల అంచనా. ఇంత పెద్దమొత్తంలో ఖర్చు చేస్తూ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ పథకం ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అమలుకావాలని ఆర్థికశాఖను సీఎం కేసీఆర్ ఆదేశించారు. బ్యాంకుల ద్వారా రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందిస్తే పథకం విజయవంతం అవుతుందా?కాదా? అనే కోణంలో తర్జన భర్జనలు జరుగుతున్నాయి. పంట రుణమాఫీ విషయంలో బ్యాంకుల తీరుతో రైతులకు పూర్తి ప్రయోజనం కలుగలేదనే భావన ఉన్నది. రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలుచేసినా.. విపక్షాల విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చిందనే అభిప్రాయం ఉన్నది. అందుకే ఈ ప్రతిష్ఠాత్మక పథకంలో బ్యాంకుల ప్రమేయం లేకుండా జాగ్రత్తపడాలని ప్రభుత్వం భావిస్తున్నది. అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నారు. పెట్టుబడిని రైతులకే నగదురూపంలో ఇస్తే అవినీతికి ఆస్కారం ఉంటుందని భావిస్తున్నారు. అధికార యంత్రాంగంలో ఉన్న లోపాలను అడ్డుపెట్టుకొని దళారీవ్యవస్థ ప్రవేశిస్తుందన్న అనుమానాలున్నాయి. దీంతో మిగిలిన ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నారు. చెక్కు లేదా డీడీ లేదా మొబైల్‌వాలెట్, పేటీఎం, రూపేకార్డు లాంటి ఇతర మార్గాలను పరిశీలిస్తున్నారు. నగదు, చెక్, డీడీలు అందించే విషయంలో కూడా లంచాలకు ఎక్కువ అవకాశం ఉంటుందనే భావన ఉన్నది. సిద్దిపేట జిల్లా ఇబ్రహీంపూర్‌లో 100 శాతం నగదు రహిత లావాదేవీల స్కీం ఎలా అమలుచేశారో వివరాలు సేకరిస్తున్నారు. ఒక గ్రామాన్ని పైలట్‌ప్రాజెక్టుగా ఎంపికచేసి, క్షేత్రస్థాయి అధ్యయనం చేపట్టి పథకం అమలులో తలెత్తే ఇబ్బందులను, సాధకబాధకాలను అధ్యయనం చేయాలని నిర్ణయించారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్ రూం ఇండ్లను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

మెట్ట మాగాణి కావాలి

మొదటిపేజీ తరువాయి...

గురవుతున్న భూములను పరిశీలించి, అక్కడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. మూడు టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మిస్తున్న మల్కపేట రిజర్వాయర్‌కు స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులను మంత్రి కేటీఆర్ అభినందించారు. నిర్వాసితులందరికీ న్యాయపరంగా రావాల్సిన పరిహారాన్ని అందజేస్తామని, ఇండ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. నిర్వాసిత రైతు కుటుంబాల పిల్లలకు ఉద్యోగాలిస్తామన్న హామీని నిలబెట్టుకుంటామన్నారు. చదువు లేని వారికి శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తామని చెప్పారు.

విల్లాను తలపించేలా డబుల్‌బెడ్ రూం ఇండ్లు

హైదరాబాద్‌లో విల్లాను తలపించే విధంగా పేదల డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించాలని అధికారులను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి వద్ద ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్లను ఆయన పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న మూడంతస్థుల భవనాలలోకి వెళ్లి కిచెన్, బెడ్ రూం, హాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. జూన్ చివరి నాటికి నిర్మాణాలన్నీ పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. పార్కింగ్, పార్కులు, అంగన్‌వాడీకేంద్రాలు, రోడ్లు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, షాపింగ్ కాంప్లెక్స్ మొదలైన మౌలిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు రూ.70వేలు మాత్రమే ఇచ్చారని, తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇంటికి రూ.5.50 లక్షల వరకు ఖర్చుపెడుతున్నదని వివరించారు. ఇంత మంచి లక్ష్యంతో పేదల కోసం నిర్మిస్తున్న ఇండ్లు నాణ్యతాప్రమాణాలతో నిర్మించాలని అధికారులకు సూచించారు. డబుల్ బెడ్రూం ఇండ్ల వరకు వేసిన పీడబ్ల్యూడీ రోడ్డు వంకరగా ఉన్నందున, దాన్ని సరిచేయాలని, ఇందుకోసం అవసరమైన భూసేకరణ చేసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన మంత్రి కేటీఆర్.. పనుల నత్తనడకనగా సాగడం, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. మేలోగా డ్రైవింగ్‌స్కూల్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి వెంట కలెక్టర్ కృష్ణభాస్కర్, డీఆర్వో శ్యాంప్రసాద్‌లాల్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి, వైస్‌చైర్మన్ శ్రీనివాస్, గూడూరి ప్రవీణ్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు భాస్కర్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

శరవేగంగా మైనార్టీల అభివృద్ధి

- ప్రగతి నివేదిక విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం మైనార్టీ సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధపెట్టింది. మూడున్నరేండ్లలో మైనార్టీల సంక్షేమానికి 69 పథకాలు ప్రవేశపెట్టి, బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. మైనార్టీల విద్యాభివృద్ధికి 204 గురుకుల పాఠశాలలు, రెండు గురుకుల జూనియర్ కాలేజీలను ప్రారంభించింది. మైనార్టీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో 'ఓన్ యువర్ ఆటోస్కీమ్'ను ప్రారంభించి 1,721 మందికి ఆటోలు పంపిణీచేశారు. ఇలా మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాల వివరాలపై ప్రగతినివేదికను గురువారంనాడు ప్రభుత్వం విడుదల చేసింది.

మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన దానకిశోర్

మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా ఎం దానకిశోర్ గురువారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ శాఖ కార్యదర్శిగా ఉన్న ఒమర్‌జలీల్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వివిధ పథకాలను అల్పసంఖ్యాక వర్గాలకు అందేలా కృషిచేస్తానని దానకిశోర్ చెప్పారు. బదిలీపై వికారాబాద్ కలెక్టర్‌గా వెళ్తున్న ఒమర్‌జలీల్‌కు దానకిశోర్ అభినందనలు తెలిపారు.

పకడ్బందీగా 'సహకారం'

- ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక 'తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ ఎలక్షన్ అథారిటీ' ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: సహకార సంఘాల్లో అవినీతికి అడ్డుకట్ట వేసి, వాటిని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. ఇందులో భాగంగా సహకార ఎన్నికల నిర్వహణలో ఉన్న లోటుపాట్లను సరిదిద్ది, సక్రమంగా ఎన్నికలను జరుపేందుకు 'స్టేట్ కో-ఆపరేటివ్ ఎలక్షన్ అథారిటీ' పేరుతో ఒక విభాగాన్ని ఏర్పాటుచేసింది. ఇందుకోసం స్టేట్ కోఆపరేటివ్ చట్టానికి సవరణ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. సహకారం సంఘాల చట్టం 1964లోని 22వ సెక్షన్‌ను సవరించి చట్టంలో కొత్తగా సెక్షన్ 31-బి చేర్చారు. దీని ప్రకారం అన్ని సహకార సంఘాలకు ఎన్నికలను స్టేట్ కో-ఆపరేటివ్ ఎలక్షన్ అథారిటీ నిర్వహిస్తుంది. గతంలో ఈ ఎన్నికలు రిజిస్ట్రార్ లేదా కలెక్టర్ ఆధీనంలో జరిగేవి. ప్రభుత్వ సహకారం లేని సహకార సంస్థలు స్వతంత్రంగా ఇష్టానుసారంగా ఎన్నికలు నిర్వహించడంతో అక్రమాలు జరిగేవి. దీని ప్రకారం రాష్ట్రంలోని స్వతంత్ర సహకారసంఘాలతో పాటు అన్నిరకాల సహకార సంఘాలు స్టేట్ కో-ఆపరేటివ్ ఎలక్షన్ అథారిటీ పరిధిలోకి వచ్చాయి. ప్రభుత్వం రూపొందించిన కొత్త నిబంధనల ప్రకారం సహకార సంఘాల ఓటర్ల జాబితాను రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించి.. రిజిస్ట్రార్ ఖరారు చేస్తారు. అంతేకాకుండా ఎన్నికల ఖర్చును కూడా ఎలక్షన్ అథారిటీయే పర్యవేక్షిస్తుంది. కొత్త నిబంధనల ప్రకారం సహకారసంఘాల ఎన్నికలకు ఓటర్ల జాబితాలో ఫొటోను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ప్రస్తుతవిధానం ప్రకారం రిజర్వేషన్ స్థానాల్లో భర్తీ కాని ఖాళీ స్థానాలకు తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహిస్తుంది.

కృష్ణాబోర్డు సమావేశం మళ్లీ వాయిదా

హాజరుకాలేమని బోర్డుకు ఏపీ జలవనరులశాఖ ఈఎన్సీ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం ముచ్చటగా మూడోసారి వాయిదా పడింది. ఈ నెల 4, 5 తేదీల్లో ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం వద్ద పోలవరం డ్యాం డిజైన్‌పై సమీక్ష సమావేశానికి వెళ్లాల్సి ఉన్నందున తాము గురువారం నిర్వహించే త్రిసభ్య కమిటీ సమావేశానికి హాజరుకాలేమని ఏపీ నీటిపారుదలశాఖ ఈఎన్సీ ఎం వెంకటేశ్వర్‌రావు బోర్డుకు లేఖ రాశారు. త్రిసభ్య కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు కర్నూలు సీఈ (ప్రాజెక్టులు), ఒంగోలు సీఈ (ప్రాజెక్టులు)లను తాము నామినేట్ చేస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. ఇప్పటికే గత డిసెంబరు 21.. తర్వాత 27వ తేదీన జరుగాల్సిన సమావేశం వాయిదాపడగా.. ఇప్పుడు మరోసారి వాయిదా పడింది. బోర్డు త్రిసభ్య కమిటీలో సభ్య కార్యదర్శి, ఇరు రాష్ట్రాల ఈఎన్సీలు ఉంటారు. కానీ తమ తరఫున ఇద్దరు సీఈలను నామినేట్ చేస్తున్నట్టు ఏపీ ఈఎన్సీ చెప్పడంపై విస్మయం వ్యక్తమవుతున్నది. గురువారం త్రిసభ్య కమిటీ సమావేశం ఉందంటూ.. బుధవారం రాత్రి 10 గంటలకు బోర్డు సభ్య కార్యదర్శి లేఖ రాయడంపై విమర్శలు వస్తున్నాయి.

మంత్రి లక్ష్మారెడ్డి మా కళాశాల విద్యార్థి

- రేవంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకో..
- లక్ష్మారెడ్డి మంత్రి కావడం మాకు గర్వకారణం
- వైద్యరంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు
- కర్ణాటక హోమియో కళాశాల ప్రిన్సిపల్ సంపత్‌రావు



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న హెచ్‌కేఈఎస్ ప్రిన్సిపల్ సంపత్‌రావు

హైదరాబాద్/ ఖైరతాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి తమ కళాశాల పూర్వ విద్యార్థి అని హైదరాబాద్ కర్ణాటక ఎడ్యుకేషనల్ సొసైటీ (హెచ్‌కేఈఎస్)హోమియోపతిక్ కళాశాల ప్రిన్సిపల్ సంపత్‌రావు పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కళాశాల పూర్వ విద్యార్థులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయలబ్ధి కోసమే కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్‌రెడ్డి తెలంగాణ మంత్రి లక్ష్మారెడ్డితోపాటు, తమ కళాశాలపై అవాకులుచెవాకులు పేలుతున్నారని, అతడు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. మంత్రిని అవమానించడం తమ కళాశాలను అవమానించినట్టేనన్నారు. 1980-81లో హెచ్‌కేఈఎస్ హోమియోపతిక్ మెడికల్ కళాశాలను స్థాపించామని, లక్ష్మారెడ్డి మొదటి బ్యాచ్ విద్యార్థి అని, హోమియోపతిక్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు. తమ కళాశాలను 1985లోనే భారత ప్రభుత్వం గుర్తించి సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతిక్ రెండో చాప్టర్లో చేర్చి నోటిఫై కూడా చేసిందన్నారు. ఈ కళాశాలను అప్పటి కర్ణాటక వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, ప్రస్తుత రాయగిర్ ఎమ్మెల్యే ఏబీ మాలకారెడ్డి ఏర్పాటుచేశారన్నారు.1987లో వైద్యవిద్య పూర్తిచేసిన లక్ష్మారెడ్డి 1988లో హోం సర్జన్ పూర్తిచేసి వైద్యపట్టా పొందారని చెప్పారు. తమ కళాశాల పూర్వ విద్యార్థి లక్ష్మారెడ్డి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో వైద్యరంగంలో అనే మార్పులు తీసుకువచ్చారని, కేసీఆర్ కిట్లు, పేదవర్గాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వ దవాఖానల అధునీకరణకు ఎనలేని కృషిచేశారన్నారు. రేవంత్‌రెడ్డి మంత్రితోపాటు, మంచిసంకల్పంతో ఏర్పాటుచేసిన తమ కళాశాలను అవమానిస్తున్నారని, అతడు తన వ్యాఖ్యలను వెనకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెచ్‌కేఈఎస్ హోమియోపతిక్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టీ విజయ్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు ఆనంద్‌రావు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్‌తో చరిత్ర సృష్టించాం

- దిక్కుతోచని స్థితిలో కాంగ్రెస్
- తెలంగాణ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం
- టీఎన్జీవో డైరీ ఆవిష్కరణ సభలో మంత్రి హరీశ్‌రావు



గురువారం రవీంద్రభారతిలో టీఎన్జీవో డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు, శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ అయాచితం శ్రీధర్, సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, మహిళావిభాగం చైర్ పర్సన్ బండారు రేచల్ తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారతదేశంలోనే 24 గంటలపాటు వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించిందని రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో మూడేండ్ల కాలంలోనే రాష్ట్రం ఈ అద్భుత విజయాన్ని సాధించిందని పేర్కొన్నారు. 24 గంటలపాటు కరంట్‌ను సరఫరా చేస్తామని ప్రకటించగానే కాంగ్రెస్ నాయకులకు దిక్కు తోచని స్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. గురువారం రవీంద్రభారతిలో టీఎన్జీవో -2018 డైరీ ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి హరీశ్‌రావు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి పరిష్కరిస్తున్న తీరును సోదాహరణంగా వివరించారు. ఈ సభకు టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కలలను నిజం చేయడంలో సీఎం కేసీఆర్‌తోపాటు ఉద్యోగులు భాగస్వామ్యం పంచుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యమ సమయంలో జీతంకోసం పీఆర్సీ, జీవితం కోసం తెలంగాణ అనే నినాదంతో పనిచేసినట్టుగా తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం పనిచేయాలని కోరారు. ఉద్యోగులు ప్రభుత్వ కుటుంబసభ్యులని, ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని మరోసారి స్పష్టం చేశారు. ఏపీలో ఉన్న తెలంగాణ ఉద్యోగులందరినీ రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఏపీ సర్కార్ సానుకూలంగా స్పందించకపోవడంతో ఆలస్యమవుతున్నదని సమస్యను పరిష్కరిస్తామని స్పష్టంచేశారు. టీఎన్జీవో అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రాజేందర్, దేవీప్రసాద్ తదితర నాయకులందరూ ఉద్యోగుల సమస్యలను ప్రతిరోజూ తమ దృష్టికి తీసుకొస్తున్నారని, వాటిన్నింటినీ పరిష్కరించడం తమ బాధ్యతని తెలిపారు. ఏపీ సర్కార్ పెద్దలు భవనాలకు తాళాలు వేసుకున్నారని పేర్కొన్నారు. విభజన చట్టంలో ఉన్న లొసుగుల కారణంగా కొన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఉద్యోగుల విభజన సమస్యలను పరిష్కరించడం కోసం గవర్నర్ సమక్షంలో తెలంగాణ తరపున తాను, మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వివేక్, ఏపీ నుంచి యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు పాల్గొన్నామని, ప్రతిసారీ మీటింగ్ తర్వాత తమ ముఖ్యమంత్రికి చెప్తామని వెళ్లిపోవడం తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. ఈ వచ్చుడేంది, ముఖ్యమంత్రికి చెప్తామనడం ఏమిటో తమకు బోధపడకనే గవర్నర్‌కే విషయాలను నివేదించామని చెప్పారు. మూడేండ్ల కాలంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు, ఆర్టీసీ ఉద్యోగులకు హోంగార్డులకు, ఆశా వర్కర్లకు, ఐకేపీ ఉద్యోగులకు, వీఆర్‌వోలకు, వీఆర్‌ఏలకు, మునిసిపల్ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, 25వేల మంది విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు,అర్చకులకు, దేవాదాయ ఉద్యోగులకు, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రగతిభవన్‌కు పిలిచి జీతాలను పెంచారని గుర్తుచేశారు. 2015 పీఆర్సీ సందర్భంలో దేవీప్రసాద్ నాయకత్వంలో 42శాతం ఫిట్‌మెంట్ అడిగితే, 43శాతం ఇచ్చారని జ్ఞాపకం చేశారు. అందుకని ముఖ్యమంత్రిపైన భరోసాతో ఉండాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. విద్యుత్తు వ్యవస్థ పరిస్థితి చూసి కాంగ్రెస్ నేతలకు మైండ్‌బ్లాక్ అయ్యిందని ఎద్దేవాచేశారు. రాష్ట్రానికి మంచి పేరు రావడం కాంగ్రెస్ నాయకులకు ఇష్టంలేదా? అని ప్రశ్నించారు. మిషన్ కాకతీయను అధ్యయనం చేసేందుకు 10 రాష్ట్రాల నుంచి అధికారులు, ప్రభుత్వ పెద్దలు వస్తున్నారని, దేశమంతటా చర్చ జరుగుతున్నదని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వానికి జాతీయస్థాయిలో చాలా అవార్డులు వచ్చాయని చెప్పారు. నాల్గో తరగతి ఉద్యోగులను సొంతగడ్డకు తీసుకొని రావాలని, కొత్త జిల్లా కేంద్రాల్లో 20శాతం హెచ్చార్‌ఏ ఇవ్వాలని, క్యాడర్ స్ట్రెంత్‌ను ఖరారు చేయాలని మంత్రి హరీశ్‌రావుకు మండలి చైర్మన్ కే స్వామిగౌడ్ కోరారు. విభజనచట్టంలో ఉన్న లోపాలను సవరించాలని కేంద్రంతో పోరాడుతున్నా ఎటూ తేల్చకుండా, సమస్యలను పెంచుతున్నదని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ తూర్పారపట్టారు. సీపీఎస్ రద్దు కోసం ముందువరుసలో నిలిచి పోరాడుతామని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సబ్బండవర్గాల క్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి బాసటగా ఉంటామని ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంవో ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ అయాచితం శ్రీధర్, టీఎన్జీవో అసోసియేట్ ప్రెసిడెంట్ మందడి ఉపేందర్‌రెడ్డి, మహిళావిభాగం చైర్ పర్సన్ బండారు రేచల్, 31 జిల్లాల టీఎన్జీవో అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ పథకం కింద 162 కోట్లు మంజూరు

- మిషన్ కాకతీయ నాలుగోవిడుత 15లోగా ప్రారంభం: మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చిన్ననీటి వనరుల అభివృద్ధికి కేంద్రం ప్రవేశపెట్టిన జలవనరుల మరమ్మత్తులు, పునరుద్ధరణ, పునరావాసం (ఆర్‌ఆర్‌ఆర్) పథకం కింద కేంద్రప్రభుత్వం తెలంగాణకు రూ.162 కోట్లు మంజూరుచేసినట్టు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ నెలాఖరులోపు టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి ఫిబ్రవరిలో ట్రిపుల్ ఆర్ పనుల గ్రౌండింగ్ ప్రారంభించాలని ఆదేశించారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఉమ్మడి ఖమ్మం, మెదక్, నల్లగొండ జిల్లాల్లో ట్రిపుల్ ఆర్ పనులు చేపడుతామని చెప్పారు. ఖమ్మంలో 66, మెదక్‌లో 45, నల్లగొండలో 36 పనులు మొదలుపెట్టనున్నట్టు తెలిపారు. ట్రిపుల్ ఆర్ కింద ఇదివరకే పూర్తిచేసిన పనుల తాలూకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించి అదనపు గ్రాంట్లు వచ్చేలా చూడాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మిషన్ కాకతీయ 4వ దశ పనులను ఈ నెల 15 కల్లా ప్రారంభించాలని అధికారులను కోరారు. గురువారం రాత్రి జలసౌధలో మిషన్ కాకతీయ కార్యక్రమంపై మంత్రి హరీశ్‌రావు సమావేశం నిర్వహించారు. మిషన్ కాకతీయ పనుల్లో అలసత్వం వహించొద్దని స్పష్టంచేశారు. సమావేశంలో 'కాడా' కమిషనర్ మల్సూర్, ఈఎన్సీనాగేందర్‌రావు, సీఈలు శ్యాంసుందర్, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

తుంగభద్ర జలాల కోసం కర్ణాటక వినతి



గురువారం జలసౌధలో ఆర్డీఎస్‌లో తెలంగాణకు కేటాయించిన నీటిని వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర మంత్రి హరీశ్‌రావును కోరుతున్న కర్ణాటక మంత్రి పాటిల్. చిత్రంలో అలంపూర్ ఎమ్మెల్యే సంపత్ తదితరులు

- సీఎం కేసీఆర్‌తో చర్చించాక నిర్ణయం చెప్తామన్న మంత్రి హరీశ్‌రావు
- ఆర్డీఎస్ ఆధునీకరణ పనులపై త్వరలో మూడు రాష్ట్రాల సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తుంగభద్ర పరివాహక ప్రాంతంలో ఈ ఏడాది నీటికొరత తీవ్రంగా ఉన్నందున తమ రాష్ట్రంలో తుంగభద్ర ఆయకట్టును కాపాడుకునేందుకు, తాగునీటి అవసరాలకు ఆర్డీఎస్‌లో తెలంగాణకు కేటాయించిన నీటిని వినియోగించుకునేందుకు అనుమతించాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావును కర్ణాటక నీటిపారుదలశాఖ మంత్రి పాటిల్ కోరారు. ఈమేరకు ఆయన మంత్రి హరీశ్‌రావుకు గురువారం జలసౌధలో జరిగిన ఇరు రాష్ట్రాల సమావేశంలో ఓ వినతిపత్రం ఇచ్చారు. తుంగభద్ర డ్యాం నుంచి తెలంగాణకు 3.5 టీఎంసీల నీటి వాటా ఉన్నదని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఆర్డీఎస్ ఆయకట్టుకు అవసరమయ్యే నీటి వినియోగంపై, కర్ణాటకకు ఎంతమేర నీటి వాడకానికి అనుమతించగలమనే అంశంపై రెండు రాష్ట్రాల మధ్య చర్చ సాగింది. అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఏడు వేల ఎకరాలకు ఆరుతడి పంటలకు అవసరమైన సాగునీటి వాడకంపై రెండు రాష్ట్రాల ఇంజినీర్లు అంచనావేసిన అనంతరం మిగిలిన నీటిని కర్ణాటక వాడుకొనే అంశాన్ని పరిశీలిస్తామని మంత్రి హరీశ్‌రావు కర్ణాటక ప్రభుత్వానికి చెప్పారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించిన తర్వాత తమ నిర్ణయం చెప్తామని తెలిపారు. తుంగభద్ర నీటిని వాడుకున్నందుకు బదులుగా తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడు కోరినా నారాయణపూర్ డ్యాం నుంచి జూరాలకు రెండు టీఎంసీల నీటిని విడుదల చేస్తామని కర్ణాటక హామీ ఇచ్చింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల ప్రాంత రైతాంగానికి 87వేల ఎకరాలకు సాగునీరందించాల్సిన ఆర్డీఎస్ నుంచి ప్రస్తుతం 20వేల ఎకరాలకు కూడా సాగునీరందడం లేదని హరీశ్‌రావు తెలిపారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టినప్పటికీ ఇప్పటికీ పూర్తికాలేదన్నారు. ఇందుకోసం అవసరమైన నిధులు కర్ణాటక సమకూర్చుతుందని ఆ రాష్ట్ర మంత్రి పాటిల్ పేర్కొన్నారు. ఏపీ సహకారం లేకుండా ఆర్‌డీఎస్ ఆధునీకరణ పనులు పూర్తికావని పాటిల్ అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై మూడు రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రులు, కార్యదర్శులతో త్రైపాక్షిక సమావేశానికి తెలంగాణ చొరవ చూపాలని హరీశ్‌రావును కోరారు. దీనిపై ఏపీ మంత్రి దేవినేనితో ఫోన్‌లో మాట్లాడతానని చెప్పారు. సమావేశంలో కర్ణాటక మంత్రులు తన్వీర్‌షెట్, సంతోష్‌లాడ్, అలంపూర్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జోషి, నీటిపారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాకేశ్‌సింగ్, డిప్యూటీ సెక్రటరీ అనిల్‌కుమార్, కర్ణాటక జలవనరుల విభాగం ఎండీ మల్లిఖార్జున గూంగే, ఈఎన్సీ మురళీధర్ రావు, సీఈ ఖగేందర్‌రావు, అంతరాష్ట్ర జలవనరుల సీఈఎస్ నరసింహారావు పాల్గొన్నారు.



ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ ప్రదర్శనలో మేం ఐక్యతా ప్రతిమను ప్రదర్శించాలనుకున్నాం. మా శకటాన్ని బీజేపీ తిరస్కరించింది. దీంతో గణతంత్ర వేడుకల నుంచి మేం వైదొలుగుతున్నాం. విభజన సిద్ధాంతాన్ని విశ్వసించేవారికి ఐక్యత నచ్చదు.

మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

మేం ఆలయాలకు పోతే, మతవాదులం అంటారు. కానీ తృణమూల్ కాంగ్రెస్ నాయకులు ఆలయాలకు పోతే మాత్రం లౌకికవాదులు. హిందువులు అంతా బీజేపీ గొడుగు కింద ఏకం కాకుండా నివారించడానికి తృణమూల్ కాంగ్రెస్ నాయకులు మెతక హిందుత్వ విధానాన్ని అనుసరిస్తున్నారు. సీఎం మమతా బెనర్జీ ఈ విషయంలో రాహుల్‌గాంధీ దగ్గర పాఠాలు నేర్చుకుంటున్నారు.

దిలీప్ ఘోష్, పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు



చరిత్రలో నేడు



1900

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటుకు పిలుపునిచ్చిన ఐరిష్ నేత జాన్ ఎడ్వర్డ్ రెడ్‌మాండ్.

1925

అమెరికాలో మొదటి మహిళా గవర్నర్‌గా నియమితులైన నెల్లీ టేలర్ రాస్.





1972

షేక్ ముజీబుర్ రహ్మాన్‌ను జైలు నిర్బంధం నుంచి విడుదల చేసిన పాక్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో.

నా దగ్గరా న్యూక్లియర్ బటన్ ఉన్నది. మీ కన్నా పెద్దది, శక్తిమంతమైనది అంటూ- అధ్యక్షుడు ట్రంప్ కొత్త సంవత్సరాన్ని ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్‌ను బెదిరిస్తూ ప్రారంభించారు. కానీ దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జాయె మాత్రం కోపంతో ఉన్న చిన్న పిల్లవాడిని బుజ్జగించినట్టు చతురతతో వ్యవహరిస్తున్నారు. రెండేండ్ల కిందట తెగిపోయిన సంబంధాలను పునరుద్ధరించడానికి యత్నిస్తున్నారు. సత్సంబంధాలను నెలకొల్పుకోవడానికి, దక్షిణ కొరియాలో జరిగే శీతాకాల ఒలింపిక్ క్రీడలకు ఆటగాళ్ళను పంపడానికి కిమ్ సానుకూలత వ్యక్తం చేశారు. దీనిని ఉపయోగించుకోవాలని దక్షిణ కొరియా ప్రయత్నిస్తున్నది.

ది న్యూయార్క్ టైమ్స్

2018లో కొరియా ద్వీపకల్పంలో పరిస్థితి ఎట్లా ఉంటుందనేది అనిశ్చితంగా మారింది. అయినప్పటికీ సంవత్సరారంభంలో రెండు కొరియాల మధ్య హాట్‌లైన్ ఏర్పడ్డది. సత్సంబంధాల పునరుద్ధరణ ద్వారా కొత్త ద్వారాలు తెరుచుకుంటున్నాయి. కానీ అమెరికా ఇదేమీ పట్టనట్టుగా ఉన్నది. ఉత్తర కొరియా అణ్వస్త్రాలను నిషేధించేవరకు చర్చలు జరుపను అంటున్నది. అణ్వస్త్ర సంక్షోభాన్ని నివారించడం ప్రస్తుతం ప్రపంచంలో అత్యంత క్లిష్టమైన లక్ష్యం. నా దగ్గర ఉన్న బటన్ పెద్దది, శక్తిమంతమైనది అని చెప్పుకోవడం పరిష్కారం కాదు.

గ్లోబల్ టైమ్స్

వైద్య సంస్కరణలు

వైద్యవిద్యను, వృత్తిని ప్రక్షాళన చేయడానికి ఉద్దేశించిన జాతీయ వైద్య కమిషన్ బిల్లు వైద్యాన్ని ప్రజలకు మరింత చేరువగా చేయడానికి బదులు ప్రైవేటీకరణకు తలుపులను బార్లా తెరుస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి. వైద్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురు కావడంతో, లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లును పార్లమెంటరీ స్థాయీ సంఘానికి పంపించారు. ఈ బిల్లు ప్రజలకు, రోగులకు వ్యతిరేకమైనదని భారతీయ వైద్య మండలి (ఐఎంఏ) అభివర్ణించింది. వైద్యులను పనిచేయకుండా చేస్తుందని, బ్యూరోక్రసీకి, వైద్యేతర అధికారులకు జవాబుదారీగా మారుస్తుందని వైద్య సంఘం ఆందోళన వ్యక్తపరుస్తున్నది. కానీ ఈ బిల్లు వైద్య వృత్తికి ఎంతో ఉపయోగకరమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా అంటున్నారు. వైద్యులతో ఈ బిల్లు విషయమై చర్చలు జరుపుతున్నామని ఆయన తెలిపారు. ఈ వాదనలు ఎట్లా ఉన్నా, గ్రామీణ ప్రాంతాలలో వైద్యుల కొరత తీవ్రంగా ఉన్నదనేది వాస్తవం. ప్రతి వెయ్యి మంది రోగులకు ఒక వైద్యుడు ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశిస్తున్నది. కానీ మన దేశంలో 1674 మందికి ఒక వైద్యుడున్నాడు. వైద్యులు ఎక్కువగా నగర ప్రాంతాలకు పరిమితమై ఉండగా, గ్రామీణ ప్రజలు వైద్యం అందక అల్లాడిపోతున్నారు. గ్రామీణ ఆరోగ్య గణాంకాలూ ఇదే విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. పిల్లకు పోషకాహార లోపం ఉన్నా, చిన్న ఆరోగ్య సమస్యలు వచ్చినా సలహా ఇచ్చే దిక్కులేదు. వృద్ధులు ప్రతి అవస్థకు పట్టణాలకు పరుగెత్తక తప్పడం లేదు. గర్భిణీలకు సూచనలు ఇచ్చే పరిస్థితి లేదు. ప్రసూతి చేయడానికి కనీస అవగాహన ఉన్న వారు లేరు. ఈ పరిస్థితులను చక్కదిద్దడానికి వీలుగా ప్రభుత్వం చిత్తశుద్ధితో వైద్య విద్యను, వృత్తిని సంస్కరించవలసిన అవసరం మాత్రం ఉన్నది.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు ప్రకారం- భారతీయ వైద్య మండలిస్థానంలో జాతీయ మెడికల్ కమిషన్ ఏర్పాటవుతుంది. ఇందులో ఉండే 25మంది సభ్యులలో ఐదుగురు మాత్రమే వైద్యులు ఎన్నుకున్న ప్రతినిధులు ఉంటారు. వారు కూడా పూర్తిస్థాయి సభ్యులు కారు. మిగిలిన 20 మంది సభ్యులలో పదిహేను మంది వైద్య రంగానికి చెందిన వారై ఉండాలని లేదు. ప్రజాస్వామికంగా వైద్యుల నిర్వహణ స్థానంలో ప్రభుత్వ పెత్తనాన్ని, వృత్తికి సంబంధించని వారి ప్రాబల్యాన్ని తెచ్చే ప్రయత్నం జరుగుతున్నదని వైద్యులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఇప్పుడు వైద్య కళాశాలల్లో 15 శాతం సీట్ల ద్వారా యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేసుకోగలుగుతున్నాయి. తాజా బిల్లు ప్రకారం యాజమాన్యాలు అరువై శాతానికి పైగా సీట్ల నుంచి అధిక ఫీజులు పొందవచ్చు. ప్రైవేటు కళాశాలలు సీట్లు పెంచుకోవడానికి అనుమతి అవసరం లేదు. వైద్య విద్యను ప్రైవేటు శక్తుల చేతుల్లో పెట్టడమే బిల్లు లక్ష్యమనేది ప్రధాన విమర్శ. 'ప్రత్యామ్నాయ' వైద్య విద్య చేసిన వారు బ్రిడ్జి కోర్సు పూర్తి చేసినట్టయితే ఆలోపతి చికిత్స చేయడానికి అనుమతి ఇవ్వాలనే ప్రతిపాదనను కూడా ఆలోపతి వైద్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల ప్రత్యామ్నాయ వైద్యవిద్యను అందిస్తున్న కళాశాలల్లో సీట్లకు డిమాండ్ పెరుగుతుందని అంటున్నారు. 'ప్రత్యామ్నా య' వైద్యులు ఆలోపతి మందులు సూచించడం ఔషధ కంపెనీలకు మాత్రమే లాభిస్తుందని అంటున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం- ఎంబీబీఎస్ చేసిన వైద్యులు కూడా ప్రత్యేక కోర్సు లు అభ్యసించనట్టయితే, శస్త్ర చికిత్స చేయకూడదు. ఈ నిబంధనలను సడలించి ఆలోపతి వైద్యు లు, నర్సుల సేవలను మరింత విస్తృతంగా ఉపయోగించుకోవడం శ్రేయస్కరమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

తమ స్వతంత్రతను కాపాడుకోవడానికి ఆలోపతి వైద్యులు ప్రతిఘటిస్తున్న తీరు అభినందనీయం. అయితే ఆలోపతి వైద్యులు కూడా ఆత్మవిమర్శ చేసుకోవలసి ఉన్నది. భారతీయ వైద్య మండలి అవినీతి మయం అయినందు వల్లనే ప్రభుత్వానికి కొత్తగా చట్టం చేయవలసిన అవసరం ఏర్పడ్డది. ఈ అవినీతిని ఎట్లా అరికట్టాలనే మార్గం వారే చూపించాలె. ఎంతోమంది వైద్యు లు విలువలను కాపాడుకుంటూ, రోగుల అభిమానాన్ని పొందుతున్నారు. అయినప్పటికీ, స్థూలంగా వైద్యరంగంలో విలువలు లోపించి వ్యాపారమయం అయింది.

తమ స్వతంత్రతను కాపాడుకోవడానికి ఆలోపతి వైద్యులు ప్రతిఘటిస్తున్న తీరు అభినందనీయం. అయితే ఆలోపతి వైద్యులు కూడా ఆత్మవిమర్శ చేసుకోవలసి ఉన్నది. భారతీయ వైద్య మండలి అవినీతిమయం అయినందు వల్లనే ప్రభుత్వానికి కొత్తగా చట్టం చేయవలసిన అవసరం ఏర్పడ్డది. ఈ అవినీతిని ఎట్లా అరికట్టాలనే మార్గం వారే చూపించాలె. ఎంతోమంది వైద్యులు విలువలను కాపాడుకుంటూ, రోగుల అభిమానాన్ని పొందుతున్నారు. అయినప్పటికీ, స్థూలంగా వైద్యరంగంలో విలువలు లోపించి వ్యాపారమయం అయింది. ఒకప్పుడు వైద్యుడే కేంద్రంగా చికిత్సా విధానం ఉండేది. కానీ ఇప్పుడు ప్రైవేటు దవాఖానల్లో వైద్యులు స్వతంత్రతను కోల్పోయి డబ్బు సంపాదించి పెట్టే ఉపకరణంగా మారారు. హక్కుల కోసం పోరాడుతున్న వైద్యులు ఈ దుస్థితిని చక్కదిద్దే బాధ్యత కూడా తమదేనని గుర్తించాలె. ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాలలో మల్టీడిసిప్లినరీ అప్రోచ్ ప్రాచుర్యం పొందుతున్నది. విజ్ఞానాన్ని సమ్యక్‌దృక్పథంతో అధ్యయనం చేస్తున్నారు. కానీ ఆలోపతి అనీ, ఆయుష్ అనీ గిరిగీసుకోవడం ఎంతవరకు సమంజసం? తమ విధానమే గొప్పదనే దురవగాహన వదులుకొని అన్నిరంగాలను అధ్యయనం చేసే దిశగా వైద్యరంగాన్ని సంస్కరించుకోవడం అవసరం. గ్రామీణ ప్రాంతాలలో వైద్యం అందించవలసిన అవసరాన్ని కూడా గుర్తించాలె. సాధారణ వైద్యాన్ని అందించడానికి సంక్లిష్ట వైద్యపరిజ్ఞానం అవసరంలేదు. విజ్ఞానాన్ని ప్రజలకు చేరువచేయడానికి తగిన సూచనలు వైద్యుల నుంచి రావాలె. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బిల్లులో లోపాలు ఉండవచ్చు. కానీ కొత్త చట్టం చేయవలసిన అవసరం మాత్రం ఉన్నది. ప్రభుత్వంతో నిర్మాణాత్మక చర్చలు జరిపి వైద్యాన్ని సమాజానికి చేరువ చేయవలసిన బాధ్యత వైద్యులది.

జనగళం

క్షమాపణలు చెప్పాలె

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో కొందరు ఆంధ్రా కవులు తెలంగాణ కవి, కథా రచయిత స్కైబాబపై దాడికి పాల్పడటం హేయనీయం. 'తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్రాపై విషంగక్కావ్, ఈ నేల పై నువ్వెట్ల అడుగుపెడుతావ్' అంటూ ఘెరావ్ చేయడం రెండు ప్రాంతాల మధ్య అగ్గిరాజేయడమే తప్ప వేరే ఉద్దేశం లేదు. పుస్తక ఆవిష్కరణకు అతిథిగా పోయిన ఒక తెలంగాణ కవి పట్ల దురుసుగా ప్రవర్తించడం అక్కడి వారి విజ్ఞతకే వదిలిపెట్టాలి. అంతేకాకుండా ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆంధ్రా కవులకు దక్కిన గౌరవాన్ని గుర్తుంచుకొని స్కైబాబకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి.

- పెంచాల విశ్వాస్‌రావు, హైదరాబాద్

కక్షిదారులకు న్యాయం చేయాలె

న్యాయవ్యవస్థలో ఏండ్ల తరబడి లక్షల కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి. కారణాలు ఏవైనా న్యాయం అందరికీ జరుగాలన్నదే ముఖ్య ఉద్దేశం. కానీ అది మచ్చుకు కూడా కనిపించడం లేదు. దానికి సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల కల్పన లేకపోవడం, నిర్లక్ష్యం, అవినీతి పేరుకోవడం ఇలా చాలా కారణాలున్నాయి. ఇప్పటికైనా న్యాయవ్యవస్థ చొరవ తీసుకొని కక్షిదారులకు న్యాయం చేయాలె.

- వీర పూర్ణచందర్‌రావు, హైదరాబాద్


అప్రమత్తత అవసరం

సంక్రాంతి పండుగ వస్తున్నది. ఈ పండుగను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రయాణికులకు ఎటు వంటి ఇబ్బందులు కలుగకుండా వీలైనన్ని బస్సులను సమకూర్చాలి. లేకుంటే ప్రయాణికులు ఇబ్బందులు పడే అవకాశాలుంటాయి. కాబట్టి అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- తాళ్లపెల్లి మనోజ్‌కుమార్, కాట్నపల్లి, కరీంనగర్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

విశ్లేషణ



శేఖర్ గుప్తా

అవినీతి నిర్మూలనా.. ఆధిపత్యమా!

దేశంలో జరుగుతున్న అవినీతి, నేరాలకు కులం ఉన్నదా! అంటే ఉన్నదనే వాదనలు వినిపిస్తున్నాయి. వెలుగులోకి వస్తున్న ఆర్థిక అవినీతి నేరాలు, విచారణలు, శిక్షల విషయం చూసినప్పుడు కులం ఛాయలు కనిపిస్తున్నాయంటున్నారు కొందరు విశ్లేషకులు. అవినీతి సర్వత్రా వ్యాపించి ఉన్న విషయం అందరికీ తెలిసిన విషయమే. అయితే వెలుగులోకి వస్తున్న అవినీతి కేసులు, పట్టుబడుతున్న వారిని చూస్తే.. సమాజంలోని నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో కిందివరుస కులాల్లోని వారే ఎక్కువ శాతం ముద్దాయిలుగా పట్టుబడుతున్నారని, నేరస్తులుగా కోర్టులలో ముద్ర వేయబడుతున్నారని అంటున్నారు. దీనికి అనేక ఉదంతాలు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

సుఖ్‌రామ్, రాజా ఇద్దరూ కేంద్ర మంత్రులుగా టెలికాం మంత్రులుగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. సుఖ్‌రామ్ దోషిగా నిలిచాడు. రాజా మాత్రం నిర్దోషిగా బయటపడ్డాడు. ఇందులో సుఖ్‌రామ్ తను పడుకునే మంచం బెడ్డుకింద నోట్లకట్టలు దొరికాయి. కానీ మరో ఉదంతం రాజా విషయంలో ఎలాంటి డబ్బులు దొరుకలేదు. డబ్బులు దొరుకనప్పుడు అవినీతిపరుడని ఎలా అంటామని న్యాయమూర్తి అమాయకంగా ప్రశ్నిస్తూ, అతన్ని నిర్దోషిగా తీర్పు ప్రకటించారు. ఈ క్రమంలో చూస్తే.. సుఖ్‌రామ్ బ్రాహ్మణుడు. రాజా దళితుడు. మరి అవినీతి, నేరాల విషయంలో కులం పాత్ర గురించి చర్చించుకోవాల్సిందే.

అవినీతికేసులు, వాటి విచారణలది సుదీర్ఘ, విచిత్ర చరిత్ర. ఏ రాజాపై ఆరేండ్లుగా విచారణ కొనసాగింది. ఆ క్రమంలో ఆయన 15 నెలలు జైలు జీవితం గడుపాల్సి వచ్చింది. అలాగే ఆయనపార్టీ సహచరులు కనిమొళి వెనుకబడిన వర్గానికి చెందినవారు. ఆమె కూడా నిర్దోషిగా బయటపడ్డారు. అలాగే బొగ్గు కుంభకోణంలో దోషిగా తేలిన మధుకోడా, అవినీతి, అసత్య ఆరోపణల నేపథ్యంలో శిబూసోరేన్ నిర్దోషిగా బయట కివచ్చాడు. వీరిద్దరూ ఆదివాసులు.

ఇదే క్రమంలో అవినీతి ఆరోపణల గతంలోకి వెళ్లి చూస్తే.. మాయావతి దళితురాలు. లాలూప్రసాద్ యాదవ్, ములాయంసింగ్ యాదవ్ అవినీతి ఆరోపణలు, ఆదాయానికి మించిన ఆస్తుల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వీరు ఓబీసీ వర్గానికి చెందినవారు. ఇలా అనేక అవినీతి ఆరోపణలు, విచారణలు, అప్పుడప్పుడు అవినీతి కేసులు పతాక శీర్షికలకు ఎక్కడం లాంటివన్నీ మెరుపులుగా కనిపిస్తుంటాయి. ఇవన్నీ రాజకీయవర్గాల అవసరాల నేపథ్యంలో వెలుగుచూస్తున్నాయి. చర్చల్లోకి వస్తున్నాయి. ఇంకా చెప్పాలంటే పాలకపక్ష రాజకీయ అవసరాల నేపథ్యంలో కొన్ని అవినీతికేసులు ముందుకు వస్తున్నాయి. మీడియా పతాక శీర్షికల్లోకి వస్తున్నాయి. ఇదంతా ముందస్తు ప్రణాళికతో నడుస్తున్న తతంగంగా కనిపిస్తుంది. అంతిమంగా చూస్తే రాజకీయ ప్రయోజనాలే అవినీతి కేసుల అంతరార్థం అని అర్థమవుతున్నది.

ఈ క్రమంలో చూస్తే.. అవినీతి అక్రమాల కేసులో అతి ఎక్కువ జైలు శిక్ష అనుభవించిన వాడు హర్యానా మాజీ ముఖ్యమంత్రి ఓంప్రకాశ్ చౌతాలా ముందువరుసలో ఉన్నాడు. ఇతను ఓ జాట్ కులస్తుడు. మొత్తంగా చూస్తే.. అవినీతి ఆరోపణలతో జైలుశిక్షలు అనుభవిస్తున్న వారిలో ఎవరు ఎక్కువ ఉన్నారు, ఉంటున్నారంటే.. అగ్రవర్ణాల కంటే వెనుకబడిన వారేననేది అర్థమయ్యే విషయమే.

అవినీతి కుంభకోణాల గత చరిత్రలోకి చూస్తే.. 2008లో జరిగిన 'ఓటుకు నోటు' కేసులో ఫగ్గన్ సింగ్ కులస్తే, అశోక్ అర్గల్, మహవీర్‌సింగ్ భగోరాలు స్టింగ్ ఆపరేషన్‌లో అడ్డంగా దొరికారు. వీరిని వెనుక ఉండి నడిపించిన వారు తప్పించుకున్నారు. కానీ వీరు పట్టుబడ్డారు. వీరంతా ఎస్సీ, ఎస్టీలు. దీనికి ముందు 2005లో జరిగిన 'పైసలకు ప్రశ్న' కుంభకోణంలో 11 మంది ఎంపీలు తమ సభ్యత్వాన్ని కోల్పోయారు. వీరిలో ఆరుగురు బీజేపీకి చెందినవారు కాగా, ముగ్గురు బీఎస్పీకి చెందినవా రు, ఒకరు కాంగ్రెస్, ఒకరు ఆర్జేడీ పార్టీలకు చెందినవారు. ఇంకా నరేం ద్ర కుశావాహ, రాజారాంపాల్ ఇద్దరూ ఓబీసీలు, లాల్‌చంద్రకోల్ దళితుడు.

అయితే అవినీతి ఆరోపణలు, శిక్షల్లో కొందరు ఉన్నత కులాల వారు కనిపిస్తుండొచ్చు. సుఖ్‌రామ్, జయలలిత, సురేష్‌కల్మాడీ లాంటి వారు కొందరున్నారు. అయితే అవినీతి ఆరోపణలు, శిక్షలుపడిన వారిలో చూస్తే మిగతా వర్గాలవారితో పోల్చితే చాలా తక్కువ. ఈ క్రమంలో వారికి ఉన్న ప్రత్యేక పరిస్థితి ఏంటంటే, వారికి అవినీతి ఆరోపణల నుంచి బయటపడేందుకు అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. లేదా ఆ కేసులు సాచివేతతో విచారణ పేరుతో కొనసాగుతుంటాయి. ఇదిలా ఉంటే.. అవినీతి ఆరోపణలు, శిక్షల వాస్తవం ఎలా ఉంటుందంటే.. సుఖ్‌రామ్ తన బెడ్డుకింద నోట్ల కట్టలతో దొరికి పదేండ్ల శిక్ష పడితే ఆయన జైలు జీవితం గడుపాలి. కానీ ఎన్నడూ జైలులో ఉండలేదు. అంతేకాకుండా ఆయన సుదీర్ఘకాలం కాంగ్రెస్ సభ్యునిగా కొనసాగారు. ఇప్పుడు ఆయన వయస్సు 90 ఏండ్లు. ఇక ఆయన జైలుకు పోయే పరిస్థితే ఉత్పన్నం కాదు. ఇంకా ఇప్పుడాయన బీజేపీ నీడన సేదతీరుతున్నాడు. అంతేకాదు సుఖ్‌రామ్ ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించబడటంతో ఆయన, తన కుమారుడు అనిల్‌ను రంగంలోకి దించాడు. ఆయనిప్పుడు హిమాచల్‌ప్రదేశ్‌లో బీజేపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు.

ఈ క్రమంలోనే నేను ప్రత్యేకంగా చెప్పదల్చుకున్నదేమంటే.. నేరారోపణలు, శిక్షల విషయంలో ఎవరు శిక్షలకు గురవుతున్నారు, ఎవరు శిక్షలకు దూరంగా తప్పించుకుంటున్నారు, అనేక కారణాలతో మినహాయింపులు పొందుతున్నారనేది గమనించాలి. సుఖ్‌రామ్ బ్రాహ్మణుడు. అందరూ అనుకుంటున్నట్లు అగ్రవర్ణాలు, బ్రాహ్మణులు సాధారణంగా అవినీతిపరులని ఎలా చెబుతారు! అలాగే రాజా దళితుడు. దళితుని విషయంలో ఇంతకన్నా ఎక్కువేం ఊహిస్తాం. వారు ప్రభుత్వవర్గాన్ని అధికార బలంతో ప్రభావితం చేశారని అందామా? ఇంకా ఇలాంటి అనేక అనుమానాలుండనే ఉంటాయి.

మన వ్యవస్థలో అగ్రవర్ణ ఆధిపత్యవర్గాలు పాలనావ్యవస్థలన్నింటినీ తమ గుప్పిట్లో పెట్టుకొని వెనుకబడిన బడుగువర్గాలపై ఆధిపత్యం చెలాయిస్తున్నారనడానికి దాఖలాలు కనిపిస్తున్నాయి. ఈ సందర్భంగానే సచార్ కమిటీ చేసిన సూచన కూడా గమనార్హమైనది.

ఇక్కడనే మరో ఆసక్తికరమైన అవినీతికేసు గురించి చెప్పుకోవాలి. ఇది బీజేపీలో జరిగింది. బీజేపీలో ఇద్దరు సీనియర్ నేతలు వేర్వేరు సందర్భాల్లో నేరుగా స్టింగ్ ఆపరేషన్‌లో దొరికిపోయారు. ఒకరు దలిప్ సింగ్ జూడియో. ఇతను 2003లో రూ.9 లక్షల లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయాడు. ఇతను ఉన్నత కులానికి చెందినవాడు. వెంటనే బీజేపీ పునరావాసం కల్పించింది. మరోచోట ఎన్నికల్లో పోటీ చేయటానికి అవకాశం కల్పించి పార్లమెంట్‌కు పంపింది. ఇతను బాలీవుడ్ సినిమా స్క్రిప్టును తలపించేవిధంగా నేరుగా దొరికిపోయాడు. ఈ నేపథ్యంలోనే ఓ మంచి సామెత ప్రచారంలోకి వచ్చింది. 'పైసానే పరమాత్ర కాకపోవచ్చు. కానీ పైస పరమాత్మ కన్నా తక్కువ మాత్ర కాదు' అని. అయినా ఇతను వాజపేయి మంత్రివర్గంలో జూనియర్ మంత్రిగా పనిచేశాడు. మరొకరు బంగారు లక్ష్మణ్. ఇతను రూ.లక్ష లంచం తీసుకుంటూ తెహల్కా స్టింగ్‌లో దొరికిపోయాడు. ఇతను దళితుడు. బీజేపీలో అత్యున్నత స్థానానికి ఎదిగిన నేత. జాతీయ అధ్యక్షుడిగా ఉన్నాడు. అయినా ఆయనకు బీజేపీ ఏ విధంగానూ అండగా నిలబడలేదు. పార్టీలో ఒంటరివాడైపోయాడు. అన్ని పదవుల నుంచి తప్పించబడ్డాడు. చివరికి ఆ అవమానకర పరిస్థితిలో, ఎవరికీ కానివాడై కుమిలి, కృషించి చనిపోయాడు. ఇక్కడ సమస్యేమంటే.. జూడియో ఎందుకు, ఎలా పునరావాసం పొందగలిగాడు? బంగారు లక్ష్మణ్ మాత్రం ఎందుకు ఒంటరి వాడయ్యాడు? ఇందులో కులం ప్రాధాన్యం, పాత్ర లేదా?.

ఇదే వాదనను న్యాయవ్యవస్థకు కూడా ఆపాదించవచ్చా? దీనికి మినహాయింపేమీ కాదని అనేక ఉదంతాలున్నాయి. న్యాయవ్యవస్థలోని అవినీతిపైనే కదా అన్నాహజారే ఉద్యమం చేసింది. న్యాయమూర్తుల్లో ఎక్కువ శాతం అవినీతిలో కూరుకుపోయారని ఆయన ఆరోపించారు. చివరికి చీఫ్ జస్టిస్ కూడా దీనికి అతీతుడు కాదన్నారు. కానీ మనకు కేజీ బాలక్రిష్ణన్ దొరికాడు. ఆయన దళితుడు. ఆయనపై దశాబ్దకాలంగా ఎన్నో విధాలా కన్ను వేసి ఉంచింది. అయినా ఏమీ దొరుకలేదు. చివరికి కోర్టు ధిక్కారం కేసులో ఆయన్ను దోషిగా తేల్చారు. ఈ క్రమంలో చూస్తే.. 2-జీ స్పెక్ట్రం కేసులో 122 టెలికాం అనుమతుల విషయంలో ఎంతో మంది న్యాయమూర్తుల సంతకాలూ ఉన్నాయి. వారిపై ఏ విచారణ జరుగలేదు. మరి కొందరిపై లైంగిక వేధింపుల ఆరోపణలున్నాయి. అయినా ఇవేవీ విచారించదగ్గ ఆరోపణలు కాలేదు. కానీ కేజీ బాలక్రిష్ణన్ కేసులో నోటి దురుసుతనం, కోర్టు ధిక్కారం కేసులు తీవ్రమైనవిగా పరిగణించబడ్డాయి. చివరికి ఆయన్ను జైలుకు పంపారు.

అంతిమంగా చూస్తే.. మన వ్యవస్థలో అగ్రవర్ణ ఆధిపత్యవర్గాలు పాలనా వ్యవస్థలన్నింటినీ తమ గుప్పిట్లో పెట్టుకొని వెనుకబడిన బడుగు వర్గాలపై ఆధిపత్యం చలాయిస్తున్నారనడానికి దాఖలాలు కనిపిస్తున్నాయి. ఈ సందర్భంగానే సచార్ కమిటీ చేసిన సూచన కూడా గమనార్హమైనది. ప్రభుత్వ ఉద్యోగాల్లో అతి కనిష్ఠంగా ముస్లింలు ఎందుకున్నారు అనేదానికి సమాధానం ఏమిటి? వారికి ఏ నైపుణ్యాలు, చదువులు లేకపోవటమే కారణమా? అలాగే దేశంలోని జైళ్లలో ఎక్కువమంది ముస్లింలే ఎందుకున్నారు? వారిపట్ల వివక్ష కొనసాగుతున్నది అనటానికి జైళ్లలోని సంఖ్యనే సాక్ష్యమని సచార్ కమిటీ తెలిపింది. అలాగే దేశంలోని జైళ్లను పరిశీలిస్తే.. గరిష్ఠ సంఖ్యలో నిమ్న, వెనుకడినవర్గాల వారే జైళ్లలో ఎందుకు మగ్గుతున్నారు? వారే నేరాలు, ఘోరాలు, హత్యలు చేస్తున్నారా? అంటే ఉన్నతవర్గాల వారికన్నా, వెనుకబడిన బడుగువర్గాల వారిలో నేర స్వభావం ఎక్కువ ఉంటుందని అనుకుందామా? ఉరితీయబడిన వారిలో ఎక్కువ దళితులు, మైనారిటీ వర్గాల వారే ఎందుకున్నారు?

ఈ క్రమంలోనే మరో ముఖ్యమైన ప్రశ్న మనం వేసుకోవాలి. నేరాలు, అవినీతి గురించి పోలీసులు, న్యాయవ్యవస్థ, పాలనావ్యవస్థల్లో ప్రత్యేక వర్గం వారిలో జన్యుపరమైన లక్షణాల కారణంగానే ఆ దుర్గుణాలున్నాయని భావిస్తున్నారా? నిజానికి మన పాలక వ్యవస్థలు, మీడియా, పోలీసుల తీరును చూస్తే అలానే అనిపిస్తుంది. దళిత, మైనార్టీల విషయంలోనూ ఒకే నీతి ఉన్నది. అది ఆధిపత్యనీతి. అణిచివేతనీతి.

(వ్యాసకర్త: 'ది ప్రింట్' చీఫ్ ఎడిటర్)

సమగ్ర దృక్పథంతో బీసీల అభివృద్ధి

తెలంగాణం



డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

ఉమ్మడి రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి ఏ ప్రభుత్వాలు ఏం చేశాయో, ఎన్ని నిధులు కేటాయించాయో పరిశీలిస్తే బీసీలను ఎంత నిర్లక్ష్యం చేశాయో స్పష్టమవుతుంది. 1995-2004 వరకు తొమ్మిదేండ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం బీసీలకు కేటాయించి ఖర్చుచేసిన నిధులు 1764.20 కోట్లు. 2004-09 వరకు ఆరేండ్లు వైఎస్సార్ పాలనలో బీసీల కోసం ఖర్చుచేసింది 4143.35 కోట్లు. 2010-11లో అధికారంలో రోశయ్య ప్రభుత్వం 1996.34 కోట్లు ఖర్చుచేసింది. 2011-14 వరకు మూడేండ్లు కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వం 5356.66 కోట్లు ఖర్చుచేసింది. అదే కేసీఆర్ నాయకత్వంలో ఏర్పడ్డ టీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014-18 మూడున్నరేండ్లలోనే 8223.54 కోట్లు ఖర్చు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాలన్నీ అరకొర నిధులే ఖర్చుచేశాయి. కాబట్టి ఏ ప్రభుత్వా లు బీసీలను ఉద్ధరించాయో, ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి ఏ మేరకు కృషి చేశాయో తెలుస్తున్నది.

దేశ జనాభాలో సగం ఉన్న బీసీల విషయంలో సబ్‌ప్లాన్ ఆధారంగా ఆర్థిక ప్రణాళికలు రూపొందించి అందుకనుగుణంగా నిధులను కేటాయించి, ఖర్చుచేసే విధానం అమల్లో లేని కారణంగా దేశం ఆశించినంత ప్రగతిని సాధించలేకపోతున్నది. అయితే ఇందుకు భిన్నంగా తెలంగాణ ప్రభుత్వం కుటుంబంలోని ప్రతి వ్యక్తిని నిర్దిష్టంగా లెక్కగట్టి అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలతో అడుగులు ముందుకు వేస్తున్నది. ఈ వర్గాల జీవన ప్రమాణాల మెరుగుదల జరుగాలంటే ప్రతి వ్యక్తినీ, కుటుంబాన్ని ప్రామాణికంగా తీసుకొని నిధుల కేటాయింపులు చేసినప్పుడు మాత్రమే ప్రగతి సాధ్యమని తెలంగాణ ప్రభుత్వం భావించడం ఆ దిశగా కార్యాచరణను మొదలుపెట్టడం జరిగింది. ఇది దేశంలో ఒక గొప్ప శుభారంభం.

జాతీయ ఆదాయంలో బీసీలు సగం ఆదాయం సృష్టిస్తున్నారు. కానీ తొలి జాతీయ ప్రభుత్వం నుంచి నేటివరకు ఏ జాతీయ ప్రభుత్వాలు ఈ వర్గాల అభివృద్ధికి జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి ఖర్చు చేయడానికి ముందుకురాలేదు. మానవజాతి మనుగడ సాధించకుండా అభివృద్ధి ఫలాలను అందుకొని ప్రగతిపథంలోకి రాకుండా దేశం అభివృద్ధి జరిగింది చెప్పుకోవడం ప్రజాస్వామ్య ప్రభుత్వాలు చేయాల్సిన పనికాదని ఆర్థిక నిపుణులు 'నోబెల్ ప్రైజ్ గ్రహీత అమర్త్యసేన్' చెప్పడం గమనించదగింది. అయితే ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయస్ఫూర్తితో పథక రచనచేస్తూ, వాటి అమలు ద్వారా దేశానికే మార్గదర్శకంగా నిలుస్తున్నది. సంక్షేమం ద్వారా మాత్రమే సామాజిక మార్పు సాధ్యమని భావించి, ప్రజలతో మమేకమై పనిచేస్తూ ప్రజల ఆశలు, ఆశయా లు, ఆకాంక్షలకు అనుగుణంగా వడివడిగా కొత్త పథకాలతో ముందుకు దూసుకుపోతున్నది. సంక్షేమం-అభివృద్ధిలో రాజకీయాలకు తావులేదం టూ అన్ని రాజకీయపక్షాల ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సూచనలను, సలహాలను స్వీకరించి నిర్దిష్టమైన ప్రణాళికలతో సామాజిక న్యాయం కోసం ముందుకు సాగుతున్నది.

ఇంతటి బృహత్తర కార్యాచరణను సీఎం కేసీఆర్ నిరంతరం సుదీర్ఘమైన ఆలోచనలు, చర్చలు, నిరంతర మేధోమథనంతో, సమగ్రమైన దృక్పథంతో పథకాల రచనలు చేసి ముందుకుసాగడం వల్లనే ఇది సాధ్యమవుతుంది. ఇలా చెప్పడం అతిశయోక్తి ఏమాత్రం కాదు. ఇంత వేగంగా అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజల ప్రయోజనాలను ప్రతి అంశాన్ని నిర్దిష్టంగా మలుపుతిప్పడం, అమలు చేయడం అసాధ్యం. అయితే ఉద్యమం కన్నా వేగంగా ప్రభుత్వ పథకాలు, ప్రతిపాదనలు ముందుకు సాగడం గత మూడున్నరేండ్లుగా దేశాన్ని అబ్బురపరుస్తున్న విషయం కాదనలేనిది. రాజకీయపక్షాలు, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం కూడా ఈ పథకాల వేగాన్ని, నూతన ఆలోచనలను పసిగట్టడం గానీ, అందుకోవడం గానీ సాధ్యం కావడంలేదు. విమర్శకులు ఏదో ఒక రంధ్రాన్వేషణ చేయాలనుకొని ఆలోచించేలోగానే ఆ పథకం అమలు మొదలై మరో కొత్త పథకం ఆరంభించడం గమనించదగింది.

సీఎం కేసీఆర్ నాటి ఉద్యమస్ఫూర్తితోనే కఠోరంగా శ్రమిస్తున్నారు. సాహసోపేతంగా ముందుకు నడుస్తున్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారు. అన్ని రాజకీయపక్షాలు, వేదికలు, నిపుణులు నిరంతరం చర్చోపచర్చలు చేస్తూ నిర్మాణాత్మకంగా పథక రచన చేస్తున్నారు.

ఉచితంగా కోట్లాది చేప విత్తనం పంపిణీ, పెంపకం ద్వారా బెస్త, ముదిరాజ్ కులస్థులకు ఉపాధి, గొల్లకుర్మలకు సబ్సిడీలతో గొర్రెల పంపిణీ ద్వారా ఆ వర్గాలనూ ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవడం మహత్తర పరిణామం. అలాగే ప్రత్యేక దృష్టితో అన్ని బీసీ సామాజిక వర్గాల కులాల, కులవృత్తుల స్థితిగతులను సమగ్రంగా అధ్యయనం చేసిన తెలంగాణ ప్రభుత్వం వాటిని ప్రాతిపదికగా తీసుకొని నూతన ప్రణాళికలను ముందుకు తీసుకురావడం జరుగుతున్నది. నైపుణ్య శిక్షణ, అధునాతన యంత్ర పరికరాలను సబ్సిడీలతో అందించడానికి సిద్ధపడుతున్నది. ఇలా ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా నాయీ బ్రాహ్మణ, రజక, మేదర, శాలివాహన, పూసల మొదలగు 11 ఫెడరేషన్ల ద్వారా ఆ వర్గాలను ఆదుకునే ప్రయత్నం చేయబోతున్నది. సంచార కులాలను, ఇతర బీసీ కులాలకు చెందిన ప్రజలకు ఆర్థికంగా చేయూతనందించడానికి పకడ్బందీ ప్రణాళికలతో కార్యాచరణను ఈ ఆర్థిక సంవత్సరం నుంచి మొదలుపెట్టబోతున్నది.

కులవృత్తులను ఆధునీకరించి, ఆధునిక పనిముట్లు అందించడం వల్ల వృత్తులు పునర్జీవింపబడుతున్నాయి. వృత్తులను నవీకరించడం, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలతో పాటు, చేనేత రంగానికి కూడా నూతన జవసత్వాలను అందిస్తున్నది. ఇలా వినూత్న పథకాల అమలుతో తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ ప్రణాళికలు దేశానికి నేడు మార్గదర్శకం అవుతున్నాయి.

సీఎం కేసీఆర్ నాటి ఉద్యమస్ఫూర్తితోనే కఠోరంగా శ్రమిస్తున్నారు. సాహసోపేతంగా ముందుకు నడుస్తున్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారు. అన్ని రాజకీయపక్షాలు, వేదికలు, నిపుణులు నిరంతరం చర్చోపచర్చలు చేస్తూ నిర్మాణాత్మకంగా పథక రచన చేస్తున్నారు. అన్నివర్గాలతో పాటు ప్రధానంగా దశాబ్దాలుగా నిర్లక్ష్యం కాబడ్డ అత్యంత వెనుకబడిన వర్గాలు, సంచార, అర్ధ సంచార, విముక్త జాతులు, ప్రజల సమగ్ర వికాసం, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఎన్ని వేల కోట్లయితే అన్ని కేటాయించి ఖర్చుపెట్టడానికి వెనుకాడకుండా ముందుకుసాగుతున్నారు. ఇలాంటి కృషివల్ల తక్కువ సమయంలోనే నేడు తెలంగాణ నెంబర్‌వన్ సంక్షేమ రాష్ట్రంగా ప్రశంసలు అందుకుంటున్నది. తెలంగాణ సంక్షేమ పథకాలు దేశం యావత్తు అబ్బురపడేలా చేస్తున్నాయి. ఇలాంటి పథకాలను పలు రాష్ట్రాలు అమలుచేసే దిశగా ముందుకు సాగుతున్నాయి.

(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

బ్యాంకు ఉద్యోగి కుటుంబమా? అయితే పెండ్లొద్దు

ఇస్లామిక్ సంస్థ దారుల్ ఉలూమ్ దేవ్‌బంద్ ఫత్వా

లక్నో, జనవరి 4: బ్యాంకు ఉద్యోగం చేస్తున్న కుటుంబాలకు చెందిన (యువతీ, యువకుల) వారిని పెండ్లి చేసుకోవద్దని ఉత్తరప్రదేశ్ లక్నోలోని దారుల్ ఉలూమ్ దేవ్‌బంద్ ఇస్లామిక్ సంస్థ ఫత్వా జారీ చేసింది. బ్యాంకు ఉద్యోగాలు చేస్తున్నవారు అక్రమార్జనకు పాల్పడుతున్నారని, అలాంటి వారిని దూరంగా పెట్టాలని పేర్కొన్నది. అందుకు బదులుగా గౌరవప్రదమైన కుటుంబాలకు చెందినవారిని పెండ్లి చేసుకోవాలని సూచించింది. 'తండ్రి బ్యాంకు ఉద్యోగం చేస్తున్న కుటుంబాల నుంచి కొన్ని పెండ్లి ప్రతిపాదనలు వస్తున్నాయి. సహజంగానే ఆ ఇండ్లలోని వారు అక్రమార్జనతో పెరుగుతారు. ఇలాంటి కుటుంబాల నుంచి పెండ్లి చేసుకొనేందుకు ప్రాధాన్యం ఇవ్వొచ్చా? అని ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు దారుల్ ఉలూమ్ స్పందించింది. అలాంటి కుటుంబాలకు చెందిన వారిని పెండ్లి చేసుకోవద్దంటూ ఫత్వా జారీచేసింది. 'అలాంటి కుటుంబాలకు చెందిన వారిని పెండ్లి చేసుకోకపోవడం మంచిది. ఎవరైతే అక్రమార్జనతో పెరుగుతారో.. వారు అమర్యాదగా ప్రవర్తిస్తారు. నైతిక విలువలను కలిగి ఉండరు. అందుకే ఇలాంటివారిని దూరంగా ఉంచాలి. గౌరవప్రదమైన కుటుంబాలకు చెందిన వారిని పెండ్లి చేసుకోవాలి' అని ఫత్వాలో పేర్కొన్నారు. డబ్బును వడ్డీకి ఇవ్వడాన్ని కూడా ఇస్లామిక్ చట్టం వ్యతిరేకిస్తున్నది. ఇస్లామిక్ బ్యాంకులు 'వడ్డీ లేని బ్యాంకింగ్' విధానాన్ని అమలుచేస్తాయి.

డిజైన్ బుర్ఖాలు ధరించొద్దు

వివిధ డిజైన్లు, శరీరానికి అతుక్కుని ఉండే బుర్ఖాలకు వ్యతిరేకంగా దారుల్ ఉలూమ్ దేవ్‌బంద్ ఇస్లామిక్ సంస్థ ఫత్వా జారీచేసింది. డిజైన్ బుర్ఖాలు ధరించడం ఇస్లాం చట్టానికి వ్యతిరేకమని, ఇలాంటివి చెడును ఆకర్షిస్తాయని పేర్కొన్నది. వివిధ డిజైన్లు, రంగుల్లో ఉన్న బుర్ఖాలు ధరించడాన్ని ఇస్లాం అనుమతించదని.. ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఫత్వా జారీ చేసింది.

ఐదు కోట్ల మందుతో అంధత్వం మాయం

- జన్యుపర కంటిపొర వ్యాధి నియంత్రణ కోసం ఔషధాన్ని తయారుచేసిన అమెరికా
- ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవాటిలో ఒకటిగా గుర్తింపు




న్యూయార్క్, జనవరి 4: కంటి వ్యాధిని తగ్గించే ఔషధం ఖరీదు అక్షరాల రూ.5.4 కోట్లు. అమెరికాలో రూపొందించిన ఈ ఔషధం ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఔషధాల్లో ఒకటిగా నిలిచింది. వంశపారంపర్యంగా సంక్రమించే కంటి పొర(రెటీనా)కు సంబంధించిన వ్యాధిని నయం చేసేందుకు వినియోగించే ఔషధం లక్షటర్నాతో.. అంధత్వ సమస్య పూర్తిగా తొలిగిపోనున్నది. అమెరికాలో ఈ ఔషధాన్ని రూ.5.40 కోట్ల (8.5 లక్షల డాలర్ల)కు విక్రయించనున్నారు. ఔషధ తయారీ సంస్థ ఫిలడెల్ఫియాకు చెందిన స్పార్క్ థెరప్యూటిక్స్ తెలిపిన ప్రకారం.. ఒక్క డోస్‌తో రెటీనా సమస్యను నియంత్రించవచ్చు. ఈ ఔషధం కోసం ఒక్కో కంటికి రూ.2.70 కోట్లు (4.25 లక్షల డాలర్లు) ఖర్చు అవుతుంది. ఇప్పటికే గత డిసెంబర్‌లో ఇది ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) ఆమోదం పొందింది. వినూత్నమైన ఈ చికిత్స కోసం వినియోగించే ఔషధం ఖరీదుపై అమెరికా చర్చలు జరిపి.. ఆ తర్వాత ప్రకటించింది. ఒకవేళ ఈ ఔషధం ప్రభావం చూపలేదని రోగులు భావిస్తే.. నగదు తిరిగి చెల్లించేందుకు సిద్ధమని స్పార్క్ హామీ ఇచ్చింది. ఇప్పటికే లుకేమియాతో బాధపడేవారికి చికిత్స అందించేందుకు నోవర్టిస్ కంపెనీ దాదాపు రూ.3 కోట్ల ఖరీదైన కిమ్రియా ఔషధాన్ని విక్రయిస్తున్నది. ఈ మందు సరిగాపనిచేయకపోతే చెల్లించిన మొత్తం తిరిగి ఇస్తామని స్విట్జర్లాండ్‌కు చెందిన ఔషధ తయారీదారుడు గతంలో ప్రకటించినట్టుగానే.. ప్రస్తుతం లక్సటర్నా కూడా ప్రకటించింది.

పాకిస్థాన్ మరో నాటకం

జాదవ్ పశ్చాత్తాప వీడియో విడుదల

తనను తాను దోషిగా చెప్పుకునేందుకు ప్రయత్నించిన జాదవ్

అది బూటకమని తేల్చేసిన భారత్



పాక్ విడుదల చేసిన వీడియోలో మాట్లాడుతున్న జాదవ్

న్యూఢిల్లీ, జనవరి 4: తన అదుపులో ఉన్న భారత మాజీ నేవీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌ని అడ్డుపెట్టుకుని పాకిస్థాన్ మరో నాటకానికి తెరతీసింది. క్రిస్మస్ రోజున జాదవ్‌ను చూసేందుకు వెళ్లిన తల్లి, భార్య గాజులు, బొట్టు, చెప్పులు తీయించి తీవ్రంగా అవమానించిన పాక్.. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు తిరిగి భారత్‌పైనే విషం కక్కింది. ఆ భేటీ సందర్భంగా భారత దౌత్యాధికారి తన తల్లిని తిట్టారంటూ జాదవ్‌తో చెప్పించింది. ఈమేరకు జాదవ్ మాట్లాడుతున్నట్లుగా ఉన్న ఓ వీడియోను పాకిస్థాన్ గురువారం విడుదల చేసింది. 'నన్ను కలుసుకోవడానికి వచ్చిన నా తల్లిపై భారత దౌత్యాధికారి ఎందుకు కేకలు వేశారు. నన్ను కలుసుకున్న సందర్భంగా మా అమ్మను తీవ్రంగా కొట్టి ఓ విమానంలో ఇక్కడికి తీసుకువచ్చినట్లుగా అనిపించింది. మా అమ్మ కళ్లలో భయం కనిపించింది' అంటూ జాదవ్ ప్రశ్నిస్తున్నట్లుగా ఆ వీడియోలో కనిపించింది. 'నన్ను కలుసుకున్న సమయంలో నా తల్లి కళ్లలో భయం కనిపించింది. నన్ను చూసి ఆమె ఏడుస్తుంటే ఆ సమయంలో భారత దౌత్యాధికారి బిగ్గరగా అరిచారు. ఆయన ఆగ్రహంతో అరవడం నేను చూశాను. ఈ సమావేశం సానుకూలంగా జరిగింది. దీనివల్ల నా తల్లి సంతోషంగా ఉంది. నేను సంతోషంగా ఉన్నాను. అమ్మా.. నా గురించి ఆందోళన చెందవద్దు. పాక్ అధికారులు నన్ను బాగా చూసుకుంటున్నారు. నన్ను ఎలాంటి హింసకూ గురిచేయలేదు' అని జాదవ్ చెబుతున్నట్లుగా అందులో ఉంది. జాదవ్ తల్లి, ఆయన భార్య ఇస్లామాబాద్ వెళ్లిన సందర్భంగా వారి వెంట పాక్‌లోని భారత హైకమిషనర్ జేపీ సింగ్ ఉన్న సంగతి తెలిసిందే. జాదవ్‌ను భారత గూఢచారిగా ఆరోపిస్తున్న పాకిస్థాన్.. ఆయనకు ఉరిశిక్ష విధించింది. భారత నిఘా సంస్థ 'రా' కోసం పనిచేస్తున్న జాదవ్‌ను బలూచిస్తాన్‌లో అరెస్టు చేశామంటూ పాకిస్థాన్ వాదిస్తున్నది. అయితే ప్రయివేటు వ్యాపారం చేసుకుంటున్న జాదవ్‌ను ఇరాన్‌నుంచి కిడ్నాప్ చేసి తీసుకెళ్లినట్లు భారత్ ఆరోపిస్తున్నది. జాదవ్ కలుసుకునేందుకు భారత దౌత్యాధికారులకు పాక్ ఇప్పటివరకు అవకాశం ఇవ్వకపోగా తనవైఖరికి అనుకూలంగా జాదవ్‌తో మాట్లాడిన వీడియోలను ఆయా సందర్భాల్లో విడుదల చేస్తూ వస్తున్నది. తాజా వీడియోలోనూ పాక్ జాదవ్‌చేత బలవంతంగా పలికించినట్లుగానే ఉన్నది. ఏ ఒత్తిళ్లు పనిచేశాయో తెలియదుకానీ ఈసారి జాదవ్ తనను తాను దోషిగా చిత్రీకరించుకునే ప్రయత్నం చేశారు. 'ఈ సందర్భంగా భారత ప్రజలకు, భారత ప్రభుత్వానికి నేనో ముఖ్యవిషయం చెప్పదలుచుకున్నాను. నేను నేవీలో ప్రత్యేకంగా నియమించబడిన అధికారిని. నేను ఇప్పటికీ ఆ ఉద్యోగ బాధ్యతల్లో ఉన్నాను. పాకిస్థాన్ చెబుతున్నట్లుగా.. నేను ఇంటెలిజెన్స్ సంస్థ కోసం పనిచేస్తున్న విషయాన్ని భారత్ ఎందుకు ఒప్పుకోవడం లేదు? ఎందుకు అబద్ధాలు చెబుతున్నారు?' అని జాదవ్ ప్రశ్నిస్తున్నట్లుగా వీడియోలో కనిపించింది. తన తల్లిని, భార్యను కలిసేందుకు అనుమతించినందుకు పాకిస్థాన్ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. పాక్ విదేశాంగశాఖ విడుదల చేసిన ఈ వీడియోను జియో టీవీ యూట్యూబ్‌లో పోస్టు చేసింది.

బూటకపు నాటకాలకు పాక్ తెరదించాలి: భారత్

ఎలాంటి విశ్వసనీయత లేని పాకిస్థాన్ ఇలాంటి బూటకపు వీడియోలతో ఆడుతున్న నాటకాలను ఇకనైనా కట్టిపెట్టాలని భారత్ ఘాటుగా హెచ్చరించింది. గురువారం జాదవ్ వీడియోను పాక్ విదేశాంగశాఖ విడుదల చేసిన నేపథ్యంలో భారత్ తీవ్రంగా స్పందించింది. 'ఇది మాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. ఇలా వీడియోల ద్వారా బలవంతపు ప్రకటనలు చేయించడం పాకిస్థాన్ ఇంకా మానలేదు. ఇలాటి పిచ్చి చర్యలను ఎవరూ నమ్మబోరన్న వాస్తవాన్ని పాక్ ఇకనైనా గ్రహించాలి' అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ అన్నారు. 'తీవ్రమైన ఒత్తిళ్లమధ్య బాధితుడు చేసే బలవంతపు ఆరోపణలపై ఎవరైనా ఏమని స్పందిస్తారు?' అని ఆయన ప్రశ్నించారు. ఉగ్రవాదానికి సంబంధించి ఐక్యరాజ్యసమితి ప్రకటించిన అంతర్జాతీ ఒప్పందాలు-1267, 1373ను పాక్ మరోసారి చదువుకోవాలని, ఇకనైనా భారత జాతీయుల మానవహక్కుల్ని కాలరాసే చర్యల్ని నిలిపివేయాలని రవీశ్ సూచించారు.

అరుణాచల్‌లో తోక ముడిచిన డ్రాగన్

- అంతర్జాతీయ సరిహద్దును దాటి చైనా బలగాల చొరబాటు
- కిలోమీటరు దూరంలో రోడ్డు నిర్మాణానికి యత్నం
- భారత్ ప్రతిఘటనతో వెనుదిరిగిన చైనా బలగాలు



న్యూఢిల్లీ, జనవరి 4: అరుణాచల్ ప్రదేశ్‌లో అంతర్జాతీయ సరిహద్దును దాటి చైనా బలగాలు కిలోమీటరు దూరం వరకు చొచ్చుకొచ్చాయి. భారత్ నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురుకావడంతోపాటు చివరకు వెనక్కిమళ్లాయి. డిసెంబర్ చివరివారంలో అప్పర్ సయాంగ్ జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దును దాటి కిలోమీటరు దూరం వరకు చైనా బలగాలు చొచ్చుకువచ్చాయి. ట్యూటింగ్ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాయి. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనపై భారత్ తీవ్రంగా ప్రతిస్పందించింది. ఈ నేపథ్యంలో తాము అరుణాచల్ ప్రదేశ్‌ను అసలు గుర్తించడమే లేదని, అలాంటప్పుడు తమది చొరబాటు ఎలా అవుతుందని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గెంగ్‌షువాంగ్ వితండవాదనకు దిగారు. అయితే భారత సైన్యం బుధవారం ట్యూటింగ్ ప్రాంతానికి వెళ్లి నిర్మాణ సామగ్రిని సీజ్ చేసింది. దీంతో చైనా బృందాలు వెనక్కి వెళ్లిపోయాయి. అయితే అవి చైనా బలగాలు కావని, పౌరబృందాలని అధికారులు తెలిపారు. 'డోక్లాం ప్రతిష్టంభనలాంటి పరిస్థితేమీ ఇక్కడ లేదు. బిసింగ్ గ్రామం వద్ద రోడ్డు నిర్మాణం కోసం వచ్చినవి చైనా బలగాలు కావు. కేవలం నిర్మాణ సంస్థ బృందాలే. డిసెంబర్ 28న పనులు జరుగుతుండడాన్ని భారత గస్తీ బృందాలు గుర్తించాయి. రెండు ఎస్కవేటర్లు సహా యంత్రసామగ్రిని భారత్ స్వాధీనం చేసుకోవడంతో వారు వెనుదిరిగారు.' అని అధికారులు తెలిపారు. అయితే స్థానికుల వాదన వేరుగా ఉంది. చైనా నిర్మాణ బృందాల్లో సైనికులు కూడా ఉన్నారని, భారత సైనికులు వారిని అడ్డుకున్నారని బిసింగ్ గ్రామస్తులు చెబుతున్నారు. సియాంగ్ నదికి కుడి వైపున 7-8 కిలోమీటర్ల ఎగువవరకు రోడ్డును చైనా బలగాలు తవ్వేశాయని గ్రామస్తులు తెలిపారు. స్థానిక పోలీసుల సమాచారం మేరకు ఇండోటిబెటన్ సరిహద్దు సిబ్బంది అక్కడికి చేరుకుని చైనా బృందాలను వెనక్కిమళ్లాయి. ప్రస్తుతం వివాదాస్పద ప్రాంతంలో భారత్ భారీగా బలగాలను మోహరించింది.

ముంబైలో అగ్నిప్రమాదం.. నలుగురు దుర్మరణం

మరో ఐదుగురికి గాయాలు

ముంబై, జనవరి 4: ముంబై తూర్పు అంధేరీలోని మరోల్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో బుధవారం అర్ధరాత్రి దాటాక అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో నలుగురు చనిపోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఐదు అగ్నిమాపక శకటాల సిబ్బంది రెండుగంటలపాటు శ్రమించి తెల్లవారుజామున మంటలను అదుపులోకి తెచ్చారు. మొత్తం తొమ్మిది మందికి కాలిన గాయాలయ్యాయని, దవాఖానకు తరలిస్తున్న క్రమంలో నలుగురు మృతి చెందారని అధికారులు తెలిపారు. క్షతగాత్రులకు హోలీ స్పిరిట్ హాస్పిటల్‌లో వైద్యం అందిస్తున్నట్టు చెప్పారు. 'తూర్పు అంధేరీలోని మరోల్‌లో మమూన్ మంజిల్ అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్థులో మంటలు చెలరేగినట్టు గురువారం తెల్లవారుజామున 2.10 గంటలకు ముంబై అగ్నిమాపక దళానికి ఫోన్ వచ్చింది. అంబులెన్స్‌తోపాటు అగ్నిమాపక సిబ్బంది 2.34 గంటలకు ఘటనా స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు' అని ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అత్యవసర విపత్తుల నిర్వహణశాఖ అధికారి ఒకరు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదని, విచారణ జరుగుతున్నదని పేర్కొన్నారు.

పాకిస్థాన్ రేంజర్ల కాల్చివేత

మొదటిపేజీ తరువాయి...

భారత సైన్యం గట్టిగా సమాధానమిచ్చింది. సరిహద్దు వెంబడి ఉన్న పాక్ పోస్టులే లక్ష్యంగా కాల్పులకు దిగింది. సుఖ్‌మల్ ప్రాంతంలో రెండు మోర్టార్ స్థావరాలను గుర్తించి రాత్రికి రాత్రే నేలకూల్చింది. ఈ దాడిలో కనీసం నాలుగు పాక్ బోర్డర్ పోస్టులతోపాటు యుద్ధసామగ్రి, సోలార్‌ప్యానెళ్లు ధ్వంసమయ్యాయి. వాటికన్నా ఎక్కువగా ఈ ఆపరేషన్‌లో పాక్ తన జవాన్లను భారీగా కోల్పోయింది' అని బీఎస్‌ఎఫ్ ఐజీ రామ్‌అవతార్ వెల్లడించారు. మరో ఘటనలో పాకిస్థాన్ నుంచి అక్రమంగా చొరబాటుకు ప్రయత్నించిన ఒకరిని సరిహద్దు భద్రతాదళం ముట్టుబెట్టింది. ఆర్‌ఎస్ పురా సెక్టార్‌లోని ఆర్నియా ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. గురువారం ఉదయం ఏడుగంటల సమయంలో అంతర్జాతీయ సరిహద్దు వద్ద కంచె దూకి వచ్చేందుకు ప్రయత్నించిన వ్యక్తిని నిలువరించేందుకు భద్రతాదళాలు కాల్పులు కాల్పులు జరిపాయని అధికారులు తెలిపారు. మృతుడిని సియాల్‌కోట్ వాసిగా గుర్తించారు. కాగా ఈ ప్రాంతంలో ఇంకా ఎవరైనా చొరబాటుదారులు ఉన్నారా అనేది నిర్ధారించుకునేందుకు గాలింపులు కొనసాగుతున్నాయి.

సరిహద్దుల్లో అలర్ట్ ప్రకటించిన బీఎస్‌ఎఫ్

భారత్, పాక్ మధ్య అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉద్రిక్తతలు చోటు చేసుకున్న నేపథ్యంలో బీఎస్‌ఎఫ్ తన బలగాలను అప్రమత్తం చేసింది. 200కిలో మీటర్ల సరిహద్దుల్లో ఏ క్షణాన్నైనా ఏమైనా జరుగవచ్చని, అందరూ అప్రమత్తంగా ఉండాలని తన జవాన్లకు సూచించింది. 'గురువారంనాటి పరిణామాలతోపాటు ఉగ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారం అందింది. దీంతో సరిహద్దు వెంబడి 'ఆపరేషన్ అలర్ట్'ని ప్రకటించాం' అని బీఎస్‌ఎఫ్ ఐజీ రామ్‌అవతార్ తెలిపారు. బుధవారం పాక్ కాల్పుల్లో అమరుడైన హెడ్ కానిస్టేబుల్ రాధాపడా హజరా భౌతికకాయానికి జమ్ములోని బీఎస్‌ఎఫ్ హెడ్‌క్వార్టర్‌లో అధికారులు ఘననివాళులర్పించారు.

ప్రకటిత నేరస్థుడు.. మాల్యా

న్యూఢిల్లీ, జనవరి 4: బ్యాంకుల రుణాల ఎగవేతదారు మాల్యాను ప్రకటిత నేరస్థుడని ఢిల్లీ కోర్టు గురువారం పేర్కొంది. విదేశీ మారక ద్రవ్య నియంత్రణ చట్టం (ఫెరా) ప్రకారం నమోదైన కేసులో సమన్లను తప్పించుకుంటున్నందుకు ఈ చర్య తీసుకున్నది. అనేకసార్లు సమన్లు జారీచేసినప్పటికీ మాల్యా కోర్టుకు హాజరుకాలేదని చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దీపక్ షెరావత్ చెప్పారు. '30 రోజుల్లో కోర్టుకు హాజరుకావడంలో మాల్యా విఫలమయ్యారు. ఆయన తరపున ఎలాంటి వినతులు మాకు అందలేదు. కావున ఆయనను ప్రకటిత నేరస్థుడిగా ప్రకటిస్తున్నాం' అని న్యాయమూర్తి చెప్పారు. మాల్యాపై గతఏడాది ఏప్రిల్ 12న ఓపెన్ ఇండెడ్ నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. దీని అమలుకు నిర్ణిత కాలపరిమితి ఉండదు. కానీ, నాన్‌బెయిలబుల్ వారెంట్ అమలుకు నిర్దేశిత కాలపరిమితి ఉంటుంది.

ఆధార్ వివరాలు సురక్షితం: యూఐడీఏఐ

'రూ.500లకే వాట్సాప్‌లో వివరాలు' వార్తలపై వివరణ

న్యూఢిల్లీ, జనవరి 4: ఆధార్ వివరాలు అత్యంత భద్రంగానే ఉన్నాయని యూఐడీఏఐ స్పష్టం చేసింది. కేవలం రూ.500లకు వందకోట్ల మంది ఆధార్ వివరాల్ని కొందరు అజ్ఞాత వ్యక్తులు వాట్సాప్‌లో అమ్ముతున్నారంటూ వచ్చిన వార్తల నేపథ్యంలో గురువారం యూఐడీఏఐ స్పందించింది. 'బయోమెట్రిక్ సమాచారం సహా ఆధార్ డేటా వ్యవస్థ పూర్తిగా సురక్షితం' అని ప్రకటించింది. 'ది ట్రిబ్యూన్' దినపత్రిక నిర్వహించిన ఓ దర్యాప్తులో సదరు పత్రిక ప్రతినిధి పేటీఎం ద్వారా రూ.500 చెల్లించి వాట్సాప్‌పై ఆధార్ వివరాలను కొనుగోలు చేసినట్లు వార్తలొచ్చాయి. నిమిషాల వ్యవధిలోనే తమ ప్రతినిధికి అజ్ఞాత విక్రయదారుల నుంచి వాట్సాప్‌పై లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు వచ్చాయని, వీటి సాయంతో ఏ ఆధార్ నెంబర్‌నైనా ఎంటర్ చేస్తేచాలు ఆ నెంబర్‌కు సంబంధించిన పేరు, చిరునామా, ఫోన్ నెంబర్, ఫొటో, ఈ-మెయిల్ తదితర వివరాలన్నీ ఇట్టే తెలిసిపోతున్నాయని ది ట్రిబ్యూన్ వెల్లడించింది. అయితే అలాంటిదేమీ జరుగదని ఆధార్ సమాచారం చాలా భద్రంగా ఉందని ఆధార్ జారీ సంస్థ యూఐడీఏఐ ఓ ప్రకటనలో చెప్పింది. దుర్వినియోగాన్ని కనుక్కోవచ్చున్నది. కట్టుదిట్టమైన సాంకేతిక వ్యవస్థలను వినియోగిస్తున్నామని, డేటా అపహరణ అసాధ్యమన్నది. అయినప్పటికీ ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తున్నామని తెలిపింది.



మధ్యాహ్న భోజనంలో అక్షయపాత్ర చిరుధాన్యాలను అల్పాహారంగా అందించే పథకాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కడియం. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, అక్షయపాత్ర అధ్యక్షుడు సత్యగౌరవచంద్రదాస తదితరులు

పౌష్టికాహారానికి పెద్దపీట

- రాష్ట్రంలో మధ్యాహ్న భోజనానికి ఏటా 557 కోట్లు
- విద్యార్థులకు అక్షయపాత్ర చిరుధాన్యాలను ఆహారంగా అందించడం అభినందనీయం
- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

మణికొండ, నమస్తే తెలంగాణ: దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. హైదరాబాద్ గండిపేట మండలం నార్సింగిలోని అక్షయపాత్రలో లక్ష మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా చిరుధాన్యాలు(మిల్లెట్స్) పోషకాహారం రూపంలో అందించడానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని గురువారం డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే మొట్టమెదటిసారిగా అక్షయపాత్ర తెలంగాణ రాష్ట్రంలో మధ్యాహ్నభోజనం చేస్తున్న లక్ష మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చిరుధాన్యాలను పోషకాహారం రూపంలో అందించాడానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. పిల్లల ఎదుగుదల విషయంలో పౌష్టికాహా రం ఆశించిన రీతిలో లేదని సర్వేల్లో తేలడంతో తెలంగాణ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం మెనులో కొత్త సంవత్సరం నుంచి మార్పులు చేస్తున్నట్టు ప్రకటించారు. నెలలో ఆరుసార్లు మాంసాహారంతోపాటు 24రోజులు గుడ్లను, నెయ్యిని అందిస్తామన్నారు. అదనంగా పౌష్టికాహారంతో కూడిన స్నాక్స్ ఇస్తామన్నారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరువతో రాష్ట్ర వ్యాప్తంగా వసతిగృహాల్లోని 30 లక్షల మంది విద్యార్థులకు సన్న బియ్యంతో భోజనం పెడుతున్న ఏకైక సర్కారు మాదేనన్నారు. పౌష్టికాహారంలో భాగంగా వారానికి మూడు కోడిగుడ్లు అందిస్తూ ఏటా రూ.116 కోట్లు ఖర్చుచేస్తున్నామన్నారు. అక్షయపాత్ర చేపడుతున్న ఆదర్శప్రాయమైన కార్యక్రమానికి తమ ప్రభుత్వం అన్నివిధాలుగా సహకారం అందిస్తున్నదన్నారు. మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.557 కోట్లు ఖర్చుచేస్తున్నదన్నారు. కేంద్రం కేవలం రూ.189 కోట్లు మాత్రమే వెచ్చిస్తున్నదన్నారు. పూర్వం చిరుధాన్యాలను అధికంగా తీసుకునేవాళ్లమని గుర్తుచేశారు. వ్యవసాయంలో వచ్చిన మార్పుల వల్ల చిరుధాన్యాల పంట తగ్గిందన్నారు. రైతులు పోషకాలు కలిగిన పంటలను పండించేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదన్నారు. అక్షయపాత్ర, జాతీయ పౌష్టికాహార సంస్థ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు ఏవిధమైన పౌష్టికాహారం అందించాలనే అంశాపై చర్చిస్తామన్నారు. అక్షయపాత్ర అధ్యక్షుడు సత్యగౌరవచంద్రదాస మాట్లాడుతూ సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల త్వరగా అలసిపోవడం, చదువులో వెనుకంజ వేయడంతో పాటు ఆలోచనాశక్తి తగ్గుతుందన్నారు. విద్యార్థుల చదువుకు అంతరాయం లేకుండా ఉండాలనే ఉద్దేశంతోనే అల్పాహారంలో చిరుధాన్యాలను అందించడానికి అక్షయపాత్ర సిద్ధపడిందన్నారు. దీంతో విద్యార్థులతోపాటు దేశానికి అన్నం పెట్టే రైతు కూడా లబ్ధి పొందుతాడన్నారు. చిరుధాన్యాల్లో బీ విటమిన్లు, కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, జింక్ అధికంగా ఉంటాయన్నారు. వీటిని విద్యార్థులకు కాజ, లడ్డు, చక్కి, పొంగలి, పాయసం, బిస్కెట్స్, చేగోడీలు, మిక్చర్ వంటి 15 రూపాల్లో అందించడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే టీ ప్రకాశ్‌గౌడ్, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డేవిట్ బెర్గివిన్‌సన్, జాతీయ పౌష్టికాహార సంస్థ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మయ్య, ప్రముఖ కన్సల్టెన్స్ డాక్టర్ రాములు, ఎంపీపీ తలారి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఉక్కువంతెన

ఇందిరాపార్కు-వీఎస్టీ మధ్య నిర్మాణం • రెండున్నర కిలోమీటర్ల పొడవు, పదహారు మీటర్ల వెడల్పు

రూ.426 కోట్లతో పరిపాలనా అనుమతులకోసం ప్రతిపాదన • 2019 చివరికి పూర్తిచేయాలని నిర్ణయం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: నిర్మాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఇరుకు రోడ్లపై జీహెచ్‌ఎంసీ స్టీల్ వంతెనలు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నది. మూడు ప్రాంతాల్లో నిర్మించాలని ప్రతిపాదించినప్పటికీ ప్రస్తుతానికి రూ.426 కోట్ల అంచనాతో ఇందిరాపార్కు-వీఎస్టీ మధ్య ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 2.6 కిలోమీటర్ల పొడవున నిర్మించేందుకు ప్రతిపాదించిన ఈ బ్రిడ్జికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును సిద్ధంచేసి పరిపాలనా అనుమతులకోసం ప్రభుత్వానికి నివేదించారు. 2019 చివరినాటికి పూర్తిచేయాలని నిర్ణయించారు. ఇది పూర్తయితే నగరంలో వాహనాల రాకపోకలకు వినియోగించే మొదటి స్టీల్ బ్రిడ్జి అవుతుంది.



స్టీల్‌తో నిర్మించిన కోల్‌కతాలోని హౌరాబ్రిడ్జి

ఖర్చు ఎక్కువైనా సమయం తక్కువ..

స్టీల్ బ్రిడ్జి అయితే పునాదులు మాత్రమే సిమెంట్‌తో నిర్మిస్తే సరిపోతుంది. పిల్లర్లు, దానిపై ఏర్పాటుచేసే దూలాలు స్టీల్‌వి అమరుస్తారు. అవసరమైన సైజుల ప్రకారం ముందస్తుగా ఫ్యాక్టరీల్లో తయారుచేయించి రాత్రికిరాత్రే బిగిస్తారు. ఉదాహరణకు ఇటీవల ఓలిఫెండా బ్రిడ్జివద్ద మెట్రోరైలు కారిడార్‌కోసం స్టీల్ బ్రిడ్జిని నిర్మించిన విషయం తెలిసిందే. ఇక్కడ రోడ్డు బాగా ఇరుకుగా ఉండడంతో వంతెన బిగించేందుకు సుమారు 15 రోజులు ఆ మార్గాన్ని మూసివేయాల్సివచ్చింది. అయినప్పటికీ సంప్రదాయ ఫ్లైఓవర్‌తో పోల్చుకుంటే ఎంతో తక్కువ సమయంలోనే ఇది పూర్తయినట్టు చెప్పవచ్చు. ఇందిరాపార్కు-వీఎస్టీ మధ్య మామూలు ఫ్లైఓవర్ నిర్మాణానికి కనీసం రెండేండ్ల సమయం పట్టనుండగా, స్టీల్ బ్రిడ్జిని ఏడాదిలో పూర్తిచేయవచ్చని అధికారులు చెప్తున్నారు. ఆ మార్గంలో రోడ్డును పూర్తిగా మూసివేయాల్సిన అవసరం కూడా ఉండదు. ఖర్చు విషయానికొస్తే దీనికి కనీసం 35 నుంచి 40శాతం అధికమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

మెట్రో కారిడార్ పైనుంచి..

ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో మెట్రో మార్గంపైనుంచి స్టీల్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. ఇక్కడ 20 మీటర్ల(సుమారు 68 అడుగులు)ఎత్తు నుంచి బ్రిడ్జి వెళ్లనున్నది. ముఖ్యంగా ప్రీకాస్టింగ్ టెక్నాలజీతో ఇంత ఎత్తునుంచి నిర్మించేందుకు భారీగా యంత్రసామగ్రిని వినియోగించాల్సి ఉంటుంది. ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేస్తే తప్ప మెట్రో క్రాసింగ్ వద్ద పనులు చేపట్టడం సాధ్యంకాదు. స్టీల్ బ్రిడ్జిని చేపట్టేందుకు ఇదికూడా ప్రధాన కారణంగా చెప్పవచ్చు. అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రధాన క్రాసింగ్‌లో ట్రాఫిక్‌ను ఎక్కువరోజులు నిలిపే వీలులేదు. స్టీల్ బ్రిడ్జివల్ల పెద్దగా ఇబ్బందులు ఎదురుకాకుండానే నిర్మాణం పనులు చేపట్టే ఆస్కామున్నది. సహజంగా రైల్వే బ్రిడ్జిలను స్టీల్‌తో నిర్మిస్తుంటారు. కోల్‌కతాలో హౌరాబ్రిడ్జిసహా దశాబ్దాల కిందటే పలు స్టీల్ బ్రిడ్జిలు నిర్మించినట్టు అధికారులు చెప్తున్నారు. ఢిల్లీ, ముంబై నగరాల్లో సైతం ఇరుకు రోడ్లలో ఇటువంటివి నిర్మించారు. హైదరాబాద్‌లో మాత్రం వాహనాలకోసం నిర్మించే మొదటి స్టీల్ బ్రిడ్జి ఇదే కానుండటం విశేషం. సంగీత్ జంక్షన్, కొత్తగూడ-విప్రో సర్కిల్ మార్గంలో స్టీల్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదించినప్పటికీ సంగీత్ జంక్షన్ వద్ద సాధ్యంకాదని తేల్చారు. కొత్తగూడలో నిర్మించాలని యోచిస్తున్నారు.

బ్రిడ్జి నిర్మాణ విశేషాలు..

- ఎలివేటెడ్ కారిడార్ ఇందిపార్కు-వీఎస్టీ జంక్షన్
- పొడవు- 2.610 కిలోమీటర్లు
- వెడల్పు- నాలుగు లేన్లు(16.61 మీటర్లు)
- అంచనా వ్యయం- రూ.426 కోట్లు
- స్టీల్‌తో చేసిన పిల్లర్లు, పియర్ క్యాప్, గిర్డర్లు(దూలాలు) వినియోగం
- ఫౌండేషన్, స్లాబులు కాంక్రీట్, ప్రీకాస్ట్ టెక్నాలజీ
- బాగ్‌లింగంపల్లి, వీఎస్టీ జంక్షన్ల మధ్య ఎక్కేందుకు ర్యాంప్
- వీఎస్టీ జంక్షన్ దాటిన తర్వాత డౌన్ ర్యాంప్
- వేగం డిజైన్- గంటకు 40 కిలోమీటర్లు
- రోడ్డు విస్తరణ 100 అడుగుల వెడల్పు

హెచ్‌ఎండీఏకు నలుగురు డిప్యూటీ కలెక్టర్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హెచ్‌ఎండీఏలో గురువారం నలుగురు డిప్యూటీ కలెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటేషన్‌పై ఆయా శాఖల నుంచి డిప్యూటీ కలెక్టర్లు కే గోపీరాం, ఎం వాసుచంద్ర, బీ ఆపర్ణ, ఎస్ రాజేశ్వరిని ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు కేటాయించింది. ఈ నలుగురికీ ఖాళీగా ఉన్న స్థానాల్లో భర్తీ చేస్తూ కమిషనర్ చిరంజీవులు నిర్ణయం తీసుకున్నారు. కే గోపీరాంకు బీపీపీ ఓఎస్డీగా, వాసుచంద్రకు ఎల్‌అండ్‌ఏ/భూ సేకరణాధికారిగా, ఆపర్ణకు ఓఆర్ ఆర్ విభాగం భూ సేకరణాధికారిణి (ఎల్‌అండ్‌ఏ, ఆర్‌అండ్‌ఆర్)గా, రాజేశ్వరికి ల్యాండ్ పూలింగ్ స్కీం బాధ్యతలు అప్పగించారు. ఈ నలుగురు డిప్యూటీ కలెక్టర్ల నియామకంతో పౌర సేవలు మరింత విస్తృతం కానున్నాయి.

అమీర్‌పేటలో మెట్రో మల్టీలెవెల్ పార్కింగ్!

- 1,286 చదరపు గజాల్లో కాంప్లెక్స్.. స్థలం ఇవ్వనున్న హెచ్‌ఎండీఏ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: దేశంలోనే అత్యంత ఎక్కువ విస్తీర్ణంతో నిర్మించిన మెట్రోరైలు అమీర్‌పేట ఇంటర్‌చేంజ్ ప్రాంతంలో అదేస్థాయిలో పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్నది. అత్యంత రద్దీగా ఉన్న ఈ స్టేషన్ ద్వారా చాలా మంది నిత్యం తమ గమ్యస్థానాలకు చేరే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో రద్దీని దృష్టిలో ఉంచుకొని ఇక్కడ మల్టీలెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం హెచ్‌ఎండీఏకు చెందిన 1,286 చదరపు గజాల స్థలాన్ని మెట్రోరైలుకు బదిలీచేయనున్నారు. ప్రస్తుతం ఈ స్థలంలో సెకండ్ హ్యాండ్ కార్లు విక్రయించే సంస్థ కొనసాగుతున్నది. దీనిని ఖాళీచేసి మెట్రోరైలుకు అప్పగించాలని హెచ్‌ఎండీఏ నిర్ణయించింది. ఈ ప్రక్రియ పూర్తయితే ఇక్కడ అతిపెద్ద కాంప్లెక్స్ రానున్నది. ఇప్పటికే ప్రారంభమైన నాగోల్- మియాపూర్ 30 కిలోమీటర్ల మార్గంలో 24 స్టేషన్లకుగాను 23 చోట్ల పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. వారం రోజుల్లో పెయిడ్ పార్కింగ్ కోసం టెండర్లను కూడా ఆహ్వానించనున్నారు. అమీర్‌పేట ఇంటర్‌చేంజ్‌లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని అతిపెద్ద పార్కింగ్ నిర్మాణాన్ని ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన స్థలం హెచ్‌ఎండీఏ నుంచి హెచ్‌ఎంఆర్‌ఎల్ ఆధీనంలోకి రాగానే నిర్మాణ ప్రణాళికలు రూపొందించి యుద్ధప్రాతిపదికన నిర్మాణం చేయనున్నారు. దీనిపై ఇప్పటికే హెచ్‌ఎండీఏ, హెచ్‌ఎంఆర్‌ఎల్ మధ్య చర్చలు జరిగాయి. మెట్రోరైలు భూసేకరణలో భాగంగా గత జూలై 3, 2017న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జరిపిన 42వ ఎస్‌టీఎఫ్ సమావేశంలో ఈ ప్రస్తావన రాగా, గత డిసెంబర్ 30న జరిగిన సమావేశంలో దీనిపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఇప్పటికే ఈ స్థలాన్ని హెచ్‌ఎండీఏ, హెచ్‌ఎంఆర్‌ఎల్ అధికారులు చాలాసార్లు సందర్శించారు.

నడిరోడ్డుపై పట్టపగలే దారిదోపిడీ

- రోడ్డుపక్కన నిలబడ్డ వ్యక్తిని కత్తితో బెదిరించి బైక్, సెల్‌ఫోన్లు లాక్కెళ్లిన దుండగులు
- జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-10లో ఘటన.. సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలు



బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: రోడ్డుపక్కన నిలబడ్డ వ్యక్తిని కత్తి తో బెదిరించి పర్సు, సెల్‌ఫోన్లను లాక్కొని బాధితుడి బైక్‌పైనే పరారయ్యారు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లో జరుగగా, గురువారం వెలుగులోకి వచ్చింది. బేగంపేటలోని శ్యామ్‌లాల్ బిల్డింగ్ సమీపంలో ఉంటున్న రాజబోయిన యాదగిరి బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని బాలాజీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ లో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. తోటి ఉద్యోగి రాజేందర్ మిశ్రాతో కలిసి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-10లోని సాగర్ సిమెంట్స్ కార్యాలయంలో ఓ చెక్కును ఇచ్చేందుకు బైక్‌పై వచ్చారు. చెక్కు ఇచ్చేందుకు మిశ్రా లోనికి వెళ్లగా యాదగిరి రోడ్డుపక్కన బైక్ ఆపుకొని నిల్చున్నాడు. అదే సమయంలో వెనుకనుంచి నడుచుకుంటూ వచ్చిన ముగ్గురు ఆగంతకులు యాదగిరిపై దాడి చేసి సెల్‌ఫోన్లు, పర్సు లాక్కొన్నారు. యాదగిరిని తోసేసి కత్తితో బెదిరిస్తూ ముగ్గురూ బాధితుడి బైక్‌పై పరారయ్యారు. బాధితుడు యాదగిరి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో సీసీటీవీ పుటేజీని పరిశీలించిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఏటీఎంలో డబ్బులు పెట్టే ఓ వాహనం కూడా అక్కడికి వచ్చి కాసేపు ఆగిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. ఈ వాహనంలో సెక్యూరిటీ గార్డు వద్ద తుపాకీ ఉంటుందని, కనీసం అతను దిగి తుపాకీతో బెదిరిస్తే దుండగులు భయపడే వారని స్థానికులు తెలిపారు. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ కేఎస్ రావు తెలిపారు.

ఫెర్టిలైజర్స్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్‌ఎఫ్‌ఎల్) వివిధ యూనిట్/ఆఫీస్‌లలో ఖాళీగా ఉన్న మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- ఇంజినీరింగ్ అభ్యర్థులకు అవకాశం
- గేట్ స్కోర్ ఆధారంగా ఎంపిక
- మంచి జీతభత్యాలు, ఉద్యోగ భద్రత

వివరాలు:

మినీరత్న హోదాను కలిగిన ఎన్‌ఎఫ్‌ఎల్‌ను న్యూఢిల్లీలో 1974 ఆగస్టు 23న ఏర్పాటుచేశారు.

- **పోస్టు పేరు:** మేనేజ్‌మెంట్ ట్రెయినీ
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 46

విభాగాలవారీగా ఖాళీలు:

- డిప్యూటీ జనరల్ మేనేజర్/చీఫ్ మేనేజర్-2 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీఏ/ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ లేదా పీజీ/రెండేండ్ల డిప్లొమా (హెచ్‌ఆర్‌ఎం/పర్సనల్ మేనేజ్‌మెంట్& ఇండస్ట్రియల్ రిలేషన్స్)లో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- సీనియర్ మేనేజర్-3 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఇన్ లా (ఎల్‌ఎల్‌బీ)లో ఉత్తీర్ణత. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- మేనేజ్‌మెంట్ ట్రెయినీ (కెమికల్)-25 (జనరల్-14, ఓబీసీ-6, ఎస్సీ-3, ఎస్టీ-2)
- మేనేజ్‌మెంట్ ట్రెయినీ (మెకానికల్)-10 (జనరల్-6, ఓబీసీ-1, ఎస్సీ-2, ఎస్టీ-1)
- మేనేజ్‌మెంట్ ట్రెయినీ (ఎలక్ట్రికల్)-6 (జనరల్-4, ఓబీసీ-1, ఎస్సీ-1)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ లేదా తత్సమాన పరీక్షలో 60 శాతం (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం) మార్కులతో ఉత్తీర్ణత. గేట్- 2016లో అర్హత సాధించాలి. సంబంధిత రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 2017 డిసెంబర్ 31 నాటికి 27 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** రూ. 16,400-40,500/-, డీఏ, హెచ్‌ఆర్‌ఏ, మెడికల్ తదితర సౌకర్యాలు కల్పిస్తారు.



- **దరఖాస్తు ఫీజు:** రూ. 735/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్, డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **ఎంపిక:** గేట్ స్కోర్-2016 +ఇంటర్వ్యూ ద్వారా
- గేట్ -2016 స్కోర్‌కు 80 శాతం , ఇంటర్వ్యూకు 20 శాతం వెయిటేజీ ఇచ్చి ఫైనల్ సెలక్షన్ చేస్తారు.
- మేనేజర్ పోస్టులను ఇంటర్వ్యూ ద్వారా భర్తీచేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 18 , మేనేజర్ పోస్టులకు **చివరితేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

విద్య, ఉద్యోగ సమాచారం

జేఎన్‌యూలో 90 ప్రొఫెసర్లు

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- **పోస్టు పేరు:** ప్రొఫెసర్
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 90 (జనరల్-57, ఓబీసీ-13, ఎస్సీ-10, ఎస్టీ-10)
- ప్రొఫెసర్-24 పోస్టులు (జనరల్-21, ఎస్సీ-2, ఎస్టీ-1)
- **పే స్కేల్:** రూ. 37,400-67,000 + అకడమిక్ గ్రేడ్ పే రూ.10,000/-
- అసోసియేట్ ప్రొఫెసర్-27 పోస్టులు (జనరల్-19, ఎస్సీ-4, ఎస్టీ-4)
- **పే స్కేల్:** రూ. 37,400-67,000 +అకడమిక్ గ్రేడ్ పే రూ.9,000/-
- అసిస్టెంట్ ప్రొఫెసర్-39 పోస్టులు (జనరల్-17, ఓబీసీ-13, ఎస్సీ-4, ఎస్టీ-5)
- **పే స్కేల్:** రూ. 15,600-39,100 +అకడమిక్ గ్రేడ్ పే రూ. 6,000/-
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మాస్టర్ డిగ్రీ లేదా ఎమ్మెస్సీ, ఎంఏ, ఎల్‌ఎల్‌ఎం, ఎంబీబీఎస్+ఎండీ, బీవీఎస్సీ+



ఎంవీఎస్సీ, బీఈ/బీటెక్‌తోపాటు ఎంటెక్‌లో ఉత్తీర్ణత. సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీ లేదా నెట్/స్లెట్, యూజీసీ/సీఎస్‌ఐఆర్ నెట్‌లో అర్హత సాధించాలి. సంబంధిత రిసెర్చ్/టీచింగ్ విభాగంలో అనుభవం ఉండాలి

- **ఎంపిక :** రాత పరీక్ష/పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు :** ఆఫ్‌లైన్ ద్వారా. నిర్ణీత నమూనాలో విద్యార్హత, టీచింగ్ ఎక్స్‌పీరియన్స్ తదితర వివరాలను సంబంధిత పర్సనల్ అధికారికి పంపించాలి.
- **చివరితేది :** జనవరి 29 (సాయంత్రం 5 గంటల వరకు)
- **వెబ్‌సైట్:** www.jnu.ac.in

ప్రాజెక్ట్ టెక్నీషియన్లు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ట్యూబర్క్యులోసిస్ (ఎన్‌ఐఆర్‌టీ) ఖాళీగా ఉన్న ప్రాజెక్ట్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- **పోస్టు పేరు:** ప్రాజెక్ట్ టెక్నీషియన్-5 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి సైన్స్‌లో ఇంటర్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు.
- **పే స్కేల్:** రూ. 18,000/- (కన్సాలిడేటెడ్ పే)
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా..
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 18
- **వెబ్‌సైట్:** www.nirt.res.in


ఐఏఆర్‌ఐలో ఎస్‌ఆర్‌ఎఫ్

న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఈఆర్‌ఐ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- సీనియర్ రిసెర్చ్ ఫెలో- 2 పోస్టులు
- **అర్హత:** సంబంధిత సబ్జెక్ట్‌లో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత. నెట్ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- ఫీల్డ్ అసిస్టెంట్-2 పోస్టులు
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు/సంస్థ నుంచి ఇంటర్/10+2లో ఉత్తీర్ణత.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా. పూర్తి వివరాలతో దరఖాస్తు, అవసరమైన సర్టిఫికెట్లతో రిక్రూట్‌మెంట్ పర్సనల్ అధికారి వద్ద హాజరుకావాలి.
- **ఇంటర్వ్యూ తేదీ:** జనవరి 15
- **వెబ్‌సైట్:** www.iari.res.in

'అటామిక్ ఎనర్జీ'లో



డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ పరిధిలో పనిచేస్తున్న జనరల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఖాళీగా ఉన్న సైంటిఫిక్, టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- మొత్తం ఖాళీల సంఖ్య:13
- సైంటిఫిక్ ఆఫీసర్/మెడికల్ అడ్మినిస్ట్రేటర్-1, మెడికల్ ఆఫీసర్ (రేడియాలజీ/రేడియో డయాగ్నసిస్)-1, మెడికల్ ఆఫీసర్ (జనరల్ సర్జరీ)-1, మెడికల్ ఆఫీసర్ (గైనకాలజీ)-1, మెడికల్ ఆఫీసర్ (జనరల్ డ్యూటీ)-6, టెక్నికల్ ఆఫీసర్ (మెకానికల్)-1, టెక్నికల్ ఆఫీసర్(సివిల్)-2
- **అర్హత:** సంస్థ నిబంధనలను ప్రకారం అర్హతలను కలిగి ఉండాలి.
- **ఎంపిక :** రాత పరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా
- **చివరితేదీ :** జనవరి 31
- **వెబ్‌సైట్:** http://www.igcar.gov.in

నాగార్జున యూనివర్సిటీలో ఫ్యాకల్టీలు

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- **పోస్టు పేరు :** అసిస్టెంట్ ప్రొఫెసర్
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 60

విభాగాలవారీగా ఖాళీలు:

- ఆర్ట్స్ గ్రూప్-26 ఖాళీలు (కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్-4, ఎకనామిక్స్-5, ఇంగ్లిష్-2, లా-3, పొలిటికల్ సైన్స్-3, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-4, రూరల్ డెవలప్‌మెంట్-1, తెలుగు ఓరియంటల్ లాంగ్వేజెస్-4)
- సైన్స్ గ్రూప్-22 ఖాళీలు (బయోటెక్నాలజీ-4, బాటనీ అండ్ మైక్రోబయాలజీ-4, కెమిస్ట్రీ-2, జియాలజీ-2, మ్యాథమెటిక్స్-3, ఫార్మసీ-2, ఫిజిక్స్-1, స్టాటిస్టిక్స్-1, యూఎస్‌ఐటీ అండ్ ఈ & ఐటీ-1, జువాలజీ-2)
- ఇంజినీరింగ్ గ్రూప్-11 ఖాళీలు (ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్-1, సివిల్-2, సీఎస్‌ఈ-3, ఈఈఈ-2, ఈసీఈ-1, మెకానికల్-2)
- రిసెర్చ్ గ్రూప్-1 ఖాళీ (సెంటర్ ఫర్ సైంటిఫిక్ సోషలిజం)
- **అర్హత :** సంబంధిత పోస్టులను బట్టి మాస్టర్ డిగ్రీ/పీజీలో 55 శాతం మార్కులతో



ఉత్తీర్ణత. యూజీసీ/సీఎస్‌ఐఆర్ నెట్ లేదా స్లెట్/సెట్ లేదా పీహెచ్‌డీ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.

- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా
- **చివరితేదీ:** జనవరి 30
- **వెబ్‌సైట్:** http://nagarjunauniversity.ac.in

సైంటిఫిక్ ఆఫీసర్లు

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టీఐఎఫ్‌ఆర్) ఖాళీగా ఉన్న సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 3
- **పోస్టు పేరు:** ప్రాజెక్ట్ సైంటిఫిక్ ఆఫీసర్
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్/ఐటీలో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో కనీసం రెండేండ్ల అనుభవం ఉండాలి. జావా/ఒరాకిల్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లలో పరిజ్ఞానం ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 42,500/-,
- **వయస్సు:** 28 ఏండ్లకు మించరాదు
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **చివరితేదీ:** జనవరి 21
- **వెబ్‌సైట్:** www.tifr.res.in

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
శుక్రవారం 5 జనవరి 2018
WWW. NTNEWS.COM

జీన్స్.. లెగ్గింగ్స్.. పలాజో.. ఆడవాళ్లు క్యాజువల్‌గా వేసుకోవడానికి బోలెడు ఆప్షన్స్.. వీటికి సరిపోయే టాప్‌లకైతే కొదువే లేదు.. ఎప్పటికప్పుడు నయా ట్రెండ్స్ వస్తూనే ఉంటాయి.. కొన్ని రోజులు కుర్తాలు.. మరికొన్ని రోజులు టీషర్ట్‌లదే హవా.. ఇప్పుడైతే వీటిపై చీరలు చుట్టేయడం.. కలంకారీ టాప్‌లు వేసేయడం చేస్తున్నారు.. అందుకే ఆ డిఫరెంట్ కలెక్షన్‌ను ఈ వారం పట్టుకొచ్చాం.. కొత్త సంవత్సరంలో నయా స్టయిల్స్‌ను ఫాలో అయిపోండి.

నయా స్టయిల్!











లాంగ్ లెంగ్త్ కుర్తా ఇది. దీనికి ముందు స్లిట్ ఇచ్చాం. పింక్ కలర్ శాటిన్, ఫ్లోరల్ ప్రింట్ వచ్చిన రాసిల్క్‌ని ఎంచుకొని టాప్‌గా కుట్టాం. మధ్యలో చిన్న చిన్న బటన్స్ ఈ టాప్‌ని మరింత అందంగా మార్చాయి. జీన్స్, లెగ్గింగ్‌ల మీదకి ఈ టాప్ చాలా బాగుంటుంది. చిన్న ఫంక్షన్లలో ఈ డ్రెస్‌తో మెరిసిపోవచ్చు.

బుద్ధుడి బొమ్మలు వచ్చిన కలంకారీ టాప్ ఇది. దీన్ని పలాజో, జీన్స్, లెగ్గింగ్స్ మీదికి వేసుకోవచ్చు. దీనికి 3/4 హ్యాండ్స్ ఇచ్చాం. ఈ టాప్ మధ్యలో స్లిట్ వస్తుంది. దాన్ని ట్రై చేసుకోవచ్చు. లోపల కచ్చితంగా ఏదైనా కాంట్రాస్ట్ కలర్ టీ షర్ట్ వేసుకుంటే బాగుంటుంది. కాలేజ్ అమ్మాయిలు క్యాజువల్ డ్రెస్‌గా వేసుకోవచ్చు.

ఏది వేసుకున్నా స్టైల్‌గా ఉండడమే కాదు.. కంఫర్ట్‌గా ఫీలవ్వాలి. అందుకే ఈ ప్యాటర్న్. జీన్స్, లెగ్గింగ్స్ మీద ఈ చీర కట్టేయొచ్చు. పసుపు పచ్చని శాటిన్ చీర చుట్టాం. ఇక దీనికి మల్టీ కలర్ కాటన్ సిల్క్ బ్లౌజ్ ఇవ్వడంతో స్టైలిష్ లుక్‌తో అదిరిపోయింది. వీటిని కాలేజ్ ఫంక్షన్లలో సరదాగా ట్రై చేయొచ్చు.

ఈ డ్రెస్ టీనేజర్స్‌నే కాదు.. అన్ని రకాల జనరేషన్‌లని ఆకట్టుకుంటున్నది. ఆకుపచ్చని కలంకారీ కాటన్ టాప్ ఇది. దీన్ని కూడా లెగ్గింగ్, జీన్స్, పలాజోల మీదకి ట్రై చేయొచ్చు. దీనికి ముందు భాగంలో స్లిట్ ఇచ్చాం. అంతే కాదు పైన టై చేసి కోటు మాదిరిగా వేసుకోవచ్చు. లోపల మీకు నచ్చిన రంగు టీ షర్ట్ వేసుకుంటే మరింత అందంగా కనిపిస్తారు.



సరితా రెడ్డి
ఫ్యాషన్ డిజైనర్
facebook.com/SarithaReddydesigns

చిన్న చిన్న పార్టీల్లో అందంగా మెరిసిపోవాలంటే ఈ టాప్ వేయాల్సిందే! రాయల్ బ్లూ కలర్ రాసిల్క్ ఫ్యాబ్రిక్ ఇది. దీనిమీద సెల్ఫ్ సిల్వర్ వీవింగ్ వచ్చింది. దీన్ని లాంగ్ టాప్‌లో కుట్టి నాలుగు వైపులా స్లిట్స్ ఇచ్చాం. దీంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నది. స్లీవ్‌లెస్ ఇవ్వడం దీనికి అదనపు ఆకర్షణ. ఈ టాప్‌ని జీన్స్, పలాజోలా మీదికి ట్రై చేయొచ్చు.



వ్యర్థాలకు అర్థం చెప్పింది!

మనదేశంలో పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాల శాతం రోజురోజుకూ పెరిగిపోతున్నది. ఎన్ని ప్రయత్నాలు చేసినా వాటిని నిరోధించలేపోతున్నారు. అయితే పరిశ్రమల వ్యర్థాలకు ముంబైకి చెందిన డిజైనర్ కొత్త పరిష్కారం చూపుతున్నది.

ముంబైకి చెందిన సుభీ సచాన్ ఢిల్లీలో టెక్స్‌టైల్ డిజైనింగ్ కోర్సు చేసింది. ఆ తర్వాత 'వ్యర్థాల నుంచి మంచి వస్తువులు తయారు చేయడం ఎలా?' అనే అంశంపై పరిశోధన ప్రారంభించింది. 2012 నుంచి అధ్యయనం చేస్తూ.. 'వ్యవసాయ వ్యర్థాలను మళ్లీ ఎలా ఉపయోగించుకోవచ్చు' అని ప్రాజెక్ట్‌ను రూపొందించింది. వడ్ల నుంచి వచ్చే తాలును పొడి చేసి సౌందర్య సాధనాలకు ఉపయోగించవచ్చని తన పరిశోధనలో నిరూపించింది. గోద్రేజ్ అండ్ బోయోస్ సంస్థను ఒప్పించి.. ఉత్పత్తులు తయారు చేయించింది. ఆ తర్వాత 2015లో 'పారిశ్రామిక వ్యర్థాలను ఉపయోగించడం ఎలా?' అనే అంశంపై పరిశోధన ప్రారంభించింది. మళ్లీ గోద్రేజ్ కంపెనీని ఒప్పించి పారిశ్రామిక వ్యర్థాలతో అందమైన వస్తువులు తయారుచేయించింది. ఇలా దాదాపు 600లకు పైగా మెటీరియల్స్‌ను రూపొందించవచ్చని నిరూపించింది సుభీ. పారిశ్రామిక వ్యర్థాల నుంచి తయారు చేసిన దుస్తులను లాక్మే ఫ్యాషన్ షోలో మోడల్స్‌తో ప్రదర్శించింది.

అడుగండి చెబుతా

గుండెజబ్బులు వస్తాయా?

నా వయసు 35 సంవత్సరాలు. మార్కెటింగ్ రంగంలో ఉన్నాను. కొద్ది నెలలుగా బీపీ ఎక్కువగా ఉంటున్నది. మందులు వాడుతున్నాను. బీపీ ఎక్కువగా ఉండేవారికి గుండెజబ్బులు వచ్చే అవకాశం ఎక్కువ అని విన్నాను. నిజమేనా? ఈ పరిస్థితిలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? దయచేసి పూర్తి వివరాలు తెలియజేయగలరు.

- టి. మంగపతి, మందమర్రి



బీపీ పెరిగితే గుండెకు రక్తాన్ని అందించే కరోనరీ ధమనుల మీద ఒత్తిడి పెరుగుతుంది. అదే సమయంలో ఈ రక్తనాళాలలో కొలెస్ట్రాల్ అణువులు పేరుకుపోయి రక్తప్రసరణకు ఆటంకంగా మారుతుంది. అంతేకాదు ధమనులు పెళుసుగా మారుతాయి. కొలెస్ట్రాల్ చేరిన భాగంలో సన్నగా పగుళ్లు ఏర్పడి అందులో రక్తం గడ్డకడుతుంది. అందువల్ల రక్త ప్రసరణ మార్గం మరింత కుంచించుకు పోతుంది. ఫలితంగా గుండె కండరాలకు రక్తసరఫరాలో ఆటంకాలు ఏర్పడి ఆక్సిజన్, పోషకాలు అందవు. ఈ విధంగా గుండె కండరాలకు జరిగే నష్టం వల్ల కండరాలు నిర్వీర్యం అవుతాయి. ఫలితంగా గుండెపోటు రావచ్చు. బీపీ ఎక్కువగా ఉంటే వల్ల గుండె కండరాలు మందంగా మారి లెఫ్ట్ వెంట్రిక్యులార్ హైపర్ ట్రోఫీ వ్యాధి వస్తుంది. ఫలితంగా శరీరావసరాలకు సరిపడినంత రక్తాన్ని పంప్ చెయ్యలేదు.

బీపీ ఎక్కువగా ఉన్నట్టు నిర్ధారణ కాగానే గుండె పనితీరు మీద దీని ప్రభావం ఎంతుందో తెలుసుకునేందుకు వెంటనే కార్డియాలజిస్ట్‌ను కలుసుకొని అవసరమైన పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. బీపీ ఎక్కువగా ఉన్నవారు కొన్ని జీవన శైలి మార్పులు చేసుకోవడం ద్వారా బీపీ వల్ల కలిగే ఇతర అనారోగ్యాలను నివారించడం సాధ్యపడుతుంది.

- ఆహారంలో ఉప్పు, కొవ్వు పదార్థాలు తగ్గించి తీసుకోవాలి. మందులు కూడా తప్పకుండా వేసుకోవాలి.
- రోజూ క్రమం తప్పకుండా ఒక గంట పాటు మీకు అలవాటు ఉన్న ఏదో ఒక వ్యాయామం చేయాలి. వాకింగ్ అయితే అన్నింటికి మంచిది.
- ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఇందుకు యోగా, మెడిటేషన్ వంటివి సాధన చేస్తే మంచిది.
- పొగ తాగడం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి.
- బరువు ఎక్కువగా ఉంటే తప్పనిసరిగా బరువు తగ్గేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

ఈ జాగ్రత్తలన్నీ పాటిస్తే బీపీ ఉన్నప్పటికీ సాధారణ జీవితం గడుపవచ్చు.




డాక్టర్ శశికాంత్
సీనియర్ కార్డియాలజిస్ట్
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్

సిరిముగ్గు



పగడాల విజయ
బాచుపల్లి, రంగారెడ్డి



మా చిరునామా:
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9, కృష్ణాపురం, బంజారాహిల్స్, రోడ్ నెం - 10, హైదరాబాద్ - 500034.
zindagi@ntdaily.news, indagi.nt@gmail.com

నమస్తే తెలంగాణ
చింతన
[హైదరాబాద్]
శుక్రవారం 5 జనవరి 2018

వరుని ఎంపిక

వారణాసి సమీప గ్రామంలోని ఒక పండిత కుటుంబానికి చెందినవాడు సుప్రబుద్ధి. పెద్దగా చదువుకోకపోయినా సంయమనం, సంస్కారం కలవాడు. ఆయనకు నలుగురు ఆడపిల్లలు. వారూ పెరిగి పెద్దవారయ్యారు. పెళ్ళీడుకొచ్చారు.

ఒకరోజున వారి నలుగురినీ పిలిచి, 'అమ్మా! మీ నలుగురికీ పెళ్ళీడు వచ్చింది. మీకు ఎవరెవరికి ఎలాంటి యువకుడు కావాలో చెప్పండి' అని అడిగాడు.

పెద్దమ్మాయి సుజాత, 'తండ్రీ! అనాకారివాడైతే అందరూ గేలి చేస్తారు. కాబట్టి నాకు మంచి రంగూ, రూపూ ఉన్న అందమైనవాడు కావాలి' అంది. రెండో కుమార్తె సునీత, 'నాన్నా! అందం కంటే మనిషికి ఆరోగ్యం ముఖ్యం. ఆయుష్షు ముఖ్యం. కాబట్టి మంచి దీర్ఘాయుష్షు కలవాడితో నా వివాహం జరిపించు' అని కోరింది. మూడో కూతురు సుభద్ర, 'తండ్రీ! అందం, ఆయుష్షులు కేవలం వ్యక్తిగతాలు. మనకి గౌరవ మర్యాదలు తెచ్చిపెట్టేవి ధనం, వంశం మాత్రమే. కాబట్టి నాకు గొప్ప వంశం వాడు కావాలి' అంది.

చివరికి నాలుగో అమ్మాయి సుగుణ, 'నాన్నా! నాకు అందం, ఆయుష్షు, ఐశ్వర్యం, వంశం కంటే గుణవంతుడు కావాలి. అతను ఎలా ఉన్నా, ఏ వంశం వాడైనా, పేదవాడైనా సరే గుణవంతుడైతే సరి' అంది.

వారు చెప్పిన వాటిలో అన్నీ మంచిగానే అనిపించాయి ఆ తండ్రికి. నిజానికి అందం, ఆయుష్షు, ఐశ్వర్యం కలిగిన గుణవంతుడైన గొప్పవంశం కలవారు నలుగురు దొరికితే ఎంత బాగుంటుంది అనుకున్నాడు. మరలా అంతలోనే, 'ఇది దురాశే' అని గ్రహించాడు. దుర్లభం అని తెలుసుకున్నాడు. అసలు ఎలాంటివాడు ఆడపిల్లకు తగినవాడో తేల్చుకోలేకపోయాడు. ఆ పట్టణానికి బోధిసత్త్వుడు (బుద్ధుడు) వచ్చాడని తెలుసుకుని వెళ్లి విషయం చెప్పాడు.


'సుప్రబుద్ధీ! ఒక దొంగ చాలా అందంగా ఉన్నాడనుకో, నీవు అతణ్ణి మెచ్చుకుంటావా? 'లేదు భంతే!' 'ఒక అనామకుడు, సోమరి, దుష్టబుద్ధి ఎక్కువ కాలం జీవించాడనుకో.. నీవు హర్షిస్తావా?' 'లేదు భగవాన్!' 'ఒక గొప్పవంశం వాడు, దురాచారి అనుకో. దుశ్శీలుడనుకో.. గౌరవిస్తావా?' 'లేదు భగవాన్' 'కాబట్టి సుప్రబుద్ధీ..

అత్థో అత్థి సరీరస్మిం, వుడ్ఢబ్యస్స నమోకరే
అత్థో అత్థి సుజాతస్మిం, సీలం అస్మాక రుచ్చతీ'

అందం, వంశం, ఆయుష్షులు అనేది కేవలం గొప్ప అని చెప్పుకోవడానికే. శీల గుణం కంటే మించినది ఏదీ ఈ లోకంలో లేదు. కాబట్టి శీలవంతుణ్ణి, గుణవంతుణ్ణే అల్లునిగా ఎంచుకో' అని చెప్పాడు. ఆ తర్వాత సుప్రబుద్ధి నలుగురు కూతుళ్ళకూ గుణవంతులతోనే వివాహం జరిపించాడు.

... బొర్రా గోవర్ధన్

బుద్ధమార్గం



గీతాంజలి



21వ పాశురం

ఏత్తకళఙ్గళ్ ఎదిర్ పొఙ్గి మీదళిప్ప
మాత్తాదే పాల్శొరియుమ్ వళ్ళల్ పెరుమ్పశుక్కళ్
ఆత్తప్పడైత్తాన్ మగనే! అఱివుఱాయ్
ఊత్తముడైయాయ్! పెరియాయ్! ఉలగినిల్
తోత్తమాయ్ నిన్ఱ శుడరే! తుయిలెళాయ్
మాత్తార్ ఉనక్కు వలితొలైన్దు ఉన్ వాశఱ్కణ్
ఆత్తాదువన్దు ఉన్ అడిపణియుమాపోలే
పోత్తియామ్ వన్దోమ్పుగళ్న్దేలో రెమ్బావాయ్

భావం
ఎత్తిన కుండలు ఎదురు పొంగేట్టుగా ఆగకుండా పాలిచ్చే కామధేనువులెన్నో కలిగివున్న నందగోప తనయా మేలుకో. ఆశ్రితరక్షకా! మేలుకో. బలము తగ్గి అసహాయులైన శత్రువులు నిన్ను చేరి, నీ పదములు సేవించిన విధంగా మేము నిన్ను కీర్తింపగా వచ్చాము. జగతికే మంగళం చేకూర్చు మన శ్రీవ్రతం.

22వ పాశురం

అఙ్గణ్మాజలత్తరశర్ అభిమాన
బఙ్గమాయ్ వన్దునిన్ పళ్ళికట్టిల్ కీళే
శఙ్గమిరుప్పార్‌పోల్ వన్దు తలై ప్పెయ్‌దోమ్
కిఙ్గిణివాయ్ చ్చెయ్‌ద తామరై ప్పూప్పోలే
శెఙ్గణ్ శిఱిచ్చిరిదే యెమ్మేల్ విళియావో
తిఙ్గళుం ఆదిత్తియను మెళున్దాఱ్పోల్
అఙ్గణిరణ్డుగొణ్డు ఎఙ్గళ్ మేల్ నోక్కుదియేల్
ఎఙ్గళ్‌మేల్ చాపమిళిన్దేలో రెమ్బావాయ్.

భావం
విశాలమైన పృథ్విని ఏలే రాజులు అభిమాన భంగమై నీ శరణువేడే విధంగా మేమందరమూ చేరితిమి ఆదరింపుము స్వామీ. కెంజాయ కనుదోయి కరుణా కటాక్షముల, సూర్యచంద్రులు కలిసి ఉదయించినట్లుగా రెండు నేత్రాలతో నిండుగా చూసిన చాలు.. మా శాపకర్మలన్నీ మటుమాయం అవుతాయి. జగతికే మంగళం చేకూర్చు మన శ్రీవ్రతం.

23వ పాశురం

మారి మలై ముళంజిల్ మన్నిక్కిడన్దు ఉఱంగుమ్
శీరియశిఙ్గం అఱివిత్తుత్తీవిళిత్తు
వేరిమయిర్ పొఙ్గ ఎప్పాడుమ్ పేర్న్దుదఱి
మూరి నిమిర్ధు ముళంగిప్పుఱప్పట్టు
పోదరమా పోలే నీ పూవై ప్పూవణ్ణా! ఉన్
కోయిల్ నిన్ఱిఙ్గనే పోన్దరుళి, కోప్పుడైయ
శీరియ శింగాసనత్తిరున్దు యామ్‌వన్ద
కారియం ఆరాయ్‌న్దరుళేలో రెమ్బావాయ్.

భావం
కొండగుహలో ఒద్దికగా నిద్రించిన శౌర్యవంతమైన సింహం మేలుకొని, తీవిగా జూలు విదిల్చి, గర్జించి బయలుదేరే విధంగా అరుదెంచవయ్యా. కోవెల నుంచి కొలువు కూటమికి వచ్చి, మనోహరమైన సింహాసనాన్ని ఎక్కుము. మమ్ము మన్నించి, దయజూపడానికి వేగంగా రావయ్యా చిన్ని కృష్ణయ్యా. జగతికే మంగళం చేకూర్చు మన శ్రీవ్రతం.

24వ పాశురం

అన్ఱి వ్వులగం అళన్దాయ్ అడిపోత్తి
శెన్ఱంగు తెన్నిలంగై శెత్తాయ్! తిఱల్ పోత్తి
పొన్ఱచ్చగడం ఉదైత్తాయ్! పుగళ్‌పోత్తి
కన్ఱు కుణిలా వెఱిన్దాయ్! కళల్ పోత్తి
కున్ఱు కుడైయా ఎడుత్తాయ్ గుణం పోత్తి
వెన్ఱుపగై కెడుక్కుమ్ నిన్‌కైయిల్ వేల్ పోత్తి
ఎన్ఱెన్ఱుమ్ శేవగమే యేత్తిప్పఱై కొళ్‌వాన్
ఇన్ఱు యామ్ వన్దోం ఇరఙ్గేలో రెమ్బావాయ్.

భావం
అలలోనూ, ఇలలోనూ కొలిచిన చరణాలకు మంగళం. లంకను కూల్చిన అతిబలునకు మంగళం. శకటాసురుడిని చంపిన యశస్వికి మంగళం. గోవర్ధనాన్ని గొడుగుగా ఎత్తినవాడికి జయ మంగళం. వైరుల వధించే నీ వేలాయుధానికి మంగళం. అని నీ వీర చరితము గానం చేసి వచ్చేము కరుణించవయ్యా. జగతికే మంగళం చేకూర్చు మన శ్రీవ్రతం.

25వ పాశురం

ఒరుత్తి మగనాయ్ పిఱన్దు ఓరిరవిల్
ఒరుత్తి మగనాయ్ ఒళిత్తు వళర
తరిక్కి లానాగి త్తాన్ తీంగునినైన్ద
కరుత్తైప్పిళైప్పిత్తు కఞ్జన్ వయిత్తిల్
నెరుప్పెన్న నిన్ఱ నెడుమలే! ఉన్నై
అరుత్తిత్తువన్దోమ్ పఱైతరుదియాగిల్
తిరుత్తక్క శెల్వముమ్ శేవగముమ్ యామ్పాడి
వరుత్తముం తీర్న్దు మగిళ్న్దేలో రెమ్బావాయ్.

భావం
ఒక అమ్మకు కుమారుడివై జన్మించావు. ఆ రాత్రిపూటే మరో అమ్మ ఒడిలో చేరి పెరిగినావు. నిన్ను పరిమార్చడానికి పన్నిన పన్నాగాలను తలకిందులుగ చేశావు. కంసుని గుండె బడబాగ్నివైనావు. ఓ ఆశ్రిత పక్షపాతీ! నిన్నే కోరి వచ్చాము. శ్రీ అయిన లక్ష్మికే శ్రీ అయిన నీ విభవం, వీర గాథలు గానం చేస్తాము. జగతికే మంగళం చేకూర్చు మన శ్రీవ్రతం.

26వ పాశురం

మాలే! మణివణ్ణా! మార్‌గళి నీరాడువాన్
మేలై యార్ శెయ్‌వనగళ్ వేణ్డువన కేట్టియేల్
ఞ్ఞాలత్తై యెల్లామ్ నడుఙ్గ మురల్వన
పాలన్న వణ్ణత్తు ఉన్ పాఞ్చశన్నియమే
పోల్ వన శఙ్గఙ్గళ్ పోయ్‌ప్పాడుడై యనవే
శాల ప్పెరుమ్పఱైయే పల్లాణ్డిశైప్పారే
కోలవిళక్కే కొడియే వితానమే!
ఆలినిలైయాయ్! అరుళేలో రెమ్బావాయ్.

భావం
మాలయా, మణివర్ణమా.. మార్గళి స్నానం చేసి సిరినోము నోచడానికి ఏమేమి కావాలి స్వామీ! పాల వలె తెల్లన్ని పాంచజన్యాన్ని పోలిన శంఖాలు లోకాలను కంపింపగా మ్రోగగా వింటావా! కృపసేయుమా! మా వటపత్రశాయీ! జగతికే మంగళం చేకూర్చు మన శ్రీవ్రతం.


27వ పాశురం

కూడారై వెల్లుమ్ శీర్‌గోవిన్దా! ఉన్దన్నై
ప్పాడిప్పఱైకొణ్డు యాంపెఱుశమ్మానమ్
నాడు పుగళుమ్ పరిశినాల్ నన్ఱాగ
శూడగమే తోళ్వళైయేతోడే శెవిప్పూవే
పాడగమే యెన్ఱనైయ పల్ కలనుం యామణివోమ్
ఆడై యుడుప్పోమ్ అదన్పిన్నేపాల్ శోఱు
మూడ నెయ్ పెయ్‌దు ముళంగై వళివార
కూడి యిరున్దు కుళిర్‌న్దేలో రెమ్బావాయ్.

భావం
కూడని వారిని కూడించే గోవిందా! నిన్ను కీర్తించి పరను పొందుతాము. అపురూపమైన కంకణాలు, భుజకీర్తులు, చెవిదుద్దులు, జుమికీలు, మెట్టెలు, పట్టీల వంటి ఆభరణాలు, ఉడుపులు ధరించి, ఆపై క్షీరాన్నం మునిగేట్టుగా నేయి పోసి, నీతో కలిసి హాయిగా ఆరగింతుము గాక! జగతికే మంగళం చేకూర్చు మన శ్రీవ్రతం.

సంధర్భం

పాప హరణం అయ్యప్ప నామం



కల్మషం పెరిగిపోయి ఎటు చూసినా ఈర్ష్యా ద్వేషాలతో కూడిన కలహాలు, పగప్రతీకారాలతో కూడిన అరాచకాలతో దర్శనమిస్తున్నదీ కలికాలం. ఇటువంటి కాలంలో జన్మించిన మానవులు జీవితంలో ఒక్కసారైనా ధరించవలసినది అయ్యప్ప దీక్ష. 'స్వామియే శరణమయ్యప్ప' అను తారకమాత్రం పలికితే చాలు.. సకల పాపాలు హరించిపోతాయి. ఈ మంత్రమే మానసిక, శారీరక బాధలను తీర్చి, మనిషిని సన్మార్గంలో నడిపిస్తుంది. శరణాగతులను తన చెంతకు చేర్చుకొని అభయమిచ్చే హరిహరాత్మజుడు అయ్యప్ప. అటువంటి అయ్యప్ప దీక్షను ఆచరించడమే కాదు, దాని గురించి తెలుసుకోవడమూ, తెలుపడమూ మహా పుణ్యకార్యంలో భాగమవుతాయి.

కారణజన్ముడు మణికంఠుడు

మహిషి అనే రాక్షసి కఠోరమైన తపస్సుతో దేవ, యక్ష, కిన్నెర, కింపురుష, మానవ, దానవులెవ్వరితోనూ మరణము లేకుండా వరం పొందింది. ముల్లోకాలను పీడిస్తున్న ఆ రాక్షసిని అంతం చేసేందుకు, మోహినీ అవతారుడైన శ్రీమహావిష్ణువుకు, పరమశివుడికి జన్మించినవాడే అయ్యప్ప. అయ్య అంటే విష్ణువు, అప్ప అంటే శివుడు అని అర్థం. ఆ ఇద్దరి కలయికతో ఉద్భవించిన వాడు కాబట్టే ఆ స్వామి అయ్యప్పగా అవతరించాడు.

పందళ దేశంలో అయ్యప్ప

కేరళలోని పందళ దేశపు రాజు రాజశేఖరుడు గొప్ప శివ భక్తుడు. అయితే సంతానలేమి అతనిని తీవ్ర మనోవేదనకు గురిచేసింది. అయితే తన ఆవేదనను తన ఇష్టదైవంతో చెప్పుకొని బాధపడేవాడు. ఒకనాడు కలలో పరమశివుడు కనిపించి.. వేటకు వెళ్లమని, అంతా మంచే జరుగుతుందని ఆశీర్వదించాడట. మర్నాడు అలాగే వేటకు వెళ్లిన రాజశేఖరుడికి.. అలసటతో ఒక చెట్టుకింద సేదతీరుతుండగా ఆ అభయారణ్యంలో శిశువు ఏడుస్తున్న శబ్దం వినిపించింది. అటు వెళ్లగా కోటిసూర్యుల వెలుగుతో సమానమైన తేజస్సు కలిగి తామర పూవులో ఉన్న శిశువు ఏడు పడగల సర్పం నీడలో ఉండడం గమనించాడు. అతణ్ని చూడగానే సర్పం అక్కణ్నుంచి వెళ్లిపోయింది. ఏడుపు ఆపేసి చిరునవ్వులు చిందిస్తున్న ఆ బాలుణ్ని తన చేతుల్లోకి తీసుకొన్నాడు రాజశేఖరుడు. ఇంతలో వృద్ధుడి రూపంలో సాక్షాత్కారమైన పరమేశ్వరుడు.. కంఠంలో మణిహారంతో ఉన్న బాలకుడికి మణికంఠుడిగా నామకరణం చేశాడు. ఈశ్వర ప్రసాదంగా స్వీకరించి, బాలుణ్ని పెంచుకోవాలని రాజశేఖరుడికి చెప్పి అదృశ్యమయ్యాడు. శిశువును చూసిన రాజశేఖరుడి భార్య, పందళ దేశపు రాణి ఎంతో ఆనందించింది. కన్నబిడ్డలా చూసుకొన్నది. మణికంఠుడి రాకతో పందళ దేశపు రాజ్యం సిరిసంపదలతో, భోగభాగ్యాలతో తులతూగింది. అతను వచ్చాక రాజ దంపతులకు ఒక కుమారుడు కలిగాడు. అతనే రాజరాజు. మణికంఠుడు, రాజరాజులిద్దరూ గురువు దగ్గర అస్త్ర,శస్త్ర విద్యలలో ఆరితేరారు. వృద్ధాప్యంతో బాధపడుతున్న రాజశేఖరుడు మణికంఠుడికి పట్టాభిషేకం చేయాలనుకొంటాడు. అందరూ సంతోషించినా, రాజశేఖరుడి భార్య మాత్రం సొంత బిడ్డ కాకుండా, పెంచిన కొడుకు పట్టాభిషిక్తుడు కావడం సహించలేకపోయింది. అందుకే అంతుచిక్కని తలనొప్పి వచ్చిందనే నాటకంతో.. ఆ నొప్పి పులిపాలు పూయడంతోనే తగ్గుతుందని వైద్యులతో చెప్పించింది. తల్లి బాధను చూడలేక తాను అడవికి వెళ్లి పులిపాలను తెస్తానని బయలుదేరుతాడు మణికంఠుడు.

అడవిలో ఆలయం

తాను వచ్చిన దైవకార్యం పూర్తయిందని, సెలవు ఇప్పించాలని పెంచిన తండ్రి రాజశేఖరుణ్ణి కోరుతాడు మణికంఠుడు. పందళ దేశం నుంచి తాను విసిరిన బాణం ఎక్కడ పడితే..అక్కడే తనకు ఆలయం నిర్మించి ఇవ్వాలని కోరుతాడు. అయ్యప్ప సంధించిన బాణం సరిగ్గా అక్కణ్నుంచి నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న అరణ్యంలో పడుతుంది. అక్కడే ఒక కొండపై అయ్యప్పకు రాజశేఖరుడు ఆలయాన్ని నిర్మించి ఇచ్చాడు. ఆ క్షేత్రమే శబరిమలై దివ్యక్షేత్రంగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకొన్నది.

స్వామియే శరణం అయ్యప్ప



ఈ శరణుఘోషే నన్ను ముప్పై ఐదేళ్లుగా అయ్యప్ప మాల ధరించేలా చేసింది. దీక్షలో ఉన్నా, లేకపోయినా ఆయన నామస్మరణలోనే ఉంటా. ఒకప్పుడు అరవై రోజులు దీక్ష చేసేవాళ్లం. కానీ అదిప్పుడు 41 రోజుల మండల దీక్ష అయ్యింది. గురుస్వామిగా ఎంతో మంది స్వాములకు మాలధారణ చేయించాను. వేల పడి పూజల్లో పాల్గొన్నాను. అయ్యప్ప దీక్ష కఠినమైన నియమనిష్టలతో కూడుకున్నది. భక్తి ప్రపత్తులతో స్వామిని సేవిస్తే.. తప్పక అనుగ్రహిస్తాడు.

– ప్రకాశ్, గురుస్వామి

మహిషి సంహారం పందళకు తిరుగు పయనం



తల్లి తలనొప్పి నివారణ కోసం పులిపాలు తెచ్చేందుకు అడవికి వెళ్లిన అయ్యప్పకు.. నారద మహర్షి ఎదురై దైవకార్యాన్ని (మహిషి) గుర్తు చేసి, కర్తవ్య బోధ చేస్తాడు. అరణ్య మార్గంలోనే అలుసా నదీతీరాన ఎదురుపడిన మహిషితో ఘోర యుద్ధం చేస్తాడు మణికంఠుడు. శాప విముక్తురాలైన మహిషి కళ్ల వెంట కారిన ఆనందబాష్పాలు కలిసి అలుసానదియే అలుదా నది ఏర్పడిందన్నది చరిత్ర. మహిషి సంహారం అనంతరం అయ్యప్పపై దేవలోకం పూలవర్షం కురిపించింది. దేవేంద్రుడు సహా పలువురు దేవతలు పులులుగా మారి అయ్యప్ప చెంత నిలిచారు. పులిగా మారిన ఇంద్రుడిపై అధిరోహించి.. పందళదేశానికి బయల్దేరాడు అయ్యప్ప.

దీక్షాకాలం

అయ్యప్ప దీక్ష చాలా నిష్ఠతో కూడుకున్నది. ఈ మాలధారణకు కార్తీకమాసం తొలిరోజు శ్రేష్ఠమైనది. ఆనాటి నుంచి.. నలభై ఒక్క రోజుల పాటు నియమ నిష్ఠలతో స్వామిని పూజించాలి. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు చన్నీటి స్నానం చేసి.. శుభ్రమైన నలుపు బట్టలు ధరించి స్వామి పూజ చేసుకోవాలి. అష్టోత్తర, శరణుఘోష, లోకవీరంతో స్వామిని స్తుతించాలి. స్వామికి అటుకులు, బెల్లం ఫలహారంగా సమర్పించి, తీర్థప్రసాదాలు స్వీకరించాలి. ఏక భుక్తం.. అనగా ఒంటిపూట భోజనం మాత్రమే చేయాలి. అది కూడాస్వయంగా వండుకొని.. మధ్యాహ్నం పన్నెండు నుంచి రెండు గంటల లోపు పూర్తిచేయాలి. సూర్యాస్తమయం అనంతరం మరోసారి చన్నీటి స్నానం చేసి సన్నిధిలో స్వామి పూజ చేసుకొని ఫలహారం తీసుకోవాలి. ఎప్పుడూ అయ్యప్ప శరణుఘోషను పలుకుతూ ఉండాలి. దీక్షాకాలమంతా ఇదే నియమాన్ని కొనసాగించాలి.

అయ్యప్పకు ప్రతిరూపం గురుస్వామి

అయ్యప్పమాలను గురుస్వామి ఆధ్వర్యంలోనే ధరించాలి. దీక్షలో అయ్యప్పను సేవించేందుకు ఆయనే మార్గదర్శకుడు. గురుస్వామిని అయ్యప్పకు ప్రతిరూపంగా తలవాలి. తొలిసారి అయ్యప్పమాలను ధరించేవాళ్లను కన్యస్వాములనీ, రెండోసారి ధరించేవాళ్లను కత్తిస్వాములనీ, మూడోసారి ధరించేవాళ్లను గంటస్వాములనీ, నాలుగోసారి మాలధారణ చేసేవాళ్లను గదా స్వాములనీ, ఐదోసారి మాల వేసుకొనేవాళ్లను పెరు స్వాములనీ, ఆరోసారి మాలధారణ చేయువారిని గురుస్వాములనీ అంటారు. అయ్యప్ప స్వాములందరూ గురుస్వాములు చెప్పిన పూజానియమాలను పాటిస్తూ దీక్షను భక్తితో కొనసాగించాలి.

మండల దీక్షే అసలైన దీక్ష

ఇటీవల కాలంలో నలభై ఒక్క రోజులు (మండలం), అందులో సగం రోజులు (అర్ధమండలం) దీక్షలు చేస్తున్నారు. తొలుత అయ్యప్ప దీక్ష అరువై రోజుల పాటు చేసేవారట. అసలీ దీక్షలో అర్ధమండలం అనే మాటకు తావులేదని చెబుతున్నారు గురుస్వాములు. 41 దినములు భక్తి ప్రపత్తులతో స్వామిచింతనలో తరిస్తూ దీక్షను కొనసాగిస్తేనే సార్థకత ఉంటుందంటున్నారు.

పడిపూజ మహత్మ్యం

మండల దీక్షలో భాగంగా కొందరు అయ్యప్పస్వాములు.. తోటి స్వాములందరినీ పిలిచి భిక్ష (ఏక భుక్త ఆహారం)ను ఏర్పాటు చేస్తారు. స్వామి సన్నిధిని తలపించేలా అలంకరించి పద్దెనిమిది మెట్లపై అయ్యప్పను నిలిపి.. ఘనంగా పూజలు నిర్వహిస్తారు. ఇదే పడిపూజా కార్యక్రమం. ఈ పూజల్లో స్వాములంతా పాటలు, భజనలు, అష్టోత్తరాలు, శరణుఘోష, లోకవీరంలతో స్వామిని స్తుతిస్తూ భక్తిపారవశ్యంలో మునిగితేలుతారు. ఆ శరణుఘోషను పలుకడం మధురానుభూతినిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

నలుపు బట్టలే ఎందుకు?

అయ్యప్ప స్వామి శనీశ్వరుడికి ఇచ్చిన వరమిది. ఒకానొక సందర్భంలో తనతో తలపడి ఓడిపోయిన శనీశ్వరుడిని ఇలా అనుగ్రహించాడట మణికంఠుడు. 'నా దీక్షను స్వీకరించే భక్తులు నీ కిష్టమైన నలుపు రంగు దుస్తులనే ధరిస్తార' ని వరమిచ్చాడు. అయ్యప్ప స్వాములు నలుపు రంగు ధరించడానికి కారణంగా ఈ ఇతివృత్తాన్ని చెబుతుంటారు. లుంగీ, చొక్కా, కండువా ధరించాలి. చాలామంది ఇప్పుడు అనువుగా ఉండేందుకు నల్లని ప్యాంట్లు ధరిస్తున్నారు. కానీ లుంగీ ధరించడమే ఈ దీక్షలో శ్రేష్ఠమని చెబుతున్నారు గురుస్వాములు.

ఇరుముడి ప్రాశస్త్యమిది..

అయ్యప్ప మాలలో ఇరుముడి చాలా పవిత్రమైనది, ప్రాముఖ్యమైనది. ఓం ఆకారంలో కుట్టించిన నల్లని సంచికి మధ్యలో ఒక తాడులాంటిది కట్టి రెండు భాగాలుగా విభజిస్తారు. ముందు భాగంలో బియ్యం, ఆవునెయ్యి, జుట్టు తీసిన కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ, జాకెట్లు, విభూతి, పన్నీరు, అగర్‌బత్తీ, కర్పూరం, తేనె, ఖర్జూరం, బెల్లం, మిరియాలు, జీడిపప్పు, ద్రాక్ష, యాలకులు, పేలాలు ఉంచుతారు. వెనుక ముడిలో పప్పులు, ఉప్పు, చింతపండు, మిరప్పొడి, ఆవాలు, ఇంగువ, తినే పదార్థాలను ఉంచి.. ఇరుముడిని కడుతారు. దీక్షాకాలాన్ని ముగించుకొని శబరికి తరలి వెళ్లేటప్పుడు అయ్యప్ప స్వాములు తలపై పెట్టుకొంటారు. తన తల్లి తలనొప్పికి పులిపాలు తీసుకొచ్చేందుకు అడవికి వెళ్లే సమయంలోఅయ్యప్పస్వామి.. ఇలాంటి ఇరుముడిలోనే తనకు అవసరమైన సామాగ్రినంతా కట్టుకొని తలపై పెట్టుకొని, భుజాలకు బాణాలు, విల్లును ధరించాడట. ఆ పద్ధతే నేటికీ అయ్యప్పస్వాములు కొనసాగిస్తున్నారు. అయితే నలభై ఒక్క రోజుల దీక్ష పూర్తయిన తర్వాతే ఇరుముడి కట్టాలన్నది నియమం. కానీ నేటి కాలంలో చాలామంది దీక్షాసమయం ముగియక ముందే.. ఇరుముడి కట్టుకొని బయలుదేరి మిగతా దీక్షకాలాన్ని ప్రయాణంలో కొనసాగిస్తున్నారు.

పద్దెనిమిది మెట్లు పద్దెనిమిది సూత్రాలు

స్వామి సన్నిధిలో ఉండే పద్దెనిమిది మెట్లకు ఎంతో విశిష్టత ఉన్నది. అవి ఒక్కో దేవతా స్వరూపమని చెబుతారు. స్వామివారు కొండపైకి చేరుకొనేందుకు ఒక్కో దేవుడు ఒక్కో మెట్టులా మారాడని అంటారు. అంతేకాదు, పద్దెనిమిది మెట్లు పద్దెనిమిది ధర్మసూత్రాలను సూచిస్తాయనే నమ్మకమూ ఉన్నది. మొదటి ఐదు మెట్లు పంచేంద్రియాలకు సంబంధించినవి. కళ్లు, ముక్కు, చెవులు, జిహ్వ, స్పర్శలకు ప్రతీకలుగా నిలుస్తాయి. తర్వాతి ఎనిమిది మెట్లు కామం, క్రోధం, మోహం, మదం, మాత్సర్యం, అసూయ, డాంబికాలు పలుకడం వంటి గుణాలను సూచిస్తాయి. ఆ తర్వాత ఉన్న మూడు మెట్లు సత్వ, తమో, రజో గుణాలకు ప్రతీకలు. చివరి రెండు మెట్లు విద్య, అవిద్య(అజ్ఞానం)ను సూచిస్తాయి. ఎవరైతే ఈ మెట్లను భక్తిభావంతో ఎక్కిస్వామిని దర్శించుకుంటారో అలాంటివారు శారీరకంగా, మానసికంగా పరిపూర్ణులవుతారని భక్తుల నమ్మకం.

ఉపనిషత్సుధ-4

ఎవ్వనిచే జనించు..?



జిజ్ఞాసే తత్త్వ దర్శనానికి తొలిమెట్టు.

కంటికి కనిపిస్తున్న, నడుస్తున్న నిరంతరం పరిణామం చెందుతున్న ఈ సృష్టికి మూలం ఏమిటి? దాని వెనక దాగిన శక్తి ఏమిటి. ఇంత అద్భుతంగా గతి తప్పకుండా సాగుతున్న ఈ కదలికలకు, నానానేక చర్యలకు చోదక శక్తి ఏది? అనే ప్రశ్నలు సహజమైనవి. అనివార్యమైనవి. 'ఎవ్వనిచే జనించు...' అన్న పోతన మహాకవి జిజ్ఞాస 'అట్టి ఆత్మభవు, ఈశ్వరు.....' అంటూ తత్త్వదర్శనంగా ముగుస్తుంది.

ఆలోచనల పుట్టుక ఎట్లా? అన్ని ఆలోచనలు కలిసి మనసు ఎట్లా అవుతున్నది? ఆ మనసుకు చలనాన్ని, వేగాన్ని ఇస్తున్నది ఎవరు?

వాక్కు ఎట్లా పురుడు పోసుకుంటున్నది? దానికి మూలమైన భావన, భావం, భాషలను ఎవరు సమకూరుస్తున్నారు.. ఎవరు అమరుస్తున్నారు? వాక్కు స్పష్టతను, మాధుర్యాన్ని, గాంభీర్యాన్ని, అర్థాన్ని, పరమార్థాన్ని, శక్తిని పొందగల నేర్పును ఎవరు అలదుతున్నారు? పొదుగుతున్నదెవరు?

కంటికి దృశ్యాన్ని చూపిస్తున్నదెవరు? కాలులో ముళ్లు గుచ్చుకుంటే కన్నెందుకు ఏడుస్తున్నది? ఆ కన్నీరు ఎలా కారుతున్నది? దాని వెనుక ఉన్న యంత్రమేమిటి? ఈ అనుబంధ సంబంధ సమన్వయ క్రీడను సాగిస్తున్నది ఎవరు? శాసిస్తున్నది ఎవరు? నియంత్రిస్తున్నది ఎవరు? నిగ్రహిస్తున్నది ఎవరు? శ్రమిస్తున్నదెవరు?

కేవలం కట్టెగా జడాత్మకమైన శరీరం కరచరణాది అవయవాల ద్వారా భిన్న కార్యకలాపాలను ఎలా నిర్వర్తిస్తున్నది?

చెవులు వినగలగడం వెనుక దాగిన సూత్రమేమిటి?

ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు ఇంతటి సమన్వయంతో పనిచేయటం ఎవరి నేతృత్వంలో? ఎవరి ప్రేరణ వలన..?

ఈ ప్రశ్నలన్నింటికి సమాధానం ఒక్కటే.. అది 'ఆత్మ' అని!

మనం ధరించే చేతి గడియారంలో మూడు ముల్లులు ఆగకుండా తిరుగుతూ కాల ప్రమాణాన్ని మనకు చూపించటం వెనుక, గడియారం లోపల తాను కదలకుండా ముల్లులకు కదిలే శక్తిని ఇస్తున్న బ్యాటరీ వలె, ఈ సృష్టిలో జరిగే సమస్త కార్యకలాపాలకు ఆత్మే కారణమౌతున్నది.

శంకర భగవత్పాదులు 'ఆత్' అంటే 'ఏమీ' అనీ, 'మా' అంటే 'లేదు' అనీ ఆత్మను గురించి వ్యాఖ్యానించినప్పుడు, ఆత్మ అంటూ ప్రత్యేకంగా లేదని, కానీ ఉన్నదంతా ఆత్మేననే తత్త్వం బోధపడుతుంది. ఇనుప పెట్టెలో వజ్రాల నగ ఎట్లా ఉంచబడిందో శరీరంలో ఆత్మ, సర్వాణువుల యందు నిండి ఉన్నది. అన్ని ప్రజ్ఞలూ ఆత్మ నుండి ప్రసారమయ్యేవే.

దేనిని కనులు చూడలేవో, కానీ దేని వలన కనులు చూడగలుగుతున్నవో, అదే ఆత్మ! లేదా బ్రహ్మము!!

అందువల్లనే 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అన్న తత్త్వం అనుభవమౌతున్నది.

ప్రాణము, చైతన్యము, శక్తి... వంటివన్నీ ఆత్మశక్తులే! అంటే సర్వేంద్రియాలనూ ఆత్మే ప్రేరేపిస్తున్నది. కనుక సమస్త కార్య నిర్వహణ వెనుక ఉన్నదీ ఆత్మే అన్న భావన దృఢతరం అవుతున్నది.

అటువంటి మూలాన్ని పట్టుకొనే ప్రయత్నమే ఆత్మాన్వేషణ. ఫలించిన ప్రయత్నమే ఆత్మ సాక్షాత్కారం. అంటే ఆత్మ సాక్షాత్తు ఆకారమై కనిపిస్తున్నది అని అర్థం.

కనుక ఆత్మ సాక్షాత్కారం అంటే దైవ సాక్షాత్కారం కాదు. దైవం ఒక భావన. ఒక అంతర్గత శక్తి. దైవం నామ, రూప, గుణ, విశేష, వైభవోల్లసితం.

ఆత్మ నిర్వికార నిరామయ, నిరంజన, నికేతన స్థితి! అది కాలాద్యవిచ్ఛిన్నం. అపరిణామప్రాప్తం. అప్రమేయం. ఈ తత్త్వదర్శనం కడగా, 'ఈశ్వరోగురురాత్మేతి' అనే అనుభవాన్ని ప్రసాదిస్తున్నది. అంటే దైవం, గురువు, ఆత్మ ఒకటే అని!

ప్రతి క్షణమూ నశించే లేదా మార్పు చెందే పదార్థానికి, విషయాన్ని విడమరిచి బోధించే గురువుకూ, ఈ అన్నింటికీ మూలమైన ఆత్మకూ తేడా లేదు. అంతా ఒక్కటే!

బయట కనిపిస్తున్న వస్తువుల మూలాన్వేషణ పూర్తయిన తర్వాత కలిగే స్థిర అభిప్రాయం ఏమిటి? అని ఆలోచించినప్పుడు అది ఒక మహా ప్రజ్ఞ! అంతటికీ అదే మూలం. అదే అనంత శక్తి. పదార్థం కలిగించే పరమార్థం ఆవిష్కరించే యదార్థం నిశ్చలానందాన్ని కలిగిస్తయ్. దానినే వేదాంతులు బ్రహ్మానందం అన్నారు.

'ఎవరి వలన' అంటూ ప్రారంభమయే కేనోపనిషత్, ఆత్మాన్వేషణకు ముఖద్వారం. అది సింహద్వారం!

... వి. ఎస్. ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

నమస్తే తెలంగాణ
విహారం
[హైదరాబాద్]
శుక్రవారం 5 జనవరి 2018

మోషన్ సిక్‌నెస్‌కి..

చాలా మందికి ప్రయాణంలో కళ్లు తిరుగుతుంటాయి. దీన్ని మోషన్ సిక్‌నెస్ అంటారు. అది విమానమైనా, బస్ అయినా, కారైనా సరే కళ్లు తిరగడం, చల్లగా చెమటలు పట్టడం, వికారంగా అనిపించడం, లేదా వాంతులు కావడం వరకు ఏదో ఒక విధంగా బాధపడుతుంటారు. వీటిని నివారించేందుకు కొన్ని చిన్న సూచనలు పాటిస్తే చాలు.

- ప్రయాణానికి ముందు కడుపు నిండా భోంచెయ్యకూడదు. త్వరగా జీర్ణమయ్యే పదార్థాలే తీసుకోవాలి. సిగరెట్ పొగ, వాహనంలో వాడే ఎయిర్ ఫ్రెషనర్ వంటి ఘాటుగా ఉండే వాసనలకు దూరంగా ఉండాలి.
- వాహనంలో నుంచి బయటకు చూడడానికి వీలుగా ఉండే సీట్లో కూర్చోవాలి. కార్లో అయితే ముందు సీట్లో కూర్చోవడం మంచిది.
- వీలైనంత వరకు తల నిటారుగా ఉంచేందుకు ప్రయత్నించాలి. పుస్తకం చదవడం, లాప్‌టాప్ లేదా ఫోన్ చూడడం వంటి పనులు చెయ్యకపోవడమే మంచిది.
- వీలైతే వాహనం కిటికీలు తెరిచి ఉంచుకుంటే తాజా గాలి లోపలికి బయటకు వెళ్లేందుకు వీలుంటుంది కాబట్టి మరింత బావుంటుంది. అలాంటి వీలు లేకపోతే ఏసి ఫ్యాన్ మీ వైపు తిప్పి పెట్టుకోవాలి.
- శ్వాస నెమ్మదిగా పూర్తిస్థాయిలో దీర్ఘంగా ఉండేట్టుగా చూసుకోవాలి. తలతిరుగుతున్నట్టు అనిపిస్తే వెంటనే శ్వాస తీసుకుంటున్న తీరును గమనించి దీర్ఘశ్వాసలు తీసుకుంటే నెమ్మదిగా సమస్య సమసిపోతుంది.



నా ప్రయాణం

మీరు సరదాగా నిరంతర ప్రయాణాలు చేస్తున్నా, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం అప్పుడప్పుడూ టూర్లు వెళ్తున్నా... మీరు వెళ్లిన ప్రదేశం, దాని విశిష్టత, అక్కడి మీ అనుభవాలు, వెళ్లడానికి కారణాలు... వివరంగా మాకు రాసి పంపండి. మీ భావాలూ, భావోద్వేగాలు, అనుభవాల సమాహారాన్ని పేపర్‌పై పెట్టండి. అక్షరబద్ధం చేయండి. అంతేకాదు.. మీ ఊళ్లో, మీ చుట్టుపక్కల ప్రదేశాల్లో ఏమైనా ప్రత్యేకతలున్నా, పుణ్యక్షేత్రాలూ, జాతరలూ, ప్రత్యేక సంప్రదాయాలున్నా మాకు తెలుపండి.

మీ పేరుతో ప్రచురిస్తాం.

మరింకేం.. రాయడం మొదలుపెట్టండి.

మా చిరునామా : విహారం (నా ప్రయాణం), నమస్తే తెలంగాణ, తెలంగాణ పబ్లికేషన్స్ ప్రై. లిమిటెడ్, రోడ్ నెం. 10, బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034. viharam@ntdaily.news

శబరి యాత్ర

ఆద్యంతం.. ఆధ్యాత్మికం..!

అయ్యప్ప దీక్ష ఎంతటి పవిత్రమైనదో.. ఆ స్వామి కొలువైన శబరిమలైకు వెళ్లడం కూడా అంతే పవిత్రమైనది. దీక్షలో ఎన్ని నియమనిష్టలు ఉన్నాయో, శబరిమలై యాత్రలోనూ అన్నే ప్రత్యేకతలు ఉంటాయి. భూతల స్వర్గంగా తలపించే కీకారణ్యంలో కొనసాగేయాత్ర అసామాన్యమైనది, అద్వితీయమైనది. ఆధ్యాత్మిక అనుభూతిని పంచే ఈ యాత్రలో ఏటా లక్షల మంది భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకొంటారు. అందుకే ఆ యాత్రే కాదు, దాని విశేషాల సమాహారమూ సుమధురమే.

నలభై ఒక్క కఠోర దీక్ష అనంతరం.. ఇరుముడి తలపై పెట్టుకొని అయ్యప్ప స్వాములు శబరిమలైకి తరలివెళ్తారు. స్వాములు దీక్షలో ఎంత ఉత్సాహంగా ఉంటారో, శబరి యాత్రలోనూ అంతే ఉత్సాహాన్ని ప్రదర్శిస్తారు. సన్నిధానంలో పూజలు చేసి ఇరుముడి తలపై పెట్టుకొని బయలుదేరుతారు. కొందరు రైళ్లలో, బస్సులో వెళ్తే.. మరికొందరు సొంతవాహనాల్లో వెళ్తారు. శరణు ఘోష చేస్తూ ముందుకు సాగుతారు.

భక్తికి తార్కాణం.. పాదయాత్ర

ఏటా లక్షలాది భక్తులు అయ్యప్ప దర్శనానికై తరలి వెళ్తుంటారు. వీరిలో అధిక శాతం తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లే భక్తులే ఎక్కువ. వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న శబరి కొండకు రైళ్లు, బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వెళ్తుంటారు అయ్యప్ప భక్తులు.

చిన్నపాదం– పెద్దపాదం

శబరి యాత్రలో ఈ రెండు ఘట్టాలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకొన్నవి. పంబ నంది నుంచి శబరికొండకు కాలినడకన వెళ్లడాన్ని చిన్నపాదంగా చెబుతారు. ఎరిమేలిలోని వావరు స్వామి సన్నిధి నుంచి సుమారు అరవై కిలోమీటర్ల పాటు అరణ్యమార్గంలో కాలినడకన వెళ్లడాన్ని పెద్దపాదంగా సంబోధిస్తారు. ఈ రెండింటిలో పెద్దపాదమే శ్రేష్ఠమని, దానితోనే దీక్షాఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం.

వావరు స్వామిని దర్శనం..

అయ్యప్ప కొండకు వచ్చే భక్తులు ముందుగా దర్శించుకోవాల్సింది ఈ స్వామినే. స్వయంగా మణికంఠుడే ఆయనలా అనుగ్రహించాడు. వావరు స్వామి పూర్వకాలంలో ఒక మంచి దొంగ. ధనికుల దగ్గర దోచిపెట్టి, పేదలకు పంచిపెట్టేవాడు. మహిషి సంహారానికి ముందు తనకు తారసపడిన వావరు స్వామిని అనుగ్రహించాడు అయ్యప్ప స్వామి. 'నా కొండకు వచ్చే అయ్యప్పస్వాములు.. నీ దర్శనం చేసుకొని, నీ సన్నిధిలోని విభూది పెట్టుకొని ముందుకు సాగితే అడవి మార్గంలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తవ'ని వరమిచ్చాడట. ఆ ఆనవాయితీ నేటికీ కొనసాగుతున్నది. శబరి కొండకు అరవై కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ వావరుస్వామి సన్నిధిలోనే కన్నిస్వాములు బాణాలు, కత్తిస్వాములు కత్తిని తీసుకొని స్వామివారి విభూదిని నుదుటిపై ధరించి ముందుకు సాగుతారు. భజన పాటలతో సందడి చేస్తారు. దీనినే పెద్దపాదంగా చెబుతారు.

అలుదా నది దాటుతూ..

అయ్యప్ప చేతిలో ఓడిన మహిషి శాపవిమోచనమై లీలావతిగా మారి, స్వామి దర్శన భాగ్యంతో ఆనందబాష్పాలు కారుస్తుంది. ఆ ధారలతోనే ఈ అలుదానది పుట్టిందని చరిత్ర చెబుతున్నది. అయితే ఎంత తొక్కినా పైకి ఎగిసి వచ్చే స్వభావం మహిషి సొంతం. అందుకే స్వామివారు ఆ రాక్షసిని ఒక బావిలో పడవేసి, పైకి లేవకుండా రెండు పెద్ద బండ రాళ్లను పైన ఉంచాడు. ఇప్పటికీ ఆ బావిని అక్కడ చూడొచ్చు. దానికే కళ్లీడు కొండ్రం అని పేరు. అలుదా నదిలోని రెండు రాళ్లను తీసుకొని ఆ బావిలో వేయడమనే ఆనవాయితీ నేటికీ కొనసాగుతున్నది.

మళికాపురోత్తమంజు దేవి

మహిషి లీలావతిగా మారి వివాహమాడాలని అయ్యప్పను కోరుతుంది. అయితే తన తల్లికి ఇచ్చిన వాగ్దానం గుర్తుకొచ్చి.. ఆమె కోరికను తిరస్కరిస్తాడాయన. అయినా ఆమె పట్టు వీడకపోవడంతో.. 'నా కొండకు కన్యస్వాములు ఏ సంవత్సరమైతే రారో, ఆ ఏడు నిన్ను తప్పక పెళ్లి చేసుకుంటా'నని చెబుతాడు. అప్పటి వరకు మళికా పురోత్తమంజు మాతగా తన సన్నిధిలోనే పూజలందుకోగలవని వరమిస్తాడు. స్వామి దర్శనం అనంతరం స్వాములందరూ మళికాపురోత్తమంజు దేవిని దర్శించుకొంటారు. ఏటా కొండకు వచ్చే దేవి.. అక్కడి శరణుగుత్తిలో కన్నెస్వాములు ఉంచిన బాణాలను చూసి నిరాశగా వెనుదిరుగుతుందట.





కాల్‌ఘట్‌లో విశ్రాంతి

అలుదా నది దాటిన తర్వాత అలుదా కొండను దాటితే.. కాల్‌ఘట్ ఆశ్రమం వస్తుంది. కర్మెళ ఏట్రం(కొండ)ను ఎక్కి అక్కడి పుంగావుణలో వంటలు చేసుకొని భోజనం చేస్తారు స్వాములు.

పంబ నది ఒడ్డున..

కర్మెళ ఏట్రం దాటిన తర్వాత నాలుగు కిలోమీటర్లు నడిస్తే చిన్నపాదానికి ప్రారంభంగా భావించే పంబ నదిని చేరుకోవచ్చు. ఒకరాత్రి అక్కడ బస చేసి.. ఇరుముడిలో ఉన్న బియ్యం, పప్పు ధాన్యాలు బయటకు తీసి వండుకొని తిని, నిద్ర చేయాలి. ఉదయం నాలుగింటికే పంబలో స్నానమాచరించి కొండపైకి బయల్దేరాలి. బయల్దేరే ముందు కన్నెమూల గణపతి దర్శనం తప్పనిసరి. అక్కడ కొబ్బరికాయ కొట్టి ప్రయాణాన్ని ప్రారంభించాలి.

నీళిమలై ఏట్రం

ఈ కొండను ఎక్కిన తర్వాత అప్పాచిమేడ్‌లో సున్నుండలు లభిస్తాయి. వాటిని తీసుకొని చుట్టూ ఉన్న అటవీ ప్రాంతంలో విసరాలి. అలా చేస్తే ఆకలిగొన్న వన్యప్రాణులు సున్నుండలతో ఆకలి తీర్చుకొని.. వెనుదిరుగుతాయని, భక్తులకు ఎలాంటి హానీ తలపెట్టవనేది అనాదిగా భక్తుల నమ్మకం.

శబరిపీఠం

శ్రీరాముడు అరణ్యవాసంలో భాగంగా తన భక్తురాలు శబరిని కలిసిన ప్రాంతమిది. ఇక్కడే ఆమె ఇచ్చిన ఎంగిలి పళ్లను ఆరగించాడు శ్రీరామ చంద్రుడు. ఈ కొండ శబరి పేరుతో ప్రసిద్ధికెక్కుతుందని వరమిచ్చాడు. అదే ఈ శబరి పీఠం. అక్కడ విగ్రహాన్ని దర్శించుకొని ముందుకు సాగుతారు అయ్యప్పస్వాములు.

శరణుగుత్తి

వావరుస్వామి సన్నిధిలో బాణాలు తీసుకున్న కన్నిస్వాములు, కత్తులు తీసుకొన్న కత్తిస్వాములు.. వాటిని ఈ శరణుగుత్తిలో పెడుతారు. అయ్యప్ప స్వామిది కఠోరమైన బ్రహ్మచర్యం. తనను పెళ్లి చేసుకోమని కోరిన లీలావతికి కన్నిస్వాములు తనకొండకు రాని ఏడాది తప్పక చేసుకుంటానని చెబుతాడు. అయితే కన్నిస్వాములు రాని సంవత్సరమంటూ ఉండదు. అందుకే కన్ని స్వాములంటే అయ్యప్పకు చాలా ప్రీతి అని చెబుతుంటారు.

స్వామి సన్నిధి

శరణుగుత్తిలో బాణాలు, కత్తులు ఉంచిన తర్వాత.. అయ్యప్ప స్వాములు పవిత్రమైన పద్దెనిమిది మెట్లను ఎక్కుతూ అయ్యప్ప శరణుఘోష చేస్తూ స్వామి సన్నిధి చేరుకొంటారు. అయ్యప్ప మాల ధరించినవారే ఈ మెట్లు ఎక్కేందుకు అర్హులు. అనంతరం స్వామికి నెయ్యి అభిషేకం చేస్తారు.

... సంతోష్‌కుమార్ ప్యాట

ఇలా ప్లాన్ వేస్కోండి..

శబరిమలైకి అయ్యప్పస్వాములే కాదు.. మాలధారణ చేయని భక్తులు కూడా వస్తుంటారు. అయితే అయ్యప్పస్వాములు మాత్రం.. స్వామి దర్శనం చేసుకొని తిరిగి ఇంటికి పయనమవుతుంటారు. మామూలుగా వచ్చే భక్తులు.. అక్కడ చూడదగిన నాలుగు టూరింగ్ స్పాట్‌లను చుట్టేసి రావాలనుకొంటారు. అలాంటి వారి కోసం.. శబరిమలైకి వంద కిలోమీటర్ల లోపు ఉండే కొన్ని సుందరమైన ప్రదేశాల సమాచారాన్ని ఇక్కడిస్తున్నాం.

తిరువళ్ల:

- శబరిమలై నుంచి సుమారు తొంభై కిలోమీటర్ల దూరంలో ఉంటుందీ ప్రదేశం. మణిమాల నది పరివాహక ప్రాంతంలో పచ్చని ప్రకృతిలో నెలవైన అందమైన చిన్న టౌన్ ఇది. టెంపుల్ టౌన్‌గా దీనికి పేరుగాంచిన ఈ ప్రదేశానికి, ఇక్కడి సంప్రదాయానికి ఎంతో చరిత్ర ఉన్నది. ఇక్కడ కనిపించే పురాతన ఆలయాలు, అద్భుతమైన ఆర్కిటెక్చర్‌తో పర్యాటకులను ఆకట్టుకుంటాయి. దక్షిణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీవల్లభ ఆలయం ఇక్కడే ఉన్నది.



పీర్‌మేడ్

- కేరళలోని హిల్‌స్టేషన్స్‌లో పీర్‌మేడ్ ఒకటి. కొట్టాయం నుంచి తూర్పువైపుగా 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పీర్‌మేడ్‌లో ట్రెక్కింగ్ ట్రయల్స్ పర్యాటకులను అలరిస్తాయి. ఈ కొండలలో చల్లదనం, ప్రకృతి రమణీయత అద్భుతమైన అనుభూతినిస్తుంది. సముద్రమట్టానికి 915 మీటర్ల ఎత్తులో ఉన్న పీర్‌మేడ్ హిల్‌స్టేషన్ పశ్చిమ కనుమల నిర్మాణంతో అద్భుతమైన విజిటింగ్ స్పాట్ అనడంలో ఎలాంటి డౌటూ లేదు.



పాతానంతిట్ట

- కేరళకు దక్షిణభాగంలో ఉన్న అందమైన మరో ప్రదేశం పాతానంతిట్ట. భూతల స్వర్గంలా కనిపించే కేరళలోని అతిచిన్న జిల్లాలో ఇది నెలకొని ఉన్నది. పది నదుల సమూహంగా కనిపించే ఇక్కడి ప్రవాహాల్లో బోట్ రేసింగ్‌లు చాలా ప్రత్యేకమైనవి. అందమైన ఇక్కడి ప్రకృతి రమణీయత పర్యాటకులను కనులవిందు చేస్తుంది.



కొట్టాయం

- కేరళలోని ఒక పురాతన నగరం కొట్టాయం. అక్షరనగరంగా పిలువబడే ఈ నగరానికి కోట్, అకం అనే పదాల ద్వారా ఈ పేరు వచ్చింది. కోట్ అంటే కోట, అకం అంటే లోపల అని అర్థం. మొత్తంగా కొట్టాయం అంటే కోట యొక్క అంతర్భాగం అని అర్థం. కొండపై ఉన్న కొట్టాయం పాతనగరం చూడదగినది. పచ్చదనంతో నిండిన అందమైన పర్వతాలు, సహజమైన కొండలు చూపు తిప్పుకోనివ్వవు.



కుమరకొం

- శబరిమలై వెళ్లినవారు.. 110 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొట్టాయం వెళ్లి, అక్కణ్నుంచి 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే ఈ ప్రదేశానికి చేరుకోవచ్చు. ఇక్కడున్న వెంబనాడ్ సరస్సు కేరళలో అతిపెద్దది. అందమైన పచ్చిక బయళ్లతో కూడిన కుమరకొం.. ఆకుపచ్చ ద్వీపకల్పంగా పర్యాటకులను కట్టిపడేస్తున్నది.



కొట్టరక్కర

- ప్లేసెస్ ఫర్ టెంపుల్స్‌గా పేరుపొందిన ఈ ప్రదేశం కొల్లం జిల్లాలో ఉంది. ఇక్కడ ఉన్న పురాతన దేవాలయాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. శ్రీ మహాగణపతి దేవాలయం, శ్రీ మణికంఠేశ్వర దేవాలయం.. అందరినీ ఆకట్టుకుంటాయి. కొట్టరక్కరను ప్రముఖ భారతీయ నాట్యకళ కథకళీకి పుట్టినిల్లుగా చెబుతారు.



విహారి

మొదటి రోజు.. అలా మొదలైంది!

1962లో ఇండియాకి, చైనాకి యుద్ధం జరిగినప్పుడు నేను సెకండ్ ఫాం చదువుతున్నాను. పత్రికల్లో నిత్యం యుద్ధ వార్తలను కట్ చేసి ఓ పుస్తకంలో అతికించేవాడిని,

విద్యార్థి దశలో నేను టైమ్, న్యూస్ వీక్ లాంటి అమెరికన్ వారపత్రికల్లో చైనా గురించిన వార్తలను లైబ్రరీలో చాలా చదివాను. ఆ దేశంలోకి పరాయివాళ్లను అనుమతించరు. ఆ దేశ ప్రజలను దేశం నుంచి బయటికి అనుమతించరు. ఫలితంగా చైనాని 'బేంబూ కర్టెన్' అనే ముద్దు పేరుతో పిలిచేవారు. ఇదే పాలసీ గల మరో కమ్యూనిస్ట్ దేశమైన రష్యాని 'ఐరన్ కర్టెన్'గా పిలిచేవారు. పెర్ల్ ఎస్ బక్ రాసిన ది గుడ్ ఎర్త్ అనే నవలలో మూడు తరాల చైనీస్ కుటుంబ కథ ఉంటుంది. అందులో చైనా సంస్కృతి చదివాను. ఆ నవలలో స్వంత భూమితో సెంటిమెంటల్ అటాచ్‌మెంట్ ఉండడంతో దాన్ని అమ్మడానికి ఇష్టపడని ఓ వృద్ధురాలు పడే బాధ నాకు బాగా గుర్తుంది. అమెరికాలోని వాల్‌మార్ట్‌లో ఎక్కువ భాగం వినిమయ వస్తువులు చైనా నించి దిగుమతి అయినవే అని నా అమెరికా పర్యటనల్లో గమనించాను. అమెరికాలో కన్నా చైనాలో లేబర్ చవక అని, అందుకే దిగుమతి చేసుకుంటారని తెలిసింది. ఇప్పుడు ఇండియాలో కూడా చైనా బజార్లు వెలిసి, చైనా ఉత్పత్తులు దొరుకుతున్నాయి.

2013వ సంవత్సరం ఏప్రిల్ 26న మధ్యాహ్నం 1.30కి బయలుదేరాం. మూడు ఐదుకి రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని డొమెస్టిక్ డిపార్చర్ ముందు దిగాం. ఇండిగో కౌంటర్‌కి వెళ్లాం.



ఇండిగో కౌంటర్‌లో రద్దీ లేదు. మా టికెట్ ప్రింటవుట్‌ని, ఫొటో ఐడెంటిటీగా పాస్‌పోర్ట్‌ని చూపించాం. లగేజ్ టేగ్స్ తీసుకుని మా హేండ్ లగేజ్‌కి కట్టాం. సెక్యూరిటీ చెక్‌లో ఆడవాళ్ల క్యూలో పద్మజ, మగవాళ్ల క్యూలో నేను మా బోర్డింగ్ పాస్‌లతో నిలబడ్డాం. జేబులోని చిల్లర, ఇతర వస్తువులు ట్రేలో పెట్టి దాన్ని, హేండ్ లగేజ్‌ని కదిలే రోలర్స్ మీద ఉంచితే, స్కానర్‌లోంచి అవతలివైపుకి చేరాయి. మెటల్ డిటెక్టర్ అమర్చిన గుమ్మం ముందు క్యూలో నిల్చుని సెక్యూరిటీ గార్డ్ పిలిచేదాకా ఆగి వెళ్లాలి. మెటల్ డిటెక్టర్, తర్వాత చేత్తో తడిమి చెకింగ్ పూర్తయ్యాక బోర్డింగ్ పాస్ మీద అతను రబ్బర్ స్టాంపు కొట్టి ఇచ్చాడు. స్కానర్‌లోంచి వచ్చిన ట్రేలోని వస్తువులను తీసుకుని, ఏర్‌బేగ్‌కి కట్టిన టేగ్ మీద సెక్యూరిటీ వాళ్లు వేసిన త్రికోణం రబ్బర్ స్టాంప్ ఉందో లేదో చెక్ చేసుకున్నాం. అది లేకపోతే మళ్లీ చెక్ చేసి, విమానం ఎక్కనివ్వరు. మళ్లీ వెనక్కి తిరిగి వచ్చి వేయించుకోవాలి. (2016 సంవత్సరం డిసెంబర్‌లో ప్రపంచంలో కేవలం ఇండియాలో మాత్రమే ఉన్న ఈ పద్ధతిని రద్దు చేశారు).

60 రూపాయల టీ!

డిపార్చర్ లాంజ్‌కి చేరుకున్నాం. మధ్యాహ్నం భోజనం చెయ్యలేదు కాబట్టి ఆకలిగా ఉంది. 'టేస్ట్ ఆఫ్ ఇండియా' అనే రెస్టారెంట్‌లో ఇద్దరికీ చెరో మైసూర్ మసాలా దోసె ఒక్కోటి 115 రూపాయలకు, అద్దలీటర్ నీళ్ల బాటిల్‌కి ఇరవై రూపాయలు చెల్లించి తీసుకున్నాం. అక్కడ కాఫీ/టీ కి 60 రూపాయలు, వెజ్ సమోసా 120 రూపాయలు, రవ్వ ఉప్మా 170, శాండ్‌విచ్ 170, వెజ్ బిరియానీ 170, కోక్ ఇతర కేన్డ్ డ్రింక్స్ 50 రూపాయలుగా ఉన్నాయి. ఇప్పటికి వాటి ధరలు ఇంకా పెరిగాయి. మైసూర్ మసాలా దోసె అంటే దోసె లోపల ఎర్ర కారం పూసిన మసాలా దోసె. కారంగా, రుచిగా ఉండే ఈ దోసె హైద్రాబాద్‌లోని అన్ని హోటల్స్‌లో దొరుకదు. రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టేబుల్స్‌లో ఓదాని ముందు కూర్చుని తిన్నాం. తర్వాత మా గేట్ నెంబర్ 26కి చేరుకున్నాం. శంషాబాద్ ఏర్‌పోర్ట్‌కి ఆసియాలోని బెస్ట్ ఏర్‌పోర్ట్‌గా గుర్తింపు లభించిందని వార్తల్లో చదివాను. ఈ బెస్ట్ ఏర్‌పోర్ట్‌లో చల్లబడ్డాక ఏసీ యంత్రం ఆగిపోయి, వేడెక్కాక మళ్లీ ఏసీ ఆన్ అవుతోందే తప్ప చల్లదనం కొనసాగడం లేదు!

(ఇంకా ఉంది)

... మల్లాది వెంకట కృష్ణమూర్తి

సుడోకు

డైలీ సుడోకు 90 సమాధానం

6	4	5	1	9	2	8	3	7
2	3	1	6	8	7	4	5	9
8	7	9	3	5	4	2	6	1
7	5	2	8	1	3	6	9	4
4	1	3	2	6	9	5	7	8
9	8	6	4	7	5	3	1	2
3	9	8	5	2	1	7	4	6
5	2	7	9	4	6	1	8	3
1	6	4	7	3	8	9	2	5

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -91

			2					8
4	2							
	6		5			9		
7		3	6					4
				4				
6					5	3		1
		4			6		5	
							9	2
1					8			

ట్వీట్



రెండు చిత్రాలూ బాగున్నాయి కదా!

కాజోల్
@KajolAtUN



కాజోల్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

1,716,476

కామన్‌మ్యాన్ వాయిస్

సమైక్యాంధ్ర కవులు ఇప్పుడు చేయాల్సింది తెలంగాణ రచయితల మీద దాడులు కాదు. ప్రత్యేక హోదా కోసం కలాలు పదును పెట్టడం. మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల మోసాన్ని ఎండగట్టడం. సమైక్యాంధ్ర కవులు ప్రత్యేక హోదా కవులుగా మారాలి.

–Boggula Srinivas

ఒక జోకర్‌ని మరొక జోకర్. ఒక బ్రోకర్‌ని మరొక బ్రోకర్ సమర్థించికోవడం సహజం. చేతకానితనాన్ని మౌనంతో అధిగమించడంలో కనీసం కొంత తెలివి ఉంది. మీలాంటోళ్లు అనవసరంగా మొరిగి పవన్ కల్యాణ్ మరీ ఏబ్రాసిని చేయకండి. ఆల్రెడీ చాలా వరకూ అయ్యాడు.

–Mahesh Kathi

వైరల్ వీడియో



రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న 'రంగుల రాట్నం' ట్రైలర్ యూట్యూబ్‌లో విడుదలయింది. ట్రెండింగ్ లిస్ట్‌లో నాలుగో స్థానంలో నిలిచింది.

Rangula Raatnam Trailer || Raj Tarun, Chitra Shukla || Shreeranjani || Annapurna Studios

Total views : 791,350+

Published on Jan 3, 2018

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
శుక్రవారం 5 జనవరి 2018

ఆనందం..ఆశ్చర్యం!

'పద్దెనిమిదేళ్ల క్రితం అమెరికాలో కొన్ని థియేటర్లలో విడుదలైన 'బద్రి' సినిమాకు పెద్ద విజయాన్ని కట్టబెట్టారు. ఇప్పుడు 'అజ్ఞాతవాసి' సినిమాను మరే భారతీయ చలన చిత్రానికి సాటిలేనంతగా భారీ స్థాయిలో విడుదల చేస్తుండటం ఆశ్చర్యంగా, ఆనందంగా వుంది' అని అన్నారు పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'అజ్ఞాతవాసి'. త్రివిక్రమ్ దర్శకుడు. ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. కీర్తిసురేష్, అను ఇమ్మాన్యుయెల్ కథానాయికలు. ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకురానున్నది. విదేశాల్లో ఒకరోజు ముందుగానే విడుదలకానున్నది. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులను ఉద్దేశించి పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ 'ఉన్న ఊరిని వదలి పక్క ఊరిలో పనిచేయడమే ఎంతో కష్టం. అలాంటిది రాష్ట్రాన్ని, మన దేశాన్ని వదిలి...పరాయి దేశంలో చదువుకోవడం, పనిచేయడం ఇంకా కష్టం. ఆత్మగౌరవం దెబ్బతినకుండా అక్కడ ఓ జీవితాన్ని ఏర్పరచుకోవడం, స్థానికతను సంపాదించుకోవడం ఎంత ఇబ్బందో నాకు బాగా తెలుసు. అందుకే మీరంటే నాకు అమితమైన గౌరవం. మీరెక్కడున్నా మీ వెనుక నేనుంటా. అక్కడ మీకు సమస్య ఎదురైతే ఇక్కడ కోట్ల గొంతులు అండగా నిలుస్తాయి. మీరు నాపై చూపించే ప్రేమకు, గౌరవానికి శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను' అని అన్నారు.


కీర్తి సురేష్, పవన్‌కల్యాణ్, అను ఇమ్మాన్యుయెల్

పవిత్ర ప్రేమకు నీరాజనం '2 కంట్రీస్'


ఎన్.శంకర్

'భార్యాభర్తల అనుబంధాన్ని హృద్యంగా దృశ్యమానం చేశారని '2కంట్రీస్' చిత్రానికి సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. భారతీయ, అమెరికా సంస్కృతుల మధ్య వుండే అంతరాన్ని మానవీయ కోణంలో సందేశాత్మకంగా ఆవిష్కరించారని ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు' అని అన్నారు ఎన్.శంకర్. ఆయన దర్శకత్వంలో సునీల్ కథానాయకుడిగా నటించిన '2 కంట్రీస్' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో విజయపథంలో పయనిస్తున్నది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎన్.శంకర్ 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా సంభాషించారు.

పవిత్ర ప్రేమే జయిస్తుంది

విడుదలైన అన్ని కేంద్రాల్లో సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. మాస్, క్లాస్ అనే తేడా లేకుండా అన్ని వర్గాల ఆదరణ చూరగొంటున్నది. వినోదంతో పాటు కథలో అంతర్లీనంగా దాగివున్న భావోద్వేగాలు ప్రేక్షకుల హృదయాల్ని హత్తుకుంటున్నాయి. ఎన్ని అవాంతరాలు ఎదురైనా చివరకు పవిత్ర ప్రేమే జయిస్తుందనే సార్వజనీన సత్యంతో ప్రతి ఒక్కరూ కనెక్ట్ అవుతున్నారు. సంస్కృతుల మధ్య అంతరాలు వున్నప్పుడు భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడం సహజమేనని, వాటిని పరిష్కరించుకొని దాంపత్య జీవితాన్ని నందనవనంలా తీర్చిదిద్దుకోవడం ఆలుమగల చేతిలోనే వుందనే పాయింట్ హృదయాల్ని స్పృశిస్తున్నది. ముఖ్యంగా పతాక ఘట్టాల్లోని సన్నివేశాల్ని చూసి తాము కన్నీళ్లు ఆపుకోలేకపోయామని చాలా మంది నాతో చెప్పారు. ఈ మధ్యకాలంలో భార్యాభర్తల అనుబంధాన్ని ఉదాత్తంగా ఆవిష్కరించిన చిత్రమిదేనని చెబుతున్నారు.

అమెరికా అందాలు కట్టిపడేస్తున్నాయి

నిర్మాణపరంగా ఏ విషయంలోనూ రాజీపడకుండా ఈ చిత్రాన్ని తెరకెక్కించాము. అమెరికాలోని సుందరమైన లొకేషన్లలో చిత్రీకరించిన సన్నివేశాలు ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. నిర్మాణ విలువలు గొప్పగా వున్నాయంటున్నారు. పరిశ్రమలోని చాలా మంది సీనియర్ నటులు సినిమాలో భాగం కావడంతో కథకు నిండుదనం చేకూరిందని మెచ్చుకుంటున్నారు. గోపీసుందర్ అందించిన బాణీలు సంగీతప్రియుల్ని అలరిస్తున్నాయి. కథానుగుణంగా నేపథ్య సంగీతం కూడా చక్కగా కుదిరిందంటున్నారు. కథానాయిక మనీషారాజ్ చూడముచ్చటైన రూపంతో పాటు చక్కటి అభినయంతో మెప్పిస్తున్నది. వరంగల్ పట్టణం నుంచి వచ్చిన ఆ అమ్మాయిని అచ్చ తెలంగాణ అందం అని ప్రేక్షకులు పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

పెళ్లి ఔన్నత్యాన్ని చాటిచెప్పాం...

నేటి సమాజంలో చిన్న చిన్న ఘర్షణలకే దంపతులు విడాకులు తీసుకునే వరకు వెళ్లిపోతున్నారు. ఈ ధోరణిలో మార్పు రావాలని ఈ సినిమా ద్వారా తెలియజెప్పాం. ప్రేమతో ప్రపంచాన్నే జయించవచ్చు. అలాంటిది భార్య మనసును గెలవడం కష్టమేమి కాదనే గొప్ప సందేశాన్ని అందించాం. పెళ్లి, వైవాహిక జీవితం విషయంలో భారత్, అమెరికా సంస్కృతుల మధ్య వుండే తేడాల్ని మానవీయ కోణంలో ఆవిష్కరించాం. భారతీయ వివాహ వ్యవస్థ తాలూకు ఔన్నత్యాన్ని తెలియజెప్పాం. మనసారా నవ్వుకునే హాస్యంతో పాటు గుండెల్ని తడిమే ఉద్వేగాల కలబోతగా '2 కంట్రీస్' ప్రేక్షకులందరికి మరచిపోలేని అనుభూతినిస్తున్నది.

దర్శకుడిగా సంతృప్తినిచ్చింది

సుదీర్ఘ విరామం తర్వాత చక్కటి ఇతివృత్తాన్ని ఎంచుకొని '2 కంట్రీస్' చిత్రాన్ని చేయడం నాకెంతో సంతృప్తినిచ్చింది. వినోదంతో పాటు ప్రేక్షకుల్లో ఆలోచనను రేకెత్తించే కథను జనరంజకంగా మలచడంలో దర్శకుడిగా సఫలీకృతుడినయ్యానని అనుకుంటున్నాను.



ఫస్ట్ ఇంపాక్ట్‌కు బెస్ట్ రెస్పాన్స్


లగడపాటి శ్రీధర్

'బన్నీ అంటే ప్రేక్షకుల్లో, అభిమానుల్లో ఎంత ప్రేమ వుందో 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' ఫస్ట్ ఇంపాక్ట్‌కు వచ్చిన స్పందన చూస్తుంటే అర్థమవుతున్నది. కేవలం విడుదల చేసిన 29 గంటల్లోనే టీజర్ కోటి వ్యూస్‌ను దాటింది. బన్నీపై అభిమానులకున్న ప్రేమకు అవధుల్లేవు' అన్నారు లగడపాటి శ్రీధర్. నాగబాబు సమర్పణలో ఆయన నిర్మిస్తున్న తాజా చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అను ఇమ్మాన్యుయేల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్ర ఫస్ట్ ఇంపాక్ట్ టీజర్‌ను ఇటీవల చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ 'అభిమానుల అంచనాలకు రెట్టింపు స్థాయిలో వుండే చిత్రమిది. బన్నీ కొత్త కథను ఎంచుకున్నారు. ఆయన ఓ పాన్ ఇండియన్ స్టార్. 'ఈ సినిమాతో మీకు మంచి పేరు రావాలని' బన్నీ రోజు చెబుతుండేవాడు. నా కంటే బన్నీకే ఈ సినిమాతో పేరు రావాలి. ఎందుకంటే చిత్రం కోసం ఆయన చాలా శ్రమించారు. మేకోవర్ దగ్గరి నుంచి చాలా విషయాల్లో శ్రద్ధతీసుకున్నారు. తెలుగు సినిమా ఖ్యాతిని 'బాహుబలి' ఓ స్థాయికి తీసుకువెళ్లింది. ఆ స్థాయిని పెంచి మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టే విధంగా ఈ సినిమా వుంటుంది. ఈ ఏడాది బన్నీ సంవత్సరంగా చెప్పుకునే స్థాయిలో ఈ సినిమా వుంటుందని మాటిస్తున్నాను. దర్శకుడు వక్కంతం వంశీ అద్భుతమైన కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అల్లు అర్జున్‌పై చిత్రీకరించిన యాక్షన్ దృశ్యాలు హైలైట్‌గా నిలుస్తాయి. ఇంపాక్ట్ అనే ఆలోచన దర్శకుడు వక్కంతం వంశీదే. ఇప్పటి వరకు 70 శాతం చిత్రీకరణ పూర్తయింది. మరో 40 రోజుల్లో చిత్రాన్ని పూర్తి చేసి ఏప్రిల్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు.

సమంత సూపర్‌డీలక్స్

పెళ్లి తర్వాత సినిమాల ఎంపికలో తన ప్రాధామ్యాలను మార్చుకున్నది సమంత. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటున్న ఆమె అభినయానికి ప్రాధాన్యత కలిగిన నవ్య కథాంశాలవైపు మొగ్గుచూపుతున్నది. తాజాగా 'సూపర్ డీలక్స్' అనే తమిళ సినిమాలో ప్రతినాయిక ఛాయలున్న పాత్రలో కనిపించబోతున్నట్లు తెలిసింది. సమంతతో పాటు విజయ్ సేతుపతి, ఫహద్‌ఫాజిల్ ఈ సినిమాలో ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. త్యాగరాజన్ కుమారరాజ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విభిన్న కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో విజయ్‌సేతుపతి ట్రాన్స్‌జెండర్ పాత్రలో కనిపించబోతున్నారు. సమంత పాత్ర తీరుతెన్నులను వెల్లడించకుండా ఇన్నాళ్లు గోప్యంగా ఉంచిన చిత్ర వర్గాలు ఇటీవల ఓ టీజర్‌ను విడుదలచేశారు. అందులో కత్తిచేతపట్టి ఓ వ్యక్తి తలపై వేటు వేయబోతున్నట్లు సమంత కనిపిస్తుండటం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఇందులో సమంత డీ గ్లామర్ లుక్‌తో కనిపిస్తుందని, నెగెటివ్ షేడ్స్‌తో ఆమె పాత్ర సాగుతుందని సమచారం. 'సూపర్‌డీలక్స్' ఆమె కెరీర్‌లో వైవిధ్యమైన సినిమాగా నిలుస్తుందని తమిళ వర్గాలు చెబుతున్నాయి.

కాజల్ సాహసం..!

తెలుగు, తమిళ భాషల్లో గ్లామర్ తారగా తన కంటూ మంచి క్రేజ్‌ను సొంతం చేసుకుంది కాజల్ అగర్వాల్. ఆమె తాజాగా ఓ సాహసానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. గ్లామర్ కథానాయికలు క్రేజ్‌లో వుండగా ప్రయోగాల పేరుతో సాహసాలు చేయడానికి ఇష్టపడరు కానీ కాజల్ మాత్రం అందుకు భిన్నంగా అడుగులు వేస్తున్నది. తేజ దర్శకత్వంలో వెంకటేష్ హీరోగా తెరకెక్కించనున్న తాజా చిత్రంలో ఇద్దరు పిల్లలకు తల్లిగా నటించడానికి కాజల్ అంగీకరించినట్లు చిత్ర వర్గాల సమాచారం. హీరో వెంకటేష్‌తో సమాన ప్రాధాన్యత వున్న పాత్ర కావడం, నటనకు ఆస్కారం వుండటం వల్లే కాజల్ తల్లి పాత్ర అయినా ఈ చిత్రంలో నటించడానికి సిద్ధపడినట్లు తెలిసింది. ఈ సినిమాతో కాజల్ అగర్వాల్ 50 చిత్రాల మైలు రాయిని దాటనుంది. కాగా ఈ చిత్రానికి 'ఆట నాదే వేట నాదే' అనే టైటిల్‌ని చిత్ర వర్గాలు పరిశీలిస్తున్నాయి.



ఆ దొంగలు మాలోనే వున్నారు!

'పరిశ్రమకు ఎప్పుడూ కొత్త నీరు రావాలి. కొత్త నిర్మాతలు, పంపిణీదారులు వస్తేనే పచ్చగా వుంటుంది. వాళ్లే లేకపోతే పరిశ్రమను మూసేయాల్సిందే. అగ్ర హీరోల వల్ల ఇండస్ట్రీ నిలబడదు. వర్కర్లకు, థియేటర్లకు పని దొరకాలంటే చిన్న చిత్రాలే శరణ్యం. కానీ చిన్న నిర్మాతల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది' అన్నారు సి.కల్యాణ్. ఆయన నిర్మిస్తున్న తాజా చిత్రం 'జై సింహా'. బాలకృష్ణ కథానాయకుడు. కె.ఎస్.రవికుమార్ దర్శకుడు. ఈ నెల 12న విడుదల కానుంది. గురువారం హైదరాబాద్‌లో సి.కల్యాణ్ పాత్రికేయులతో ముచ్చటించారు.

బాలకృష్ణతో సినిమా చేయాలని చాలా కాలంగా ఎదురు చూసున్నాను. ముందు అనుకున్న కథను పక్కనపెట్టి రత్నం అందించిన కథ నచ్చి 'జై సింహా' సినిమా చేశాం. నయనతార, ప్రకాష్‌రాజ్ నటిస్తే ఈ సినిమా చేయాలి లేదంటే చేయకూడదు అనుకున్నాం. ప్రకాష్‌రాజ్ డేట్స్ లేకపోయినా కథ చెప్పగానే సర్దుబాటు చేసుకుని నటించారు. కథానాయిక పాత్ర కోసం నయనతార, అనుష్కలను సంప్రదించాం. 'భాగమతి' కారణంగా అనుష్క డేట్స్ కుదరలేదు. దాంతో నయనతారతో పాటు హరిప్రియ, నటాషా జోషీలు హీరోయిన్‌లుగా నటించారు. సెంటిమెంట్ ప్రకారం బాలకృష్ణ సినిమాకు ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ సెట్టయితే ఆ సినిమా హిట్టే. ఈ చిత్రానికి అలాంటి ఫ్లాష్‌బ్యాక్ కుదిరింది. క్లైమాక్స్‌లో వచ్చే సన్నివేశాలకు ప్రతీ ఒక్కరు లేచి చప్పట్లు కొడతారు. బాలకృష్ణ కెరీర్‌లో వచ్చిన సమరసింహారెడ్డి, నరసింహనాయుడు చిత్రాల సరసన నిలిచే సినిమా ఇది.

వరుస చిత్రాలతో బిజీ..

వరుస చిత్రాలతో బిజీగా వున్నాను. వి.వి.వినాయక్ దర్శకత్వంలో సాయిధరమ్‌తేజ్‌తో నిర్మిస్తున్న చిత్రానికి 'ఇంటెలిజెంట్' అనే టైటిల్‌ను ఖరారు చేశాం. క్లైమాక్స్‌తో పాటు రెండు పాటలు మినహా చిత్రీకరణ పూర్తయింది. ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. రానా హీరోగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న '1945' చిత్రీకరణ దశలో వుంది. రెజీనా కథానాయిక. తెలుగులో నేను నిర్మాతగా వ్యవహరిస్తున్నాను. హిందీ వెర్షన్‌కు రానా నిర్మాత. వీటితో పాటు సుందర్.సి రూపొందించనున్న 'సంఘమిత్ర' తెలుగు వెర్షన్‌కు నిర్మాతను నేనే. ఇందులో కథానాయికగా 'లోఫర్' ఫేమ్ దిషా పటానీని అనుకుంటున్నాం.


సి.కల్యాణ్

మార్చి 1న సినీపరిశ్రమ బంద్..

చిత్ర పరిశ్రమలో క్యూబ్, యుఎఫ్ఓ విధానంతో కొంత మంది చిన్న నిర్మాతల్ని దోచుకుంటున్నారు. అన్యాయంగా అధిక రేట్లు వసూలు చేస్తున్నారు. ఈ పరిస్థితికి కారణమైన దొంగలు మా చిత్రపరిశ్రమలోనే వున్నారు. వారంతా దిగిరావల్సిన సమయం ఆసన్నమైంది. క్యూబ్, యుఎఫ్ఓల వల్ల చిత్రపరిశ్రమకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలనే సదుద్దేశ్యంతో మార్చి 1న దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమ బంద్‌కు పిలుపునిస్తున్నాం. ఈ బంద్ సమయంలో ఎలాంటి షూటింగ్‌లు జరగవు.

నీతో ఏదో చెప్పాలనే వుంది!


యామిని, ఆర్.పి.పట్నాయక్, అనుదీప్

'ఓ సంఘటన కారణంగా 2004 నుంచి ఇతర చిత్రాలకు సంగీతం అందించనని ప్రకటించాను. అది విని నన్ను మందలించిన వ్యక్తి కోటి. గత కొంత కాలంగా నా సంగీతాన్ని నాతో పాటు నా అభిమానులు మిస్సవుతున్నారు. ఆ లోటును భర్తీ చేయాలనే ఉద్దేశ్యంతో 'నీతో ఏదో చెప్పాలనే వుంది' వీడియో ఆల్బమ్‌ను రూపొందించాను' అన్నారు ఆర్.పి.పట్నాయక్. ఆయన రూపొందించిన వీడియో ఆల్బమ్‌ని గురవారం హైదరాబాద్‌లో సంగీత దర్శకుడు కోటి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్.పి.పట్నాయక్ మాట్లాడుతూ 'ఇతర చిత్రాలకు సంగీతం అందించడం మానేసిన తరువాత నన్ను కలిసిన ఎంతో మంది మళ్లీ మీ తరహా సంగీతాన్ని వినిపించబోతున్నారు. ఎప్పుడు సంగీతం అందిస్తారని అడిగారు. ఈ ఏడాది నుంచి ఇతర చిత్రాలకు సంగీతం అందించడానికి నేను సిద్ధం. అయితే దర్శకుడిగా మారాను కాబట్టి నాకు అవకాశం ఇస్తే దర్శకుల పనిలో జోక్యం చేసుకుంటాననే ఆ అపోహ చాలా మంది దర్శకులలో వుంది. సినిమాకు దర్శకుడే పెద్ద. ఆ విషయాన్ని దృష్టిలోపెట్టుకుని నా పనిని మాత్రమే చేయడానికి ప్రాధాన్యతనిస్తాను' అన్నారు. ఈ కార్యక్రమంలో రఘు కుంచె, వేణు, రవివర్మ, జెమిని సురేష్, యామిని, అనుదీప్, మనీషా, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో సోయా మిల్ మేకర్ బిర్యానీ

- విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం పాలు
- కేంద్రం ప్రతిపాదనలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో సోయా మిల్‌మేకర్ బిర్యానీ లేదా పీస్ పలావ్, కిచిడీ, టమాట రైస్, పెసర పప్పు, దేశవాళీ చిక్కుడుకాయ కూర వంటి పదిరకాలతో వారంతో ఒక స్పెషల్ రైస్‌ను పెట్టాలని కేంద్ర, రాష్ట్రాల అధికారులతో ఏర్పాటైన జాయింట్ రివ్యూ మిషన్ (జేఆర్‌ఎం) ప్రతిపాదించింది. గత ఏడాది నవంబర్ 27 నుంచి డిసెంబర్ 4 వరకు తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్, వరంగల్ జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జేఆర్‌ఎం సభ్యులు పరిశీలించారు. అనంతరం కొన్ని ప్రతిపాదనలను చేశారు. పాఠశాలలు కొనసాగే ఆరురోజుల్లో మూడురోజులు కూరగాయలతోపాటు గుడ్డు అందజేయాల్సి ఉంటుంది. ఒకరోజు ఆకుకూరలతో తయారు చేసిన పప్పు, ఇంకోరోజు కూరగాయలతో సాంబర్, మరో రోజు స్పెషల్ రైస్ అందించాలని సిఫారసు చేశారు. జేఆర్‌ఎం చేసిన సిఫారసుల అమలు సాధ్యమైతే ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ, జిల్లా విద్యాధికారులను పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు విజ్ఞప్తి చేశారు. స్థానిక పరిస్థితులు, వంట కార్మికుల సామర్థ్యాలను బట్టి వారంలో ఒకరోజు విద్యార్థులకు స్పెషల్ రైస్‌ను అందించాలన్నారు. 25 లక్షల మంది విద్యార్థుల్లో 80 శాతానికి పైగా మధ్యాహ్న భోజనం తింటున్నారని పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. రోజూ ఉదయాన్నే స్కూల్‌కు వస్తున్న విద్యార్థులకు 250 మిల్లీలీటర్ల పాలను ఇవ్వాలన్న ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదని పేర్కొన్నారు.

చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుచేయండి

కేంద్రమంత్రికి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్ గురువారం ఢిల్లీలో ఇద్దరు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇన్‌లాండ్ ఫిష్ ఫార్మింగ్ కోసం ప్రత్యేక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని కేంద్ర వ్యవసాయశాఖ సహాయమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో మత్స్య, గొర్ల సంపదను పెంచడానికి సీఎం కేసీఆర్ చేస్తున్న కృషిని కేంద్రమంత్రికి వివరించారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతం, కులవృత్తులను కాపాడటమే ధ్యేయంగా ఆయన పనిచేస్తున్నారని చెప్పారు. ఫిష్ ఫార్మ్‌కు అనువైన బ్రీడ్ తయారీకి ఒక కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై స్పందించిన షెకావత్.. త్వరలోనే అధికారులతో సమావేశమై తెలంగాణలో పరిశోధన కేంద్రం ఏర్పాటుకు సహకరిస్తామని హామీఇచ్చారు.

ప్లాస్టిక్ క్లస్టర్‌కు అనుమతివ్వాలని సురేశ్‌ప్రభుకు విజ్ఞప్తి

ఆలేరు ప్రాంతంలోని దాసరిపల్లిలో ప్రతిపాదించిన ప్లాస్టిక్ ఫర్నిచర్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌కు అనుమతులు ఇవ్వాలని ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కోరారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్‌ప్రభును కలిసి విన్నవించారు. మోడిఫైడ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అప్‌గ్రెడేషన్ స్కీం(ఎంఐఐయూఎస్) కింద ఈ క్లస్టర్‌ను ప్రతిపాదించామని, డీపీఆర్ సిద్ధమైనదని చెప్పారు. టీఎస్ఐఐసీ దీన్ని అమలుచేస్తున్నదని, భూమి కూడా సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. ఎంఐఐయూఎస్ మార్గదర్శకాలు సిద్ధం కాకపోవడంతో క్లస్టర్ అనుమతిలో జాప్యం జరుగుతున్నదని వివరించారు. దీనిపై స్పందించిన సురేశ్ ప్రభు వెంటనే ప్రతిపాదనలు పంపించాలని, మార్గదర్శకాలు సిద్ధంకాగానే అనుమతులిస్తామని హామీ ఇచ్చారు.



గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ బూర నర్సయ్య గౌడ్

మేడారాన్ని జాతీయ పండుగగా గుర్తించండి

- లోక్‌సభలో ఎంపీ సీతారాం నాయక్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం లోక్‌సభలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ.. 800 ఏండ్ల నుంచి ఈ జాతర ఉన్నా దేశవ్యాప్తంగా ప్రచారం జరుగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో మొదటి జాతరకు రూ.160 కోట్లు, ఈ నెలలో ప్రారంభమయ్యే జాతరకు ఇప్పటికే రూ.80కోట్లు కేటాయించారని తెలిపారు. ఆసియాలోనే అత్యధికంగా కోటిమంది వరకు హాజరయ్యే ఈ గిరిజన జాతరకు జాతీయహోదా కల్పించాలని కోరారు. మేడారం సమ్మక్క సారలమ్మ, సీఎం కేసీఆర్ దయతో ఎంపీగా ఎన్నికయ్యానని చెప్పారు. జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ, సాంస్కృతిక శాఖను కోరిందని గుర్తుచేశారు. ఈ జాతర తన నియోజకవర్గంలో ఉండటంతో ఎడ్ల బండ్లపై జాతరకు వెళ్లేవారమని సీతారాంనాయక్ గుర్తుచేసుకున్నారు.

ఇక 'బీ' క్యాటగిరీ ప్రక్షాళన

- సంక్రాంతి నుంచి కార్యక్రమం ప్రారంభం.. నెల రోజుల్లో పూర్తికి సన్నాహాలు
- ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ ఆదేశం
- దాదాపు అన్ని భూసమస్యలకు పరిష్కారం
- అసైన్డ్ భూములు, కోర్టు కేసులు కూడా క్లియర్..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూరికార్డుల ప్రక్షాళన మొదటి దశ పూర్తయింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు రాతపూర్వక రికార్డులను రూపొందిస్తున్నారు. కార్యాలయాల్లో ఈ పని పూర్తవడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉన్నది. 'ఏ' క్యాటగిరీ కింద ప్రక్షాళన పూర్తయిన భూముల రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వడానికి కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఇక 'బీ' క్యాటగిరీ కింద ఉన్న భూముల రికార్డులను కూడా చక్కదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'బీ' క్యాటగిరీ భూముల సమస్యలను క్రోడీకరించి, రైతులతో మాట్లాడి, సమస్య మూలాలను పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించింది. సంక్రాంతి పండుగ నుంచి ప్రత్యేకంగా ఈ కార్యక్రమం జరుగనున్నది. నెల రోజుల్లో 'బీ' క్యాటగిరీ ప్రక్షాళన పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ అధికారులను ఆదేశించారు. 'బీ' క్యాటగిరీ భూములు కేవలం 8 శాతమే ఉన్నట్లు 'ఏ' క్యాటగిరీ రికార్డుల ప్రక్షాళన వల్ల తేలింది. వీటిని కూడా సవరిస్తే దాదాపు అన్ని భూముల సమస్యలు, టైటిల్ డిస్ప్యూట్ ఉన్నవి మినహా మిగిలిన అన్ని కోర్టు కేసులు కూడా పరిష్కారమవుతాయని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వివాదాలున్న భూములు ఇక రెండు శాతం కంటే ఎక్కువ ఉండవని అంటున్నారు. ఇంకా మిగిలిన భూసమస్యల్లో ఎల్‌టీఆర్, అసైన్డ్‌భూముల క్రయవిక్రయాలు, రద్దు బదులు సమస్యలు, భాగపంచాయతీలు ఉన్నాయి. వీటిల్లో ఎల్‌టీఆర్, అసైన్డ్ భూములపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అసైన్డ్‌భూముల సమస్యను క్లియర్‌చేయాలని ప్రభుత్వం అధికారులకు స్పష్టం చేసింది. ఇలా అసైన్డ్‌భూములను వాటి కొనుగోలుదారులకు అసైన్ చేస్తే చాలావరకు సమస్య సమసిపోతుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం మూడవ పార్టీ చేతుల్లోకి వెళ్లిన అసైన్డ్ భూమి దాదాపు 2.30 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. ఇందులో చాలా భూములను కొనుగోలు చేసింది భూమి లేని పేదరైతులేనని రికార్డుల పరిశీలనలో తెలిసింది. చట్ట ప్రకారం ఈ రికార్డుల ప్రక్షాళన కూడా పూర్తయితే దాదాపు 60 శాతం అసైన్డ్ భూములు క్లియర్ అయ్యే అవకాశం ఉంటుంది. సాదాబైనామాలో వచ్చిన దరఖాస్తులు, పెండింగ్‌లో 2.30లక్షల ఎకరాలకుపైగా ఉన్నాయి. అటవీ, రెవెన్యూశాఖల మధ్య వివాదంలో చిక్కుబడిన భూములు 2.10 లక్షల ఎకరాలకు పైగా ఉన్నాయి. వీటిని కూడా ఈ సందర్భంగానే సాధ్యమైన మేరకు క్లియర్‌చేయాలని యోచిస్తున్నారు. వీటితోపాటు శివాయి జమేదార్ ప్రభుత్వభూములు 1.20 లక్షల ఎకరాల వరకు ఉన్నాయి.. వీటిపై కూడా ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. ఎలాంటి స్టే ఆర్డర్లు లేకుండా రికార్డులు పక్కాగా ఉన్న భూముల కేసులను సివిల్, రెవెన్యూ కోర్టుల్లో సులభంగా పరిష్కారమవుతాయని అధికారులు అంటున్నారు. దీంతోపాటు అన్నదమ్ముల గొడవలు, గట్టు తగాదాలు, పుట్ట తగాదాలతో కోర్టులకు వెళ్లిన వారితో కూడా అధికారులు మాట్లాడి, కోర్టుల్లో కేసులు విత్‌డ్రా చేయించి సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉంది. రాష్ట్రంలో ఇంకా కొన్ని ఇతర సమస్యల కింద దాదాపు 8 లక్షల ఎకరాల భూమి ఉంది. వీటిలో ఫౌతి, రద్దు బదలు, మౌజా తదితర సమస్యలున్నాయి. ఫౌతి కేసులకు సంబంధించి భాగస్థుల మధ్య పంచాయతీలు తెగకుండా ఉన్నవి మాత్రమే ఉన్నాయి. ప్రక్షాళన సందర్భంగా అధికారులు చొరవ చేసి వాటిని పరిష్కరించే అవకాశం ఉంది. అలాగే రద్దు బదలుకు చెందిన భూసమస్యలు ఎక్కువగానే ఉన్నాయని తెలిసింది. ఈ భూసమస్యల పరిష్కారానికి కూడా రెవెన్యూ అధికారులు కృషి చేస్తారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ పద్ధతిలో కన్సాలిడేషన్ ఆఫ్ రెవెన్యూ హోల్డింగ్ చట్టం-1956 కింద క్షేత్రస్థాయిలో ఏ భూమి ఎవరి అధీనంలో ఉన్నదనే విషయాన్ని అధికారులు, సర్వేయర్లు కలిసి పరిశీలిస్తారు.





హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డిని కలిసిన కార్మికుల కుటుంబ సభ్యులు

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

హోం, కార్మికశాఖల మంత్రి నాయిని నర్సింహారెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని రాష్ట్ర హోం, కార్మికశాఖల మంత్రి నాయిని నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. భవన, నిర్మాణ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని వివరించారు. సచివాలయంలో గురువారం కార్మికుల కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. పదిహేను మంది కార్మికులకు ప్రసూతి సహాయంగా రూ.4,10,000, సహజ మరణం పొందిన ఐదుగురు కార్మికుల కుటుంబాలకు రూ.3,70,000 అందజేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబసభ్యులకు రూ.25,10,000 అందజేశారు.



వ్యవసాయశాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పోచారం

వ్యవసాయశాఖకు పెరిగిన ప్రాధాన్యం

- మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్తు, రైతులకు ఎకరాకు ఏడాదికి ఎనిమిది వేల రూపాయల పెట్టుబడి, కోటి ఎకరాలకు సాగునీరు, నాణ్యమైన విత్తనాల సరఫరాతో రాష్ట్రంలో వ్యవసాయశాఖకు ప్రాధాన్యం పెరిగిందని వ్యవసాయ, సహకారశాఖల మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సచివాలయంలోని తన చాంబర్‌లో వ్యవసాయశాఖ- 2018 క్యాలెండర్, తెలంగాణ విత్తన ధ్రువీకరణ ఏజెన్సీ డైరీ, వ్యవసాయ విస్తరణ అధికారుల డైరీ, ఉద్యానవర్సిటీ క్యాలెండర్లను వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి సీ పార్థసారథి, కమిషనర్ డాక్టర్ జగన్‌మోహన్, ఉద్యానశాఖ డైరెక్టర్ ఎల్ వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర విత్తన ధ్రువీకరణ ఏజెన్సీ డైరెక్టర్ డాక్టర్ కే కేశవులతో కలిసి మంత్రి పోచారం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వ్యవసాయశాఖకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన చెప్పారు. ప్రతి సీజన్‌లో ఖర్చులుపోను రైతుకు ఎకరాకు రూ.50 వేలు మిగలాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఆశయమన్నారు.



మంత్రి మహేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టూవీలర్ మెకానిక్‌సంఘ సభ్యులు

టూవీలర్ మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తాం

- రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ద్విచక్ర వాహనాల మెకానిక్‌ల సమస్యలను పరిష్కరిస్తూ, అసంఘటిత కార్మికులుగా గుర్తించేందుకు కృషిచేస్తానని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం మంత్రి నివాసంలో తెలంగాణ టూవీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు తోడేటి రాజబాబు, ప్రధాన కార్యదర్శి మల్లేశం, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్‌తో కూడిన బృందం తమసమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మెకానిక్‌లను భవన నిర్మాణ కార్మికుల తరహాలో అసంఘటిత కార్మికులుగా గుర్తించడంతోపాటు ప్రభుత్వపరంగా భద్రత, సదుపాయాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. రాష్ట్రంలో 3 లక్షల మంది ద్విచక్ర వాహనాల మెకానిక్‌లు ఉన్నారని, వీరిని గతంలో ఉన్న ప్రభుత్వాలు గుర్తించలేదని ఆయన చెప్పారు. టూవీలర్ మెకానిక్‌లకు స్వయం ఉపాధి పథకం కింద రుణాలు, డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో ప్రాధాన్యం ఇచ్చేలా పాటుపడుతామని చెప్పారు.

ఎంసెట్-2 కేసులో వారంలో చార్జిషీట్!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెడికల్ ఎంట్రన్స్ 2016(ఎంసెట్-2) పరీక్ష పత్రాల లీకేజీ స్కాం కేసులో దర్యాప్తు పూర్తిచేసిన సీఐడీ అధికారులు వారం రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేయనున్నట్టు తెలిసింది. సాక్షుల జాబితాలో మరి కొన్ని కొత్తపేర్లు చేర్చినట్టు సమాచారం. ఇప్పటివరకు 72 మందిపై కేసులు నమోదు చేసిన సీఐడీ ప్రధాన నిందితులతో సహా 60 మందిని అరెస్టు చేసింది. వందమందికి పైగా సాక్షుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసింది. కేసును దర్యాప్తు చేస్తున్న ఎస్పీ రెండునెలల క్రితం బదిలీ కావడంతో మరో అధికారికి బాధ్యతలు అప్పగించారు. అదనపు డీజీ(సీఐడీ) ఆదేశాలతో జేఎన్‌టీయూ, ప్రింటింగ్ ప్రెస్‌లకు నోటీసులు జారీచేసి, వారినుంచి సమాధానం తెప్పించుకున్నారు. వీరి పాత్రను కూడా చార్జిషీట్‌లో పొందుపరచనున్నారని సమాచారం.

పరారీలోనే పార్వతి..

ఖైరతాబాద్, నమస్తే తెలంగాణ: గజల్ శ్రీనివాస్ మహిళలపై వేధింపుల కేసులో నిందితురాలిగా ఉన్న పార్వతి ఆచూకీ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. 'గజల్' బాధితురాలు విడుదల చేసిన వీడియోలలో పార్వతి కూడా ఉండడంతో పోలీసులు ఆమెను ఈ కేసులో ఏ2 నిందితురాలిగా చేర్చారు. ఆమె పోలీసులకు చిక్కితే శ్రీనివాస్‌కు సంబంధించి మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే, ఆమె చింతల్‌బస్తీలో తలదాచుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇదిలాఉండగా, గజల్ శ్రీనివాస్ కస్టడీ కోరుతూ పంజాగుట్ట పోలీసులు వేసిన పిటిషన్‌ను నాల్గవ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ గురువారం కొట్టివేశారు. అయితే దీనిపై పోలీసులు శుక్రవారం మరోసారి పిటిషన్ వేయనున్నట్టు తెలిసింది.

ఈ జ్యోతి.. మరో 'స్వాతి'!

- నిద్రమాత్రలిచ్చి.. తలపై రాడ్‌తో మోది.. దిండుతో నులిమి భర్తను చంపిన భార్య
- ప్రియుడితో కలిసి ఘాతుకం
- చౌటుప్పల్‌కు మృతదేహం తరలింపు
- అంత్యక్రియలు పూర్తయ్యాక పోస్టుమార్టం క్లూతో కేసు ఛేదన
- నాగర్‌కర్నూల్ స్వాతి తరహాలో ప్లాన్

హైదరాబాద్ సిటీబ్యూరో/తార్నాక, నమస్తే తెలంగాణ: ప్రియుడిమీద వ్యామోహంతో భర్తను నిద్రలోనే మట్టుపెట్టిందో భార్య. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని నిర్మానుష్య ప్రదేశంలో పడవేసి ఏమీ తెలియనట్టు నాటకమాడింది. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తీగలాగితే హత్యోదంతం తెలిసింది. ఇటీవల నాగర్‌కర్నూల్‌లో భర్తను ప్రియుడితో కలిసి మట్టుబెట్టిన స్వాతి తరహాలోనే ఈ ఘటన జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులకు చెందిన కార్పెంటర్ నాగరాజు భార్య జ్యోతితో వలసవచ్చి హైదరాబాద్‌లోని కర్మాన్‌ఘాట్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఐదేండ్ల క్రితం వివాహమైన వీరికి పాప(4), బాబు(1) ఉన్నారు. నాచారంలోని మేనమామ ఇంటికి వచ్చివెళ్తున్న క్రమంలో జ్యోతికి పెండ్లికి ముందే స్థానికంగా ఉంటున్న కార్తీక్‌తో సంబంధం ఏర్పడింది. పెండ్లి తర్వాత కొద్దిరోజులు దూరంగా ఉన్నవారు మళ్లీ కలిశారు. నాగరాజుతో అయిష్టంగా ఉంటున్నానని కార్తీక్‌తో చెప్పిన జ్యోతి, భర్త అడ్డు తొలగించుకుందామని పథకం వేసింది.

ఇంట్లోనే స్పాట్: డిసెంబర్ 30న రాత్రి భోజనంలో జ్యోతి నిద్రమాత్రలు కలిపి నాగారాజుకు వడ్డించింది. అది తిన్న అతడు నిద్రలోకి జారుకోగానే కార్తీక్‌కు ఫోన్‌చేసి రప్పించింది. వారిద్దరూ నాగరాజు తలపై రాడ్‌తో కొట్టి.. అనంతరం దిండుతో ఊపిరాడకుండా చేసి హత్యచేశారు. కార్తీక్ తన స్నేహితులు దీపక్, యాసిన్, నరేశ్ సహాయంతో మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి నల్లగొండ జిల్లా అంకిరెడ్డిగూడెం జిల్లేడు చెల్క ప్రాంతంలోని నిర్మానుష్య ప్రదేశంలో పడేశారు. డిసెంబర్ 31న స్థానికుల సమాచారంతో నాగరాజు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న చౌటుప్పల్ పోలీసులు అతడి జేబులో ఉన్న చీటి ఆధారంగా భార్య జ్యోతికి సమాచారమిచ్చారు. అక్కడకు వెళ్లిన ఆమె ఏమీ తెలియనట్టు మృతదేహం తన భర్తదేనని, రెండురోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లాడని పోలీసులకు వివరించింది. పోస్టుమార్టం అనంతరం పోలీసులు మృతదేహాన్ని బంధువులకు అప్పగించడంతో వారు అంత్యక్రియలు పూర్తిచేశారు.



నాగరాజు మృతదేహం (ఫైల్)

పట్టించిన పోస్టుమార్టం నివేదిక..

నాగరాజు చనిపోవడానికి అతడి తలపై గాయం కావడం ఒక కారణమని పోస్టుమార్టం నివేదికలో పేర్కొనడం పోలీసులలో అనుమానం రేకెత్తించింది. వెంటనే చౌటుప్పల్ పోలీసులు నాగరాజు ఫోన్ నంబర్‌ను విశ్లేషించగా, అతడి ఫోన్ ఇంట్లోనే స్విచ్ఛాఫ్ అయినట్టు గుర్తించారు. దీంతో అనుమానం బలపడిన పోలీసులు భార్య జ్యోతి నంబర్‌పై ఆరాతీయగా నాగరాజు ఫోన్ ఆఫ్ అయిన సమయంలోనే గుర్తుతెలియని నంబర్ నుంచి ఆమెకు ఫోన్ వచ్చినట్టు తేలింది. అదే నంబర్ మృతదేహం పడిఉన్న ప్రదేశంలోనూ లొకేట్ కావడంతో ఒక నిర్ధారణకు వచ్చి జ్యోతి, కార్తీక్‌లను పిలిపించి విచారించారు. దీంతో వారు హత్యవిషయాన్ని బయటపెట్టారు. ఈ కేసులో వారిద్దరితోపాటు, యాసిన్, దీపక్, నరేశ్‌ల పాత్ర ఉందని నిర్ధారించారు.

నరేశ్ ఆత్మహత్యాయత్నం డ్రామా..!

ఇదిలాఉండగా జ్యోతి, కార్తీక్, యాసిన్, దీపక్‌ల అరెస్టు విషయం తెలుసుకున్న హైదరాబాద్ లాలాపేట్‌కు చెందిన నరేశ్‌లో భయం మొదలైంది. పోలీసులకు ఎలాగైనా దొరికిపోతాననే భయంతో అతడు గురువారం ఉదయం డయల్ 100కు ఫోన్‌చేసి తాను ఓ కీలక సమాచారం ఇవ్వాలనుకుంటున్నానని చెప్పాడు. అనంతరం ఇంటివద్ద బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. అతనిని గాంధీ దవాఖానకు తరలించిన పోలీసులు ఆత్మహత్యాయత్నానికి కారణాలపై ఆరా తీశారు. చికిత్స పొందుతున్న నరేశ్‌ను విచారించగా నాగరాజు హత్య గురించి తెలిపాడు.

సాహిత్యకారునిపై దాడి తగదు

- ఇరు రాష్ట్రాలవారు స్నేహభావంతో మెలుగాలి
- సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి



హైదరాబాద్/ ఖైరతాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణకు చెందిన సాహిత్యకారుడు స్కైబాబాపై దాడి చేయడం తగదని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఏపీలోని విజయవాడలో నిర్వహించిన బుక్‌ఫెయిర్‌లో సాహిత్యపరంగా అభ్యంతరకర కవిత రాశారనే ఉద్దేశంతో స్కైబాబాపై దాడి చేశారని, అక్కడి పోలీసు అధికారులతో మాట్లాడి ఆయనకు రక్షణ కల్పించినట్టు తెలిపారు. రచయితలకు భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుందన్న విషయాన్ని దాడికి పాల్పడిన వారు గుర్తించాలన్నారు. స్త్రీలను కించపరిచే విధంగా ఉన్న స్కైబాబా కవిత్వాన్ని అప్పట్లోనే విమర్శించామని సిధారెడ్డి గుర్తుచేశారు. స్కైబాబా తీవ్రస్వరంతో రాశారని, అప్పటి ఘటనను దృష్టిలో ఉంచుకొని దాడిచేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. సాహిత్యపరంగా ఆయన భావాలు నచ్చకుంటే సాహిత్యపరంగానే దాడి చేయాలని, భౌతిక దాడులకు పాల్పడటం మంచిది కాదని తెలిపారు. తెలుగు ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాన్ని పెంచేవిధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించిందన్నారు. ఇందులో ఏపీకి చెందిన సాహితీవేత్తలను గౌరవించి సత్కరించామన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తెలంగాణ సాహిత్యకారుడిపై దాడి తగదని పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే ఈ ఘటన జరిగినట్టు భావిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏపీ పోలీసు అధికారులతో మాట్లాడి ఆయనకు రక్షణ కల్పించేలా చూసిందని వెల్లడించారు. కాగా స్కైబాబాపై దాడిని సింగిడి తెలంగాణ రచయితల సంఘం గురువారం ఖండించింది. ఈ దాడిని ప్రజాస్వామికవాదులందరూ ఖండించాలని ఆ సంఘం అధ్యక్షుడు సంగిశెట్టి శ్రీనివాస్ కోరారు.

ఫీజులు పెంచొద్దు

మొదటిపేజీ తరువాయి...

రాష్ట్రంలోని సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ, కేంబ్రిడ్జ్ పాఠశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీచేశామని, దీంతో ప్రతి పాఠశాల యాజమాన్యం ఫీజుల వివరాలను తమ స్కూల్ నోటీసుబోర్డు, వెబ్‌సైట్‌లో వెల్లడించాలని ఆయన స్పష్టంచేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా పాత ఫీజులనే కొనసాగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తల్లితండ్రులకు, విద్యార్థులకు కొంత ఉపశమనం కలిగిస్తుందని హైదరాబాద్ స్కూల్ స్టూడెంట్స్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు సంతోషం వ్యక్తంచేశారు. విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో తాము జరిపిన చర్చలు విజయవంతం అయ్యాయని పేర్కొన్నారు. ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ సిఫారసుల ప్రకారం ఫీజులు పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రైవేటు స్కూల్ యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి కోరారు. అవసరమైతే పెంచిన ఫీజులకు లెక్కలు చూపించటానికి స్కూల్ యాజమాన్యాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది జీతాలు, ఇతర బిల్లుల చెల్లింపు భారంగా మారుతున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని స్కూల్ ఫీజులను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. లాభాలు లేకుండా ఫీజులను నిర్ణయించటం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

కామారెడ్డి జిల్లాలో వీఆర్‌ఏ హత్య

మొదటిపేజీ తరువాయి...

వ్యాపారులు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. బుధవారం అర్ధరాత్రి ఏపీ 25 ఏఎల్ 7645 నంబరు గల ట్రాక్టర్ వేసుకొని అంబయ్య అనే డ్రైవర్ కాకివాగు దగ్గరకు వెళ్లారు. కారేగావ్- కంభాపూర్ గ్రామాల మధ్య ఉన్న ఒక రేవు నుంచి ఇసుక తరలిస్తుండగా కారేగావ్‌కు చెందిన మార్దండ గ్రామ వీఆర్‌ఏ బోయిని సాయిలు (36) అడ్డుకోవటానికి ప్రయత్నించారు. ఆ సమయంలో అంబయ్యకు, సాయిలుకు మధ్య ఘర్షణ జరిగింది. సాయిలు అడ్డుగా ఉన్నప్పటికీ.. డ్రైవర్ అంబయ్య ఆవేశంతో ట్రాక్టర్‌ను నడిపించగా, సాయిలు ట్రాక్టర్ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. సాయిలు భార్య సాయవ్వ ఫిర్యాదుమేరకు పిట్లం పోలీసులు కేసు నమోదుచేశారు. డ్రైవర్ అంబయ్యతోపాటు ట్రాక్టర్ యజమాని దుర్గపైనా కేసు నమోదుచేశారు. సాయిలు మృతి స్థానికంగా కలకలం రేపింది. గ్రామస్థులంతా సంఘటనా స్థలానికి చేరుకొని, సాయిలు మృతికి కారకులైనవారిని శిక్షించాలని ఆందోళన చేపట్టారు. అదే సమయంలో ఇసుక రవాణాతో సంబంధం ఉన్న ఒక వ్యాపారి కనిపించటంతో అతనిపై దాడి చేశారు. పోలీసులు రంగప్రవేశంచేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మృతుడు సాయిలుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. నిందితులను అదుపులోకి తీసుకొని పోలీసులు కేసు విచారిస్తున్నారు. మార్దండలో వీఆర్‌ఏగా విధులు నిర్వర్తిస్తున్న సాయిలు.. తన స్వగ్రామమైన కారేగావ్ శివారులో ఇసుక తరలింపును అడ్డుకోవటానికి వెళ్లడంపైన కూడా పోలీసులు విచారణ చేపట్టారు.

మలక్‌పేటలో తొలి సెన్సార్ పార్కు

- దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం
- వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి
- ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ/మలక్‌పేట: హైదరాబాద్ మలక్‌పేటలోని వికలాంగుల జాతీయ ఉద్యానవనం.. దివ్యాంగుల కోసం సకల సౌకర్యాలతో నిర్మించిన దేశంలోనే మొట్టమొదటి సెన్సార్ పార్కు అని, జీహెచ్‌ఎంసీ నిధులతో దీన్ని చేపట్టారని వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి చెప్పారు. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని, వారికి ప్రాధాన్యమిస్తూ.. సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలుచేస్తున్నారని పేర్కొన్నారు. గురువారం లూయిస్ బ్రెయిలీ 209వ జయంతి వేడుకలను హైదరాబాద్‌లోని దివ్యాంగుల సంక్షేమభవన్‌లో ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులు కోరినట్టు వికలాంగుల జాతీయ ఉద్యానవనంలో హెలెన్ కెలర్, లూయిస్ బ్రెయిలీ విగ్రహాలను జీహెచ్‌ఎంసీ నిధులతో ఏర్పాటుచేసుకుందామని ఆయన చెప్పారు. దివ్యాంగులను పెండ్లి చేసుకున్న వారికిచ్చే ప్రోత్సాహక నిధులను ఇటీవలే ప్రభుత్వం రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచిందని గుర్తుచేశారు. తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ ద్వారా అంధుల పాఠశాలలకు ఉచితంగా బ్రెయిలీ లిపిలో పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో లాప్‌టాప్‌లు అందిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందించిన అంధులను సన్మానించారు. 'వికలాంగుల పిలుపు మాసపత్రిక' 2018 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యదర్శి ఎం జగదీశ్, డైరెక్టర్ బీ శైలజ, వేడుకల నిర్వహణ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్, పీ నర్సింగ్‌రావు, ఏడీలు మల్లారెడ్డి, సుదర్శన్, నళిని, ఫెడ్ చైర్మన్ గంగారాం, రేడియో జాకీ వెంకటేశ్, దివ్యాంగుల సంక్షేమ సంఘాల నాయకులు దయానంద్, గోపాల్, ముక్తాధర్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి

24 గంటల విద్యుత్‌పై రాష్ట్రాల ఆరా

మొదటిపేజీ తరువాయి...

వెళ్ళిన ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావుకు బుధవారంనాడు ఇదే అనుభవం ఎదురయ్యింది. అసలు మీకెలా సాధ్యమయ్యిందంటూ వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ప్రశ్నల వర్షం కురిపించారు. తొలుత ఆశ్చర్యం వ్యక్తంచేసిన రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ ప్రతినిధులు వివరాలు అడిగి తెలుసుకొన్నారు. రాష్ట్రం ఏర్పడిన ఇంత తక్కువకాలంలో మీకెలా సాధ్యమయ్యిందంటూ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ప్రతినిధి వర్మ ప్రశ్నించారు. సీబీఐపీ సభ్యుడు వాహి కూడా ఆశ్చర్యం వ్యక్తంచేస్తూ.. ఏమేం చర్యలు తీసుకున్నారంటూ అడిగారు. గుజరాత్‌కు చెందిన ఆనంద్‌జోషి (డిస్ట్రిబ్యూషన్ కంపెనీ మాజీ డైరెక్టర్) కూడా సీఎండీతో తన అభిప్రాయాన్ని పంచుకొన్నారు. ఇలా అన్ని వైపుల నుంచి వచ్చిన ప్రశ్నల పరంపరకు.. సీఎండీ నవ్వుతూ సమాధానమిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ప్రాధాన్యతాంశంగా విద్యుత్తుపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపించారని, ఆయన తీసుకొన్న నిర్ణయాలు, చేసిన మార్గదర్శకత్వంతోపాటు శాఖాపరంగా తీసుకొన్న చర్యల గురించి వారికి వివరించారు. విద్యుత్తుశాఖ ఉద్యోగుల్లోనూ సమిష్టిగా కష్టించి సాధించాలనే పట్టుదల వచ్చిందని, పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్ఠం చేశామని సీఎండీ ప్రభాకర్‌రావు వివరించారు. తరచుగా సీఎం కేసీఆర్ విద్యుత్తు పరిస్థితిని సమీక్షించి, లోటుపాట్లను సవరించేలా చర్యలు తీసుకుంటూ.. వెన్నుతట్టి ప్రోత్సహించటంతోనే.. ఇది సాధ్యమయ్యిందని, 24 గంటల విద్యుత్తుతో తెలంగాణ పేరు దేశం నలుమూలలా మార్మోగుతున్నదని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు 'నమస్తే తెలంగాణ'తో తన సంతోషాన్ని పంచుకొన్నారు.

మరమగ్గాలకు జియోట్యాగింగ్

రాష్ట్రవ్యాప్తంగా 35వేల మగ్గాలకు పూర్తి కావొచ్చిన ప్రక్రియ

సిరిసిల్లలోనే 25 వేల మగ్గాలు ● అవకతవకలకు అవకాశమివ్వని చేనేత, జౌళి శాఖ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, వాస్తవ పరిస్థితులు తెలుసుకొనేందుకు ఉద్దేశించిన మరమగ్గాల జియో ట్యాగింగ్ సర్వే పూర్తి కావొచ్చింది. రాష్ట్రంలో చేనేత మగ్గాల జియో ట్యాగింగ్ ఇప్పటికే పూర్తయింది. ఇప్పుడు మర మగ్గాల జియో ట్యాగింగ్‌ను, కార్మిక డాటా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ద్వారా చేయిస్తున్నారు. మర మగ్గాలు అత్యధికంగా ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లాలో జియోట్యాగింగ్ పూర్తికాగా ఇతర ప్రాంతాల్లో చురుగ్గా సాగుతున్నది. ఇతర ప్రాంతాల్లోనూ త్వరలోనే పూర్తవుతుందని అధికార వర్గాలు చెప్పాయి. రాష్ట్రమంతటా 35వేల వరకు మరమగ్గాలు ఉంటాయని అంచనా వేశారు. సిరిసిల్ల పరిసర ప్రాంతాల్లో 24,749 మరమగ్గాలు ఉన్నట్టు గుర్తించారు. అలేరు, భువనగిరి, జనగాం, వరంగల్ ప్రాంతాల్లోనూ మర మగ్గాలు ఉన్నాయి. పూర్తయిన జియోట్యాగింగ్ జాబితాను ఆయా గ్రామాలు, సొసైటీల వద్ద ఉంచి.. అందులో పేర్లు నమోదు చేసుకోలేకపోయిన వారు వెంటనే టెక్స్‌టైల్‌శాఖ అధికారులను సంప్రదించాలని సూచిస్తున్నారు. సర్వే పూర్తయిన తర్వాత అభ్యంతరాలకు వారం గడువు ఇస్తారు. సర్వేతోపాటు జియో ట్యాగింగ్‌లో ఆసాములు, కార్మికుల సమగ్ర వివరాలను సేకరించారు. కార్మికుడి సమగ్ర సమాచారం ఆధార్‌కార్డు నంబర్, బ్యాంకు ఖాతా సంఖ్య, ఇతర వివరాలను సేకరించారు. కార్మికుడికి ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ధిని నేరుగా బ్యాంకులో వేయొచ్చు. పవర్‌లూంపై ఆధారపడి పనిచేసే కార్మికుడు, ఆయన కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. దీంతో రాష్ట్రంలోని చేనేత కుటుంబాల సమాచారంపై ఒక స్పష్టత వస్తుంది. ఒకసారి జియో ట్యాగింగ్ పూర్తయ్యాక ఏడాదిపాటు ఆ డేటాను ఫ్రీజ్ చేయాలని టెక్స్‌టైల్ శాఖ అధికారులు యోచిస్తున్నారు. కార్మికులందరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరమగ్గం కార్మికులకు చేతి నిండా పనికల్పించేందుకు చర్యలు తీసుకొంటున్నది. నెలకు రూ.18వేల వరకు లభించేలా చూడాలని సీఎం కేసీఆర్ అసాములకు సూచించారు. ప్రభుత్వశాఖలకు అవసరమైన వస్త్రాలను మరమగ్గ కార్మికులతో తయారు చేయించాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. సర్వే పూర్తయితే వారి ఉత్పత్తి సామర్థ్యం తెలుస్తుంది. దీనికి అనుగుణంగా చేనేత అభివృద్ధికి ప్రణాళిక రచిస్తారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో సర్వే పూర్తి అయిన మరమగ్గాల వివరాలు

ప్రాంతం	యూనిట్లు	మరమగ్గాల సంఖ్య
సిరిసిల్ల పట్టణం	1538	18,805
తంగళ్లపల్లి	158	1,913
చంద్రంపేట	112	1,887
టెక్స్‌టైల్ పార్క్	89	1474
రాజీవ్‌నగర్(ముష్టిపల్లి)	62	449
బోయినపల్లి	46	133
నిమ్మపల్లి	1	50
తాడిగొండ	7	26
బుగ్గపల్లి	4	12
మొత్తం	2017	24,749



గురువారం సచివాలయంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి

విత్తనోత్పత్తికి సరైన దిశ

● కేంద్ర విత్తనపథకం మార్గదర్శకాలపై ఉన్నతస్థాయి సమావేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రామ విత్తనోత్పత్తి పథకాన్ని రైతులకు లబ్ధి చేకూర్చేవిధంగా అమలు చేయడానికి అవసరమైన విధివిధానాలను రూపొందించాలని గురువారం సచివాలయంలో వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశం నిర్ణయించింది. ఈ పథకం ద్వారా పండించిన విత్తనాన్ని రైతుల నుంచి నేరుగా హాకా, తెలంగాణ సీడ్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, నేషనల్ సీడ్ కార్పొరేషన్ సంస్థల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఆ విత్తనాలను తిరిగి పంటకాలాల్లో రైతులకు వ్యవసాయశాఖ ద్వారా సరఫరా చేసేలా విధి విధానాలను రూపొందించాలని వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి సూచించారు. సమావేశంలో వ్యవసాయ కమిషనర్, తెలంగాణ స్టేట్ సీడ్స్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ ఎం జగన్మోహన్, నేషనల్ సీడ్ కార్పొరేషన్ ప్రాంతీయ మేనేజర్ సుధాకర్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ నగేశ్, ఏడీఏ, ఎస్వీపీ పుణ్యవతి పాల్గొన్నారు.

విత్తన ధ్రువీకరణలో తెలంగాణ ముందంజ

● రాష్ట్రసంస్థకు మరో ఐదు రాష్ట్రాల బాధ్యత అప్పగింత

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణలో తెలంగాణ రాష్ట్రం మరో ముందడుగు వేసింది. ప్రస్తుతం రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ సంస్థ ద్వారా ధ్రువీకరించిన విత్తనాలను ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. 2016లో కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణ బాధ్యతను భారత ప్రభుత్వం రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థకు అప్పగించింది. తర్వాత కొద్ది కాలంలో దేశంలో మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రం నుంచి 17 వేల క్వింటాళ్ల జొన్న, వరి, మక్కజొన్న విత్తనాలను సూడాన్, ఈజిప్టు, ఫిలిప్పీన్స్ దేశాలకు ఎగుమతి చేసింది. అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణలో సాధించిన పురోగతిని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థకు అదనంగా కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్ రాష్ట్రాల బాధ్యతలను అప్పగించారు. 9 రాష్ట్రాలకు సంబంధించిన అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణ అధికారాలను రాష్ట్రానికి అప్పగించినట్టు వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి తెలిపారు. తమపై నమ్మకం ఉంచి మరో ఐదు రాష్ట్రాల బాధ్యతను అప్పగించడం సంతోషంగా ఉందని తెలంగాణ విత్తన ధ్రువీకరణ అథారిటీ డైరెక్టర్ కే కేశవులు తెలిపారు.

ప్రతినెలా 15 లోపు రేషన్ సరుకులు

సాంకేతిక పరిజ్ఞానంతో పంపిణీ: సీవీ ఆనంద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్త ఏడాది నుంచి రేషన్ సరుకుల పంపిణీలో కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రతినెలా 1 నుంచి 15వ తేదీవరకు రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు సరుకుల పంపిణీ కచ్చితంగా జరిగేలా పౌరసరఫరాలశాఖ కీలకమార్పులు చేపట్టింది. సరుకుల రవాణా తేదీల్లో క్లోజింగ్ బ్యాలెన్స్ (సీబీ), రిలీజ్ ఆర్డర్ (ఆర్వో)లో మార్పులు చేసింది. ప్రతినెలా 1వ తేదీ నుంచి లబ్ధిదారులు రేషన్ సరుకులు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈపాస్ అమలవుతున్న 25 జిల్లాల్లో ఈ విధానం తక్షణం అమల్లోకి వస్తుందన్నారు. 1 నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులకు రేషన్‌షాపుల ద్వారా సరుకుల పంపిణీ జరుగుతుందని. 16న పౌరసరఫరాలశాఖ కేంద్ర కార్యాలయం నుంచి జిల్లాలకు సరుకుల కేటాయిస్తున్నామన్నారు. ఇందుకోసం 16 నుంచి 18 వరకు మీసేవా కేంద్రాల్లో డీలర్లు డీడీలు కట్టడానికి గడువు విధించినట్టు తెలిపారు. డీలర్ల రిలీజ్ ఆర్డర్లను మండలస్థాయి నిల్వ కేంద్రాలకు పంపించాలన్నారు. ఆర్డర్లు అందుకోగానే గోదాం ఇంచార్జీలు సరుకుల పంపిణీ ప్రారంభిస్తారన్నారు. దీనిప్రకారం 16 నుంచి 30వ తేదీలోపు స్టేజ్-2 రవాణాదారులు మండలస్థాయి నిల్వ కేంద్రాల నుంచి రేషన్‌షాపులకు చేరవేస్తారని పేర్కొన్నారు. స్టేజ్-1 రవాణా కాంట్రాక్టర్లు పౌరసరఫరాల సంస్థ మండలస్థాయి గోదాములకు ప్రతినెలా 1 నుంచి 15 లోపు సరుకులు రవాణా చేస్తారని సీవీ ఆనంద్ వివరించారు.

ప్రజావాణిలో న్యాయసహాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని జిల్లా కలెక్టరేట్లలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రజలకు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అండగా నిలువనున్నది. ప్రజావాణి కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో ఫిర్యాదులు నమోదవుతున్న నేపథ్యంలో బాధితుల సహాయార్థం న్యాయసలహాదారులను నియమించాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రజావాణి కార్యక్రమానికి ప్యానెల్ అడ్వకేట్లు, వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి బీఆర్ మధుసూదన్‌రావు తమ సంస్థ జిల్లా కార్యాలయాలకు ఆదేశాలు జారీచేశారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ వీ రామసుబ్రమణియన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ప్యానెల్ వాలంటీర్లు ఫిర్యాదుదారుల సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి న్యాయసేవాధికార సంస్థ తరఫున తగిన సలహాలు ఇస్తారు.

గుంటూరులో కిడ్నీ రాకెట్ గుట్టురట్టు

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీలోని గుంటూరు జిల్లాలో కిడ్నీ రాకెట్ గుట్టు రట్టయింది. ఆధార్‌కార్డులో ఫొటో మార్చి రోగి బంధువుగా చూపించి కిడ్నీల కొనుగోళ్లు, అమ్మకాలు జరుపుతున్న విషయం తాజాగా గురువారం వెలుగులోకి వచ్చింది. గుంటూరుకు చెందిన ఓ డాక్టరే ఈ రాకెట్ ప్రధాన సూత్రధారి అని తెలుస్తున్నది. గుంటూరు, నరసరావుపేట కేంద్రంగా ఈ దందా నడుస్తున్నట్టు అధికారుల విచారణలో వెల్లడైంది. ఇప్పటికే మూడు కిడ్నీలు కొనుగోలు చేయగా, నాలుగో కిడ్నీ కొనుగోలు విషయంలో తేడా రావటంతో విషయం బయటకు పొక్కింది. కిడ్నీ మార్పిడి కోసం వెంకటేశ్వరనాయక్‌ను గుంటూరులోని వేదాంత హాస్పిటల్ యాజమాన్యం రిఫర్ చేసిందని నరసరావుపేట తహసీల్దార్ విజయజ్యోతి కుమారి మీడియాతో తెలిపారు. టీడీపీ నేత కపిలవాయి విజయ్‌కుమార్ తనకు ఫోన్ చేశారని, వెంకటేశ్వరనాయక్ తమవాడేనని త్వరగా సర్టిఫికెట్ ఇవ్వమని చెప్పినట్టు పేర్కొన్నారు. పరిశీలనలో అవి నకిలీవని తేలిందని చెప్పారు. కిడ్నీ ఇస్తే ఇచ్చే డబ్బుతో అప్పులు తీరుస్తామని చెప్పినందుకే ఇస్తున్నానని నాయక్ చెప్పారని ఆమె పేర్కొన్నారు. టీడీపీ నేత విజయకుమార్ గుంటూరులోని వేదాంత హాస్పిటల్ ఎండీ రాధాకృష్ణకు బంధువు (మామ) కావడం విశేషం. కిడ్నీ మార్పిడి తమ దవాఖానలో జరుగలేదని, ఈ రాకెట్‌తో సంబంధం లేదని గుంటూరు నగరం మంగళగిరి రోడ్డులోని వేదాంత హాస్పిటల్ ఎండీ డాక్టర్ రామకృష్ణ మీడియాకు తెలిపారు. శివనాగేశ్వరరావు అనే వ్యక్తికి కిడ్నీ అవసరమని ప్రభుత్వానికి తామే రిఫర్ చేశామని, కిడ్నీ ఇస్తాననన వెంకటేశ్వరనాయక్‌ను శివనాగేశ్వరరావు బంధువులే తీసుకువచ్చారని చెప్పారు. ఐదురోజుల క్రితం విజయవాడ ఆయుష్ దవాఖానలో శివనాగేశ్వరరావుకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్ జరిగిందని వెల్లడించారు.

ఎల్వీ సుబ్రమణ్యంపై ఎమ్మార్ కేసు కొట్టివేత

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎమ్మార్ కుంభకోణం కేసులో నిందితుడైన ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యానికి ఊరట లభించింది. ఆయనపై సీబీఐ నమోదుచేసిన కేసును ఉమ్మడి హైకోర్టు గురువారం కొట్టివేసింది. సుబ్రమణ్యంపై మోపిన అభియోగాలకు సీబీఐ రుజువులు చూపలేకపోయిందని జస్టిస్ బీ శివశంకర్‌రావు నేతృత్వంలోని ధర్మాసనం 169 పేజీల తీర్పులో పేర్కొంది.. హైదరాబాద్‌లోని గోల్ఫ్ కోర్సు తదితర ప్రాంతాల్లో ఎమ్మార్ సంస్థకు తక్కువ ధరకు భూములను కేటాయించారని, భాగస్వామ్య సంస్థలో ప్రభుత్వానికి రావాల్సిన వాటాపై అధికారులు సరైన రీతిలో వ్యవహరించలేదని ఈ కేసు చార్జిషీట్‌లో సీబీఐ పేర్కొంది. ఎల్వీ సుబ్రమణ్యం ఏపీ క్యాడర్‌లో పనిచేస్తున్నారు.



తార్నాకలో మీడియాతో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి

ప్రధాని అపాయింట్‌మెంట్ కోసం

మాదిగ జేఏసీ దీక్షలు

● మాదిగలకు అండగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం

● ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి

హైదరాబాద్/తార్నాక, నమస్తే తెలంగాణ: ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చించడానికి ప్రధానమంత్రి అఖిలపక్షానికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరుతూ ఈ నెల 8,9,10వ తేదీల్లో తెలంగాణ మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపడుతున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, తెలంగాణ మాదిగ జేఏసీ గౌరవాధ్యక్షుడు పిడమర్తి రవి తెలిపారు. గురువారం తెలంగాణభవన్, తార్నాకలో వేర్వేరుగా ఆయన మీడియాతో మాట్లాడారు. 8వ తేదీన కలెక్టరేట్లు, 9న ఆర్డీఓ కార్యాలయాలు, 10 అని నియోజకవర్గ కేంద్రాల్లో ఈ నిరసన దీక్షలను చేపట్టనున్నట్టు పిడమర్తి రవి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసినందున కేంద్రం చొరవ తీసుకొని ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణను పార్లమెంటులో ఆమోదింపజేయాలని కోరారు. దీక్షలకు తెలంగాణ మాదిగ సమాజం మొత్తం హాజరుకావాలని, కేంద్రానికి మాదిగల ఆకాంక్ష తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ హైదరాబాద్‌లో కాకుండా ప్రధాని అపాయింట్‌మెంట్ కోసం ఢిల్లీలో దీక్ష చేస్తే బాగుంటుందని హితవుపలికారు. గతంలో ప్రధానితో అఖిలపక్షం భేటీకి ఖరారైన అపాయింట్‌మెంట్‌ను మందకృష్ణ, కిషన్‌రెడ్డి వారి సొంతగుర్తింపు కోసం రద్దు చేయించిన విషయం తెలంగాణ ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పటికైనా మాదిగలను మోసం చేయవద్దని వారికి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం మొదటి నుంచి మాదిగలకు అండగా ఉంటూ, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నదన్నారు. మాదిగలు పలువురికి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా అవకాశం కల్పించిందన్నారు. మూడు ఎస్సీ రిజర్వుడ్ ఎంపీ స్థానాల్లో రెండింటిని కేటాయించిందని, ఎమ్మెల్సీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులుగా, ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్‌గా మాదిగలకు అవకాశం ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. తార్నాకలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వెంట జేఏసీ ప్రతినిధులు గాదె వెంకట్, ఎల్లన్న, సుధాకర్, గణేశ్, నరేశ్, రమేశ్, సతీశ్ తదితరులు ఉన్నారు.

సిద్దిపేట డబుల్ రికార్డు



దుబ్బాకలో నిర్మాణమవుతున్న డబుల్ బెడ్‌రూం ఇండ్లు (ఫైల్ ఫొటో)



సిద్దిపేట నర్సపురం డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన మంత్రి హరీశ్‌రావు (ఫైల్ ఫొటో)

మొదటిపేజీ తరువాయి...

చేయించడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. వచ్చే దసరా నాటికి వివిధ దశల్లో ఉన్న ఇండ్ల అన్నింటినీ పూర్తిచేసి గృహప్రవేశాలు చేసేలా ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు.

దశ తిరిగిన పిట్టల వాడలు

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. చలికి వణుకుతూ సంచార జీవనం గడిపే పిట్టలోల్లకు డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించి ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కింది. దిక్కూమొక్కూ లేనివారిని చేరదీసి జిల్లాలో మొదటగా వారికే డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించి ఇవ్వడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. మంత్రి హరీశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట నియోజకవర్గంలోని మందపల్లి పిట్టలవాడలో 20 ఇండ్లకు, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ సోలిపేట రామలింగారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న దుబ్బాక నియోజకవర్గంలోని గోవర్ధనగిరి పిట్టలవాడలో 22 ఇండ్లకు గృహప్రవేశాలు పూర్తి చేయించి లబ్ధిదారులకు అందించారు.

ఆదర్శంగా నిలుస్తున్న మోడల్ కాలనీలు

సిద్దిపేటలోని నర్సపురం, గజ్వేల్ మండలంలోని సంగాపూర్, దుబ్బాక నగర పంచాయితీలో నిర్మాణమవుతున్న డబుల్ బెడ్రూం ఇండ్లు మోడల్ కాలనీలుగా దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయి. కాలనీలో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, అంతర్గత సీసీ రోడ్లు, ఆట స్థలాలు, పార్కు, ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలు తదితర సౌకర్యాలను కల్పిస్తున్నారు. నర్సపురంలో నిర్మాణమవుతున్న ఇండ్లను నిరుడు అక్టోబర్‌లో సీఎం కేసీఆర్ ప్రత్యక్షంగా పరిశీలించారు.

జాతీయ అవార్డుకు సిద్దిపేట జిల్లా ప్రతిపాదన

డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలు దేశంలోనే అత్యధికంగా సిద్దిపేట జిల్లాలో జరుగుతున్నాయి. దీంతో సిద్దిపేట జిల్లాను జాతీయ అవార్డు కోసం హడ్కో ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రభు త్వం సిఫారసు చేసింది. జిల్లాలో నిర్మాణమవుతు న్న ఇండ్లకు తోడుగా ఇటీవల సీఎం కేసీఆర్ అదనంగా మరో వెయ్యి ఇండ్లను మంజూరుచేశారు. ఈ వెయ్యి ఇండ్లను ఆయా గ్రామాలకు కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు.

దశలవారీగా గృహప్రవేశాలు: మంత్రి టీ హరీశ్‌రావు



పేద ప్రజల సొంతింటి కల సాకారమయ్యేలా సిద్దిపేట జిల్లాలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయి. మోడల్ కాలనీలుగా ఇండ్లు నిర్మాణమవుతున్నాయి. జిల్లాలో ఎర్రవల్లి, నర్సన్నపేటల తరువాత మందపల్లి పిట్టలవాడ, గోవర్ధనగిరి పిట్టలవాడలో డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు అందించాం. త్వరలోనే దశలవారీగా డబుల్ బెడ్రూం ఇండ్లకు గృహప్రవేశాలు నిర్వహిస్తాం.

243 గ్రామాల్లో 'డబుల్' నిర్మాణాలు

వెంకట్రామ్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లాలో 243 గ్రామాల్లో 70 ఏజెన్సీలతో నిర్మాణాలు జరుగుతున్నాయి. వచ్చే దసరా నాటికి జిల్లాలో మొత్తం ఇండ్లు పూర్తయ్యేలా చూస్తాం. అందరి సహకారంతో ముందుకు వెళ్తున్నాం.

అరుదైన ఘనతకు చేరువైన యాపిల్

త్వరలో ట్రిలియన్ డాలర్ల సంస్థగా అవిర్భావం

లండన్, జనవరి 4: అంతర్జాతీయ టెక్ దిగ్గజం యాపిల్ త్వరలో లక్ష కోట్ల డాలర్ల మార్కెట్ విలువ కలిగిన కంపనీగా అవిర్భవించి ప్రపంచంలోనే తొలిసారి ఈ అరుదైన ఘనత సాధించనున్నది. ఇందుకోసం పోటీపడుతున్న ఇతర సంస్థలతో పోలిస్తే యాపిల్ ఎంతో ముందున్నది. 2017లో గణనీయంగా పెరిగిన టెక్నాలజీ షేర్ల ధరలు ఆకస్మికంగా కూడా ఆదేవిధంగా కొనసాగితే 2018లోనే యాపిల్ లక్ష కోట్ల డాలర్ల స్టాక్ మార్కెట్ విలువ కలిగిన సంస్థగా అవిర్భవించడం ఖాయమని ఆర్థిక వ్యాఖ్యాతలు, పెట్టుబడిదారులు అంచనా వేస్తున్నారని ప్రముఖ పత్రిక 'గార్డియన్' వెల్లడించింది. మంగళవారం నాటికి 869 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను కలిగివున్న యాపిల్.. ఈ విషయంలో గూగుల్ మాతృ సంస్థ అల్ఫాబెట్ (మార్కెట్ విలువ 729 బిలియన్ డాలర్లు) కంటే ఎంతో ముందంజలో ఉంది. ఐఫోన్లతో మొబైల్ కమ్యూనికేషన్ల ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసిన యాపిల్ మార్కెట్ విలువ లక్ష కోట్ల డాలర్లకు చేరుకోవాలంటే దాని షేరు విలువ 15 శాతం పెరిగితే సరిపోతుంది. గత ఏడాది యాపిల్ షేరు విలువ 47 శాతం పెరిగింది.

ఇన్ఫీ సీఈవో వేతనం రూ.18.6 కోట్లు

సిక్కా కంటే తక్కువ అందుకోనున్న సలీల్ పరేఖ్



బెంగళూరు, జనవరి 4: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన సలీల్ పరేఖ్..వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను ఇతర అలవెన్సులు కలుపుకొని రూ.18.6 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకోనున్నారు. వీటిలో వేతనం కింద రూ.6.5 కోట్లు, వార్షిక వేరియబుల్ కింద రూ.9.75 కోట్లు, స్టాక్ ఆప్షన్ కింద మరో రూ.3.25 కోట్లు లభించనున్నాయి. వార్షిక ఈక్విటీ గ్రాంట్ల కింద మరో రూ.13.25 కోట్లు జమకానున్నాయి. కంపెనీ నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకుంటే ఆయనకు రాయితీలు మరింత పెరుగనున్నాయి. ఈ నెల 2న పదవి బాధ్యతలు స్వీకరించిన ఆయనకు మార్చి వరకు జీతం రూపంలో రూ.2.37 కోట్లు లభించనున్నాయి. పరేఖ్ నియామకానికి సంబంధించి ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 20 లోగా వాటాదారుల అభిప్రాయాలను సేకరించనున్నది. కంపెనీ గత సీఈవో విశాల్ సిక్కా అందుకున్న రూ.45.11 కోట్ల కంటే పరేఖ్ తక్కువ జీతాన్ని పొందనున్నారు. కాగా, విప్రో సీఈవో అబిదలీ నీముచ్‌వాలా రూ.13.2 కోట్లు, టీసీఎస్ సీఈవో రాజేష్ గోపీనాథన్ రూ.6.22 కోట్ల జీతాన్ని గడిచిన ఆర్థిక సంవత్సరంలో అందుకున్నారు.

శామ్‌సంగ్ ఫోన్లపై రూ.1,500 రాయితీ

ప్రత్యేక ఆఫర్లను ప్రకటించిన ఎయిర్‌టెల్, వొడాఫోన్



న్యూఢిల్లీ, జనవరి 4: ఎంపిక చేసిన శామ్‌సంగ్ ఫోన్లపై రూ.1,500 వరకు రాయితీని ఇస్తున్నట్లు టెలికం దిగ్గజాలైన భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్‌లు ప్రకటించాయి. ఇందుకోసం ఇరు సంస్థలు శామ్‌సంగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా శామ్‌సంగ్‌కు చెందిన గెలాక్సీ జే-సిరీస్ ఫోన్లపై రెండేండ్ల వరకు రూ.1,500 వరకు రాయితీ లభించనున్నది. రూ.6,990 నుంచి రూ.19,900 లోపు ధర కలిగిన జే2, జే5 ప్రైమ్, జే7 ప్రైమ్, జే7 ప్రొ మోడళ్లపై ఈ రాయితీని ఇస్తున్నట్లు ఎయిర్‌టెల్ వెల్లడించింది. అలాగే వొడాఫోన్ కేవలం మూడు మోడళ్లపై రూ.1,500 క్యాష్‌బ్యాక్ ఆఫర్ చేస్తున్నది. వీటిలో రూ.8,490 ధర కలిగిన గెలాక్సీ జే2 ప్రొ, రూ.10,490 విలువైన జే7 నెక్స్ట్, రూ.16,900 ధర కలిగిన జే7 మోడళ్లు ఉన్నాయి. ఈ స్మార్ట్‌ఫోన్లను కొనుగోలు చేసిన వారు నెలకు రూ.199 చొప్పున రీచార్జ్ చేసుకుంటే రోజుకు 1జీబీ డాటా పొందడంతో పాటు, దేశవ్యాప్తంగా అపరిమిత కాల్స్ చేసుకోవచ్చునని ఎయిర్‌టెల్ వెల్లడించింది. అలాగే రెండేండ్ల పాటు కస్టమర్ రూ.5 వేల వరకు రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా చేసుకున్నవారికి తొలి ఏడాదిలో రూ.800, రెండో ఏడాదిలో మిగతా రూ.1,200 క్యాష్‌బ్యాక్ రూపంలో అందించనున్నట్లు ఎయిర్‌టెల్ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే వొడాఫోన్.. తొలి ఏడాదిలో రూ.600, మరో ఏడాదిలో మిగతా రూ.900 నగదును అందిస్తున్నది.

మార్కెట్లోకి మారుతి సరికొత్త స్విఫ్ట్



న్యూఢిల్లీ, జనవరి 4: దేశవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన స్విఫ్ట్‌లో సరికొత్త వెర్షన్‌ను మళ్లీ మార్కెట్లోకి విడుదల చేయడానికి సిద్ధమైంది మారుతి సుజుకీ. వచ్చే నెలలో ఢిల్లీలో జరుగనున్న ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించనున్న ఈ కారుకోసం ముందస్తు బుకింగ్‌లను ఈ నెల మూడో వారం నుంచి ప్రారంభించనున్నట్లు తెలుస్తున్నది. ఈ కారు ధరపై ఇప్పటి వరకైతే సంస్థ నిర్ణయం తీసుకోలేదు. కానీ రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల మధ్యలో ఉండనున్నట్లు అంచనా. థర్డ్ జనరేషన్‌గా రూపొందించిన ఈ కారును ఫోర్డ్ ఫిగో, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10లకు పోటీగా విడుదల చేయబోతున్నది.

ఐడియాలో పెరుగనున్న ప్రమోటర్ల వాటా

న్యూఢిల్లీ, జనవరి 4: దేశంలో మూడో అతిపెద్ద టెలికం సంస్థ ఐడియా సెల్యులార్ ప్రమోటరైన ఆదిత్యా బిర్లా గ్రూపు నుంచి రూ.3,250 కోట్ల నిధులను సేకరించింది. ఇందుకు సంబంధించి సంస్థ 32.66 కోట్ల ఈక్విటీ షేర్లను కేటాయించనున్నది. దీంతో సంస్థలో ప్రమోటర్ల వాటా 42.4 శాతం నుంచి 47.2 శాతానికి పెరుగనున్నది. ఈ నిధుల సేకరణకు బోర్డు ఏకగ్రీవంగా ఆమోదించింది. పది రూపాయల ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.99.50 చొప్పున చెల్లించి 32.66 కోట్ల షేర్లను ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన బిర్లా టీఎంటీ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎలైన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్(సింగపూర్), ఒరియన్ ఇన్వెస్ట్‌మెంట్ పీటీఈ లిమిటెడ్(సింగపూర్), సూర్యా కిరణ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలు కొనుగోలు చేయనున్నాయి. ఈ ఒప్పందం వచ్చే నెలలో పూర్తికానున్నట్లు తెలుస్తున్నది. టెలికం వ్యాపారాన్ని కొనసాగించడానికి కట్టుబడి ఉన్నామనడానికి ఈ పెట్టుబడులే నిదర్శనమని ఐడియా సెల్యులార్ చైర్మన్ కుమార మంగళం బిర్లా ఈ సందర్భంగా తెలిపారు.

ఉరకలేసిన బ్యాంకింగ్ ఉత్సాహం

లాభాల్లో స్టాక్ మార్కెట్లు

176 పాయింట్లు పుంజుకున్న సెన్సెక్స్

ముంబై, జనవరి 4: ప్రభుత్వ రంగ బ్యాంకులకు మరో రూ.80,000 కోట్లు ఇవ్వాలనే కేంద్రం ఆలోచన గురువారం దేశీయ స్టాక్ మార్కెట్లకు లాభాలను తెచ్చిపెట్టింది. ఈ ఏడాది ఆరంభం నుంచి నష్టాలకే పరిమితమైన సెన్సెక్స్.. 176 పాయింట్లు కోలుకుంది. తొలి మూడు రోజుల్లో ఇది 263.45 పాయింట్లు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే మొండి బకాయిలతో సతమతమవుతున్న బ్యాంకులకు బాండ్ల ద్వారా అదనపు ఆర్థిక సాయం చేసేందుకు పార్లమెంట్ అనుమతిని ఆర్థిక మంత్రిత్వ శాఖ కోరడంతో బ్యాంకింగ్ షేర్లకు ఒక్కసారిగా కొనుగోళ్ల మద్దతు లభించింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 176.26 పాయింట్లు పుంజుకుని 33,969.64 వద్ద స్థిరపడగా, ట్రేడింగ్‌లో 33,802.13 పాయింట్ల కనిష్ఠాన్ని, 33,995.40 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. నిఫ్టీ సైతం 61.60 పాయింట్లు పెరిగి 10,500 స్థాయి ఎగువన 10,504.80 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 10,441.45 పాయింట్ల కనిష్ఠాన్ని, మరొక దశలో 10,513 పాయింట్ల గరిష్ఠాన్ని చేరింది. కాగా, అంతర్జాతీయ సానుకూల సంకేతాలు, డిసెంబర్ నెల సేవా రంగ పీఎంఐ గణాంకాల్లో వృద్ధి కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచాయంటూ ట్రేడింగ్ సరళిని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇక బ్యాంకింగ్‌తోపాటు మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్, పీఎస్‌యూ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హెల్త్‌కేర్, చమురు, గ్యాస్, విద్యుత్ రంగాల షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి. వీటి విలువ 2.77 శాతం నుంచి 0.33 శాతం మేర పెరిగింది. అత్యధికంగా టాటా స్టీల్ షేర్ విలువ 3.74 శాతం ఎగబాకగా, డాక్టర్ రెడ్డీస్ షేర్ విలువ కూడా 3.14 శాతం ఎగిసింది. ఎల్‌అండ్‌టీ, ఓఎన్‌జీసీ, రిలయన్స్, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ తదితర షేర్లు 3.08 శాతం మేర లాభపడ్డాయి. ఆసియా, ఐరోపా మార్కెట్లలోని ప్రధాన సూచీలూ లాభాల్లోనే కదలాడాయి.

బ్యాంకింగ్ షేర్లకు బ్రహ్మరథం

ప్రభుత్వ సెక్యూరిటీల జారీ ద్వారా మరో రూ.80,000 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులకు అందించాలనే మోదీ సర్కారు ప్రయత్నాలతో బ్యాంకింగ్ షేర్లకు మదుపరులు బ్రహ్మరథం పట్టారు. దీంతో ఆయా బ్యాంకుల షేర్ల విలువ గరిష్ఠంగా 8.5 శాతం వరకు ఎగిసింది. 'బ్యాంకింగ్ సంస్థలకు మూలధన సాయంలో భాగంగా తదుపరి విడుత నిధుల విడుదల మదుపరుల్లో కొత్త అంచనాలకు తెరతీశాయి. కేంద్ర ప్రభుత్వ అదనపు నిధుల కేటాయింపు ఆలోచనలు.. బ్యాంకింగ్ సూచీని పరుగులు పెట్టించింది' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ముఖ్య మార్కెట్ వ్యూహకర్త ఆనంద్ జేమ్స్ అన్నారు.

బ్యాంక్	లాభం (శాతాల్లో)
యూకో	8.50
ఐడీబీఐ	8.33
పీఎన్‌బీ	5.97
బీవోఐ	3.83
బీవోబీ	3.77
ఓబీసీ	3.71
కెనరా	2.69
బీవోఎం	2.39
ఇండియన్ బ్యాంక్	1.89
ఎస్‌బీఐ	1.72



37 వేలకు సెన్సెక్స్.. 11,500లకు నిఫ్టీ

ఈ ఏడాది ఆఖరుకల్లా సెన్సెక్స్ 37,000 మార్కును తాకవచ్చని, అలాగే నిఫ్టీ 11,500 స్థాయికి చేరుకోవచ్చని డ్యూష్ బ్యాంక్ అంచనా వేసింది. 'కార్పొరేట్ ఆదాయాల్లో బలమైన వృద్ధి.. ఈ ఏడాది సెన్సెక్స్, నిఫ్టీలను సరికొత్త స్థాయిలకు చేర్చే వీలుంది' అని ఓ పరిశోధన నివేదికలో పేర్కొంది. కార్పొరేట్ సంస్థల లాభాలు.. మార్కెట్‌లో నెలకొన్న సానుకూల దృక్పథాన్ని మరింత పెంచవచ్చన్నది.

బ్యాంకులకు రూ.80 వేల కోట్లు

రీక్యాపిటలైజేషన్‌కు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, జనవరి 4: ప్రభుత్వ రంగ బ్యాంకులకు అదనంగా మరో రూ.80,000 కోట్ల నిధులు అందనున్నాయి. బాండ్ల ద్వారా ఈ సాయాన్ని అందించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం పార్లమెంట్ అనుమతిని కోరగా, లోక్‌సభ దీనికి ఆమోదం తెలిపింది. రుణ సెంటిమెంట్ పునరుద్ధరణకు, మొండి బకాయిల సమస్యను అధిగమించడానికి ప్రభుత్వ బ్యాంకులకు రెండేండ్ల రీక్యాపిటలైజేషన్ కార్యక్రమంలో భాగంగా అదనపు వ్యయానికి అంగీకరించాలని ఆర్థిక శాఖ విజ్ఞప్తి చేసింది. దీనికి లోక్‌సభ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు-ఎన్‌పీఏ) సమస్యతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రభుత్వ బ్యాంకుల బలోపేతానికి మునుపెన్నడూ లేనివిధంగా రూ.2.11 లక్షల కోట్ల నిధులను రాబోయే రెండేండ్లలో అందిస్తామని గతేడాది అక్టోబర్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఎన్‌పీఏల బారినపడ్డ ప్రభుత్వ బ్యాంకులు నిధుల కొరతను అధిగమించి పెట్టుబడులను సమకూర్చుకునేలా చేయడమే ఈ ప్రణాళిక అసలు ఉద్దేశం. అయితే ప్రభుత్వ సెక్యూరిటీల జారీ ద్వారా మరో రూ.80,000 కోట్ల కేటాయింపులు జరుపాలని మోదీ సర్కారు నిర్ణయించింది. ఇందులో భాగంగానే 2017-18కి కేటాయింపులకుగాను మూడో విడుత సప్లిమెంటరీ డిమాండ్లలో ఈ రూ.80,000 కోట్ల వ్యయ పెంపునకు అనుమతించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా పార్లమెంట్‌ను కోరింది. రూ. 2.11 లక్షల కోట్ల మూలధన సాయంలో భాగంగానే రూ.1.35 లక్షల కోట్ల రీక్యాపిటలైజేషన్ బాండ్లను జారీ చేయాలనుకుంది కేంద్రం. ఇప్పుడు దీనికి మరో రూ.80,000 కోట్లను పెంచాలనుకుంటున్నది. ఇక మార్చికల్లా ఈ బాండ్ల సాయాన్ని బ్యాంకులకు అందించే వీలున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతుండగా, ఈ ప్రతిపాదిత బాండ్లు నాన్-ఎస్‌ఎల్‌ఆర్, నాన్-ట్రేడబుల్ హోదాను కలిగి ఉంటాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఈ బాండ్లపై వడ్డీరేటుకు సంబంధించిన అంశాలను ఆర్థిక వ్యవహారాల శాఖ చూడనున్నది. కాగా, లోక్‌సభ ఆమోదం పొందడంతో రాజ్యసభ అనుమతి రావాల్సి ఉన్నది.

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ అమ్మకానికి కేంద్రం సిద్ధం

మరో రెండు ప్రభుత్వ రంగ సంస్థలను కూడా

న్యూఢిల్లీ, జనవరి 4: డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) సహా ప్రభుత్వ రంగంలోని మూడు సంస్థల్లోని వాటాలను అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వం గురువారం నాడు ట్రాన్సాక్షన్ అడ్వైజర్ల నుంచి బిడ్లను ఆహ్వానించింది. రెండు విడతల్లో వేలం వేయడం ద్వారా హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్‌తో పాటు ఐఎంపీసీఎల్ (ఇండియన్ మెడిసిన్స్ ఫార్మాస్యూటికల్ కార్పొరేషన్ లిమిటెడ్)లోని 100 శాతం వాటాలను అమ్మాలని యోచిస్తున్న ప్రభుత్వం.. ఈ సంస్థలకు ట్రాన్సాక్షన్ అడ్వైజర్లుగా వ్యవహరించదల్చుకున్న వారు ఈ నెల 29వ తేదీలోగా బిడ్లను దాఖలు చేయాలని స్పష్టం చేసింది. నౌకాయాన మంత్రిత్వ శాఖ ఆధీనంలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం ప్రభుత్వానికి 73.47 శాతం వాటా ఉంది. లాభాల బాటలో నడుస్తున్న ఈ సంస్థ గత ఆర్థిక సంవత్సరం (2016-17)లో రూ.599.69 కోట్ల టర్నోవర్ సాధించింది. గత ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ నాటికి ఈ సంస్థ మార్కెట్ విలువ రూ.1,547.57 కోట్లుగా ఉంది. కాగా, ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఐఎంపీసీఎల్‌లో కేంద్రానికి 97.61 శాతం, ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి 2.39 శాతం చొప్పున వాటాలున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ.66.45 కోట్ల టర్నోవర్ సాధించిన ఈ సంస్థ 2017 సెప్టెంబర్ నెలాఖరు నాటికి రూ.65.49 కోట్ల మార్కెట్ విలువను కలిగి ఉంది. అలాగే కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధీనంలో పనిచేస్తున్న లిస్టెడ్ సంస్థ హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,064.71 కోట్ల టర్నోవర్ సాధించింది. 2017 సెప్టెంబర్ చివరి నాటికి ఈ సంస్థ రూ.487.93 కోట్ల మార్కెట్ విలువను కలిగి ఉంది. ఈ మూడు సంస్థల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకోవడం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.72,500 కోట్లను సమీకరించుకోవాని లక్ష్యంగా నిర్దేశించుకున్న ప్రభుత్వం.. ఈ మొత్తంలో మైనార్టీ వాటా అమ్మకం ద్వారా రూ.46,500 కోట్లు, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.15 వేల కోట్లు, ప్రభుత్వ రంగ బీమా సంస్థల నుంచి రూ.11 వేల కోట్లు రాబట్టుకోవచ్చని అంచనా వేస్తున్నది.

97 కోట్లు దాటిన మొబైల్ కస్టమర్లు

న్యూఢిల్లీ, జనవరి 4: భారత్‌లో మొబైల్ కస్టమర్ల సంఖ్య వాయువేగంతో దూసుకుపోతున్నది. నవంబర్ చివరినాటికి ఈ సంఖ్య 97.54 కోట్లకు చేరుకున్నదని ఇండస్ట్రీ బాడీ సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. అక్టోబర్‌లో నమోదైన వినియోగదారులతో పోలిస్తే 83.3 లక్షల మేర పెరిగారు. భారతీ ఎయిర్‌టెల్‌లో 40.4 లక్షల మంది చేరడంతో మొత్తం సబ్‌స్క్రైబర్ల సంఖ్య 28.95 కోట్లకు చేరుకుంది. అలాగే వొడాఫోన్ కస్టమర్లు 21.1 కోట్లకు, ఐడియా కస్టమర్లు 19.4 కోట్లకు, జియో కస్టమర్లు 14.59 కోట్లకు చేరుకున్నారు. అయితే ఎయిర్‌సెల్ 10 వేల మంది కస్టమర్లను, టెలినార్ 12.5 లక్షల మంది వినియోగదారులను కోల్పోయాయి.

వచ్చే ఐదేండ్లలో సగటున 6.7 శాతం వృద్ధి: ఫిచ్



ముంబై, జనవరి 4: వచ్చే ఐదేండ్లలో భారత ఆర్థిక వ్యవస్థ సగటున 6.7 శాతం వార్షిక వృద్ధిరేటుతో ముందుకు సాగుతుందని, ప్రపంచంలో అత్యంత వేగవంతంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అగ్రగామిగా నిలుస్తుందని అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ ఫిచ్ పేర్కొంది. భారత్ సామర్థ్యంతో పోలిస్తే ఈ వృద్ధిరేటు తక్కువే అయినప్పటికీ వేగవంతంగా వృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో రెండో స్థానంలో ఉన్న చైనా, ఇండోనేషియాల్లో 5.5 శాతంగా నమోదవుతుందని భావిస్తున్న వృద్ధిరేటు కంటే భారత్‌లోనే వృద్ధిరేటు ఎక్కువగా ఉంటుందని ఫిచ్ స్పష్టం చేసింది. జనాభా పరమైన సానుకూల అంశాలు భారత్‌కు ఎంతగానో లాభిస్తాయని, ప్రపంచంలోనే అత్యధిక శ్రామిక జనాభాను కలిగివున్న భారత్‌కు పెట్టుబడుల రేట్లు మరింత లబ్ధిని చేకూరుస్తాయని గురువారం విడుదల చేసిన తాజా నివేదికలో ఫిచ్ పేర్కొంది. రానున్న ఐదేండ్లలో శ్రామిక జనాభా మరింత పెరగనుండటంతో భారత వృద్ధిరేటు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇదేవిధమైన ధోరణితో ఇండోనేషియా, మెక్సికో, టర్కీ, బ్రెజిల్ తదితర దేశాలు కూడా లబ్ధి పొందుతాయని ఫిచ్ అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 5.7 శాతానికి పతనమై ఆరు త్రైమాసికాల కనిష్ఠ స్థాయికి క్షీణించిన భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు ఆ తర్వాత పుంజుకుని సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో 6.3 శాతానికి పెరిగిన విషయం తెలిసిందే.

'మహా' కుల ఘర్షణలను ఖండించిన రాజ్యసభ

నిందితులను కఠినంగా శిక్షించాలని సభ్యుల డిమాండ్

అది కేవలం సామాజిక ఘర్షణేనన్న ఉపరాష్ట్రపతి వెంకయ్య

న్యూఢిల్లీ/ ముంబై/ బుర్హాన్‌పూర్: మహారాష్ట్రలో కుల ఘర్షణలను రాజ్యసభ ఖండించింది. దీని కారకులను శిక్షించేందుకు నిష్పక్షపాతంగా, వేగంగా న్యాయ విచారణ జరిపించాలని సభ్యులు డిమాండ్ చేశారు. మహారాష్ట్ర ఘర్షణలపై గురువారం జరిగిన స్వల్ప చర్చను ప్రారంభించిన కాంగ్రెస్ సభ్యురాలు రజనీ పాటిల్.. మహారాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలోనే దళితులపై అకృత్యాలు జరుగుతున్నాయని, దీనిపై పూర్తి దర్యాప్తునకు కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఘర్షణల వెనుక 'హిందుత్వ' సంస్థల హస్తం ఉన్నదని ఆరోపించారు. అంతకుముందు రాజ్యసభ చైర్మన్ ఎం వెంకయ్యనాయుడు స్పందిస్తూ సభ్యులు ఉద్రిక్తతలు పెరుగకుండా చూడాలన్నారు. ఇది కేవలం సామాజిక సంఘర్షణ మాత్రమేనని అన్నారు. తృణమూల్ సభ్యుడు నదిముల్ హేగ్, డీఎంకే సభ్యురాలు కనిమొళి మాట్లాడుతూ మహారాష్ట్ర ఘటనలను విడిగా చూడలేమన్నారు. రాజకీయ దాడులను తక్షణం నిలిపేయాలన్నారు. బీజేడీ సభ్యుడు దిలీప్‌కుమార్ టిర్కీ మాట్లాడుతూ దాడుల కారకులపై తక్షణం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ సభ్యుడు వీర్‌సింగ్ మాట్లాడుతూ ఇదంతా కాషాయ పతాకదారులు చేసిందేనన్నారు. సీపీఎం సభ్యుడు టీకే రంగరాజన్ మాట్లాడుతూ దాడులకు మహారాష్ట్ర అధికార యంత్రాంగం, అధికార బీజేపీ, పోలీసుల వ్యూహాత్మక మద్దతు ఉన్నదని ఆరోపించారు. కాగా, బుధవారం బంద్ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో 30 మందికి పైగా పోలీసులకు గాయాలయ్యాయి. 300 మందికి పైగా ఆందోళనకారులను అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. మహారాష్ట్ర దళితులకు మద్దతుగా మధ్యప్రదేశ్‌లోని బుర్హాన్‌పూర్ పట్టణంలో గురువారం బంద్ పాటించారు. ఇచ్చాపూర్ – ఇండోర్ రాష్ట్ర రహదారిపై రాళ్లు పేర్చారు. ఆందోళనకారుల దాడిలో 12 వాహనాలు దెబ్బ తిన్నాయి.

మేకిన్ ఇండియా కాదు ఫేకిన్ ఇండియా

కేంద్రంపై విరుచుకుపడ్డ రాహుల్

న్యూఢిల్లీ, జనవరి 4: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మరోసారి కేంద్రప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మేకిన్ ఇండియా' కార్యక్రమం 'ఫేకిన్ ఇండియా'గా మారిందని విమర్శించారు. గురువారం ఆయన ట్వీట్ చేస్తూ 'మీకు ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. ఫేకిన్ ఇండియా కార్యక్రమంలో కొత్త అప్‌డేట్ వచ్చింది. మోదీ ప్రభుత్వం చేపట్టిన మేకిన్ ఇండియా వల్ల పెట్టుబడులు పెరుగాలి. కానీ, తగ్గిపోయాయి. పలు ప్రాజెక్టులు కూడా నిలిచిపోయాయి' అని పేర్కొన్నారు. తన ట్వీట్‌కు అంకెలతో కూడిన ఓ రిపోర్టును కూడా జతచేశారు.

శాసనవ్యవస్థలో జోక్యం వద్దు

న్యాయవ్యవస్థకు ఎంపీల సూచన

కోర్టులు చట్టాలు చేయలేవన్న డిప్యూటీ స్పీకర్ తంబిదురై

న్యాయమూర్తుల వేతన పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదం



లోక్‌సభలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ తంబిదురై

న్యూఢిల్లీ: శాసనవ్యవస్థ పనితీరులో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవద్దని పలువురు లోక్‌సభ సభ్యులు కోరారు. లోక్‌సభలో న్యాయమూర్తుల వేతనాల పెంపునకు ప్రభుత్వం ప్రతిపాదించిన హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల (వేతనాలు, సర్వీసు నిబంధనలు) సవరణ బిల్లు - 2017'పై గురువారం జరిగిన చర్చలో పాల్గొన్న సభ్యులు బిల్లుకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థపై పార్లమెంట్‌దే ఆధిపత్యం అని చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ ఎంపీలంతా రాజకీయాలకతీతంగా సుప్రీంకోర్టుతో సంప్రదించి.. 'చట్టాలు చేయడం మీ పని కాదు' అని తెలియజేయాలని డిమాండ్ చేశారు. 'చట్టాల తయారీని పార్లమెంట్‌కు వదిలేయాలి. ఆ పని న్యాయవ్యవస్థ వదిలేయకుంటే రోజువారీగా రెండు వ్యవస్థల మధ్య సంఘర్షణ ఏర్పడుతుంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే వచ్చే 10 – 15 ఏండ్లలో రెండు వ్యవస్థల మధ్య ప్రత్యక్ష సంఘర్షణకు దారితీస్తుంది' అని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్యూటీ స్పీకర్ ఎం తంబిదురై మాట్లాడుతూ చట్టాల్లో జోక్యం చేసుకోవడం న్యాయవ్యవస్థ పని కాదన్నారు. వారు (న్యాయమూర్తులు) చట్టాలు చేయలేరన్నారు. టీడీపీ సభ్యుడు పీ రవీంద్రబాబు మాట్లాడుతూ 'మేం ప్రజలందరి ఉమ్మడి తీర్పుకు ప్రతినిధులం' అని, కనుక పార్లమెంట్‌దే తుది అధికారమన్నారు. అఖిల భారత న్యాయ సర్వీసుల కింద న్యాయమూర్తుల నియామకాన్ని సివిల్ సర్వీసు నిబంధనల పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. కాగా, సుప్రీంకోర్టుతోపాటు దేశంలోని 24 రాష్ర్టాల హైకోర్టుల న్యాయమూర్తుల వేతనాల పెంపునకు ప్రతిపాదించిన బిల్లును గురువారం లోక్‌సభ ఆమోదించింది. ఈ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపితే సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ వేతనం రూ. లక్ష నుంచి రూ.2.80 లక్షలకు, సుప్రీం న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల వేతనం రూ. 90 వేల నుంచి రూ.2.50 లక్షలకు చేరుతుంది. ఇక హైకోర్టు న్యాయమూర్తులు రూ.80 వేల నుంచి రూ.2.25 లక్షల వేతనం పొందుతారు. హైకోర్టు న్యాయమూర్తుల వేతనాన్ని రాష్ర్టాలు భరించాల్సి ఉంటుంది. శుక్రవారం పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు చివరి రోజు. ఒకవేళ శుక్రవారం రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందక పోతే న్యాయమూర్తులు వేతనాల పెంపు కోసం ఈ నెల 30 వరకు వేచి చూడాల్సి వస్తుంది.

ట్రిపుల్ తలాక్‌పై అదే ప్రతిష్టంభన

సెలెక్ట్ కమిటీకి పంపాలని విపక్షం పట్టు

న్యూఢిల్లీ: 'తక్షణ ట్రిపుల్ తలాక్'పై రాజ్యసభలో గురువారం కూడా ప్రతిష్టంభన కొనసాగింది. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలన్న డిమాండ్‌పై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. ముస్లిం మహిళల (వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫారసు చేయాలని కోరుతూ విపక్షం ప్రతిపాదించిన తీర్మానాలు నిబంధనలకనుగుణంగా లేవని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. తలాక్ చెప్పిన భర్తలు జైలుకెళితే.. వారి భార్యలు, పిల్లలకు ఆర్థిక సాయం చేసేందుకు ప్రభుత్వం అంగీకరిస్తూ నిబంధనలు చేరిస్తే ప్రతిష్టంభన తొలిగిపోతుందని కాంగ్రెస్ పార్టీ సూచించింది. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫారసు చేయాలని కాంగ్రెస్ సభ్యుడు ఆనందశర్మ, తృణమూల్ సభ్యుడు సుఖేందు శేఖర్ రాయ్ ప్రతిపాదించిన తీర్మానాలపై పట్టుబట్టారు. సమాజ్‌వాదీ పార్టీ కూడా సెలెక్ట్ కమిటీకి సిఫారసు చేయాలని పట్టుబట్టింది. ఎన్డీయే మిత్రపక్షం టీడీపీ కూడా మద్దతు తెలిపింది. తృణమూల్ సభ్యుడు డెరిక్ ఓ బ్రయన్ స్పందిస్తూ ట్రిపుల్ తలాక్ బిల్లు సంగతి తేలకుండా ముందడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. ఎజెండాలో లేని అంశాలను చేపట్టలేనని డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ స్పష్టం చేశారు. విపక్ష నాయకుడు గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ బిల్లుకు మద్దతిచ్చేందుకు తాము సిద్ధమని, బాధితులైన భార్యలు, వారి పిల్లలకు ఆర్థిక అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. ట్రిపుల్ తలాక్ చెప్పిన భర్తలు జైలుకెళ్తే వారి కుటుంబాలను ఆదుకునే వారు ఎవరన్నారు. ఇరు పక్షాలు తమ వాదనలకే కట్టుబడటంతో డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

రైళ్లలో డబుల్ బెడ్ రూం కోచ్‌లు!

పర్యాటకుల కోసం రైల్వేశాఖ యోచన



న్యూఢిల్లీ: విలాసవంతమైన డబుల్ బెడ్ రూం కోచ్‌లో ప్రయాణిస్తూనే సుందర ప్రదేశాలను సందర్శిస్తుంటే ఎంత హాయిగా ఉంటుంది.. ఆ అనుభవాన్ని, వసతుల్ని ప్రయాణికులకు సమకూర్చాలని రైల్వేశాఖ యోచిస్తున్నది. పర్యాటకుల కోసం సకల సౌకర్యాలతో అందమైన లగ్జరీ సెలూన్లతో కూడిన ప్రత్యేక కోచ్‌లను రూపొందించాలని యోచిస్తున్నది. ఇందులో రెండు పడకలతోపాటు, లాంజ్, కిచెన్ టాయిలెట్ సౌకర్యాలు ఉంటాయి. ఈ తరహా ప్రయాణానికి డబ్బు బాగానే ఖర్చు చేయాలి. ఇటువంటి సౌకర్యం ఉండాలని పలువురు సంపన్నులు కోరుకుంటున్నారని రైల్వేబోర్డు చైర్మన్ అశ్వనీ లోహానీ తెలిపారు. ప్రయాణ, వర్తక సంఘాలతో ఢిల్లీలో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. రైల్వేలో ఇప్పటికే సెలూన్ కార్లున్నాయి. ప్రమాదాలు/ మరేదైనా ఘటన జరిగినపుడు/ తనిఖీల కోసం రైల్వే ఉన్నతాధికారులు మాత్రమే వీటిని ఉయోగిస్తున్నారు. కనీసం రెండు కుటుంబాలకు సరిపోయేలా, రెండు లగ్జరీ సెలూన్లుండే రైలు ప్రయాణాల కోసం ప్రణాళికలు రూపొందించాలని అధికారులను లోహానీ కోరారు. ఇటువంటి రైళ్లు నడిపే మార్గాలను నిర్ణయించి దీనిపై ప్రచారానికి ప్రత్యేక బ్రోచర్లు వేయించాలని ఐఆర్‌సీటీసీని కోరారు.

చమురు ధర తగ్గినా పేదలకు వడ్డింపులేనా?

జాతికి సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినా.. దాని ప్రయోజన ప్రజలకు చేరడం లేదని కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. చమురు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం విధించడం వల్ల ప్రభుత్వం రూ.5.5 లక్షల కోట్ల ఆదాయం పొందిందని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లిఖార్జునఖర్గే గురువారం జీరో అవర్‌లో ఆరోపించారు. ప్రభుత్వానికి అదనంగా లభించిన ఆదాయం ఏ పథకానికి ఖర్చు చేస్తున్నారో జాతికి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి రెండు నెలల ముందు 2014 మార్చిలో బ్యారెల్ ముడి చమురు ధర 110 డాలర్లు ఉంటే, 2016 జూన్‌లో 40 డాలర్లకు పడిపోయిందని, బుధవారం 60 డాలర్లుగా ఉన్నదన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించలేదని, దానికి బదులు ఎక్సైజ్ సుంకం డీజిల్‌పై 386 శాతం, పెట్రోల్‌పై 126 శాతం ధరలు పెంచేసిందన్నారు. ఏటా రూ.1.62 లక్షల కోట్ల చొప్పున ఇప్పటివరకు రూ.5.50 లక్షల కోట్ల మేరకు కేంద్రం అదనపు ఆదాయం పొందిందన్నారు. ఇదిలా ఉంటే దళితులతోపాటు దేశ ప్రజల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపుల్లో కోత విధించిందని ఖర్గే ఆరోపించారు.



నాగార్జునసాగర్‌లోని మహాబుద్ధస్తూపం వద్ద బౌద్ధులు

సాగర్ బుద్ధవనాన్ని సందర్శించిన విదేశీయులు

నాగార్జునసాగర్: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని గురువారం బెంగళూర్ మహాబోధి సొసైటీ ప్రతినిధులతో పాటు స్విట్జర్లాండ్‌కు చెందిన బౌద్ధులు సందర్శించారు. శ్రీపర్వతారామంలోని గోపురంపైన, మ్యూజియంలో ఉన్న శిల్పాలను, స్తూప పార్కు, ధ్యానవనం, బుద్ధచరితవనంతోపాటు పలు ప్రాంతాలను వారు పరిశీలించారు. బుద్ధవనంలో ఏర్పాటు చేయనున్న ఆధ్యాత్మిక కేంద్రం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి మ్యూజియాన్ని సందర్శించారు. ఇక్కడికి వచ్చిన వారిలో ఆనంద్‌బంతే, బోధిపాల, బుద్ధిపాల, సత్యపాల, స్విట్జర్లాండ్‌కు చెందిన గేబీస్విజర్, రూడి నుల్లర్, మెక్‌టిల్ట్ జెక్కర్, మోనికా తడ్డి, అలెక్స్ తదితరులు ఉన్నారు.

ఆదిలాబాద్‌లో చలిపంజా

■ హైదరాబాద్‌లో స్వల్పంగా పెరుగుదల

హైదరాబాద్ సిటీబ్యూరో/ఆదిలాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో సాధారణం కన్నా 2 నుంచి 7 డిగ్రీల మేర తగ్గిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తరాది నుంచి చలిగాలులు పెరుగడంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నట్టు అధికారులు తెలిపారు. ఆదిలాబాద్‌లో గురువారం 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలైన ఉట్నూర్, బోథ్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల్లో చలి ప్రభావం అధికంగా ఉంది. రాత్రి, ఉదయం వేళల్లో మంచు కురుస్తుండడంతో వాతావరణం చల్లగా మారిపోతుంది. వచ్చే మూడురోజులపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తీవ్ర చలి గాలులు వీచే అవకాశం ఉన్నదని అధికారులు హెచ్చరించారు. భద్రాచలంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 14 డిగ్రీలుగా నమోదయినట్టు చెప్పారు. ఖమ్మంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 6 డిగ్రీలు తగ్గి 11 డిగ్రీలుగా రికార్డయింది. మెదక్‌లో 12.8 డిగ్రీలు, రామగుండంలో 12 డిగ్రీలు, హన్మకొండలో 13 డిగ్రీలు, హకీంపేట్‌లో 16, నల్లగొండలో 14, నిజామాబాద్‌లో 15 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 18 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు హైదరాబాద్‌లో రెండురోజులక్రితం సాధారణ స్థాయికి చేరిన ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కన్నా రెండు డిగ్రీలు తగ్గి 29 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కన్నా 3 డిగ్రీలు తగ్గి 14.0 డిగ్రీలుగా నమోదయినట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు.



ఆదిలాబాద్ పట్టణంలో పొగ మంచు ప్రభావం

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	29.5	6.0
నిర్మల్	29.5	6.0
మంచిర్యాల	28.9	6.0
కుమ్రంభీం ఆసిఫాబాద్	28.9	6.0
జగిత్యాల	29.5	10.0
జనగామ	31.0	13.0
పెద్దపల్లి	29.6	12.0
వరంగల్ రూరల్	31.0	12.0
కరీంనగర్	33.4	11.8
వికారాబాద్	24.9	13.1
యాదాద్రి భువనగిరి	28.0	14.0
ఖమ్మం	31.0	11.0
మెదక్	30.3	12.8
సంగారెడ్డి	30.3	12.8
సిద్దిపేట	30.3	12.8
నిజామాబాద్	30.4	15.0
కామారెడ్డి	30.4	15.0
సూర్యాపేట	29.0	15.0
రాజన్న సిరిసిల్ల	30.0	16.0
నల్లగొండ	29.8	14.0
జయశంకర్ భూపాలపల్లి	29.0	14.0
మహబూబాబాద్	30.0	15.0
భద్రాద్రి కొత్తగూడెం	31.0	14.0
హైదరాబాద్	28.0	16.0
రంగారెడ్డి	28.0	16.0
మేడ్చల్	28.0	16.0
వరంగల్ అర్బన్	30.0	13.0
నాగర్‌కర్నూల్	29.0	14.0
వనపర్తి	30.5	18.9
మహబూబ్‌నగర్	31.6	18.0
జోగుళాంబ గద్వాల	32.0	17.0



టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు మ్యాప్‌ను పరిశీలిస్తున్న దక్షిణ కొరియా బృందం

టెక్స్‌టైల్ పార్కులో కొరియా బృందం

గీసుగొండ(వరంగల్ రూరల్): వరంగల్ రూరల్ జిల్లా శాయంపేటలో నిర్మిస్తున్న మెగా టెక్స్‌టైల్ పార్కును దక్షిణ కొరియా టెక్నికల్ బృందం టీఎస్‌ఐఐసీ అధికారులతో కలిసి గురువారం సందర్శించింది. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులను బృందం సభ్యులు పరిశీలించారు. టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ రతన్‌రాథోడ్ పార్కు వివరాలను వారికి వివరించారు. 12 వందల ఎకరాల భూములను సేకరించామన్నారు. ప్రభుత్వంతో ఇప్పటికే 14 కంపెనీలు ఎంవోయూను కుదుర్చుకున్నాయన్నారు. అనంతరం బృందం సభ్యులు మాట్లాడుతూ మెగాటెక్స్‌టైల్ పార్కు కోసం ప్రభుత్వం సేకరించిన భూమి బాగుందని, రైల్వే మార్గం కూడా అందుబాటులో ఉన్నదన్నారు. కంపెనీ ఏర్పాటుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని దక్షిణ కొరియా ప్రతినిధులు తెలిపారు.



సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

చురుగ్గా జనగామ కలెక్టరేట్ నిర్మాణ పనులు

జనగామ, నమస్తే తెలంగాణ: జనగామలోని సూర్యాపేట రోడ్డులో సుమారు రూ.40 కోట్లతో చేపట్టిన కలెక్టరేట్ కాంప్లెక్స్ పనులను గురువారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పరిశీలించారు. అక్కడే ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జనగామ జిల్లా రద్దవుతుందని వస్తున్న వదంతులను కొట్టిపారేశారు. పనుల ప్రగతి విషయంలో సీఎం కేసీఆర్ సంతృప్తితో ఉన్నారన్నారు. జిల్లా ఏర్పాటు విషయంలో అప్పట్లో అడ్డుపడిన కొందరు ఇప్పుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఎవరెన్ని వదంతులు సృష్టించినా వందశాతం జనగామ జిల్లా కదలదన్నారు.



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వేములవాడ నగర పంచాయతీ వైస్‌చైర్మన్ ప్రతాప రామకృష్ణ, కంటతడిపెడుతున్న ఉద్యోగిని

ఫిర్యాదు చేస్తే.. నా పేరు చెప్తావా!

■ టీపీబీవోపై వేములవాడ నగర పంచాయతీ వైస్‌చైర్మన్ ఆగ్రహం

■ కంటతడి పెట్టుకున్న ఉద్యోగిని

వేములవాడ, నమస్తే తెలంగాణ: 'ఫిర్యాదు చేస్తే .. నా పేరు చెబుతావా..! పట్టణంలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా. ఏ ఒక్కరినీ వదలను' అంటూ వేములవాడ నగరపంచాయతీ వైస్‌చైర్మన్ ప్రతాపరామకృష్ణ ఆగ్రహంతో ఊగిపోయారు. గురువారం ఉదయం నగరపంచాయతీకి మూడో వార్డు సభ్యుడు జంగం రాజేందర్‌తో సదరు రామకృష్ణ చేరుకున్నారు. సాక్షాత్తూ... కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ ముందే టీపీబీవో గొట్టె తేజస్వినిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ముందుగా ఎజెండాలో ఏం పెడుతున్నారో అర్థమవుతుందా?' అని కమిషనర్‌ను మందలిస్తూనే అక్కడే ఉన్న టీపీబీవోపై విరుచుకుపడ్డారు. '19వ వార్డులో నిర్మాణాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తే నా పేరు ఎలా చెబుతావు? అవినీతికి పాల్పడుతూ దుర్వినియోగానికి కూడా వెనుకాడడం లేదు' అంటు మండిపడ్డారు. ఏ ఒక్కరినీ వదలబోనని ఆగ్రహంతో ఊగిపోగా సదరు మహిళా ఉద్యోగిని తీవ్ర ఆవేదనకు లోనై కంటతడి పెట్టుకుంది.

గోదావరి జలాలపై కేంద్రం కుట్ర

■ రిటైర్డ్ ఇంజినీర్ల ఫోరం ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి



నల్లగొండ, నమస్తే తెలంగాణ: గోదావరి జలాలను నాగార్జునసాగర్ నుంచి రివర్సబుల్ టర్బయిన్ ద్వారా తమిళనాడులోని కావేరికి తరలించేందుకు కేంద్రం కుట్ర చేస్తున్నదని రిటైర్డు ఇంజినీర్ల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన నల్లగొండలో విలేకరులతో మాట్లాడారు. గోదావరి నీటిని సుమారు 200కి.మీ. దూరంలో కాంటూర్ కాల్వ ద్వారా సాగర్ రివర్సబుల్ టర్బయిన్‌తో కావేరికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నదన్నారు. కేంద్రం నిర్ణయంతో సాగర్ ఆయకట్టు రైతాంగానికి ఇక్కట్లు తప్పవన్నారు.



డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి భూపాలపల్లి జిల్లా ఎంపేడులో స్పీకర్ మధుసూదనాచారి, వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్‌లో శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఈటల

డబుల్ ధమాకా!

తొమ్మిది గ్రామాల్లో 619 ఇండ్లకు శంకుస్థాపన.. భూమి పూజ చేసిన స్పీకర్ సిరికొండ, మంత్రి ఈటల

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:

టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం ఊపందుకుంది. గురువారం ఒక్కరోజే తొమ్మిది గ్రామాల్లో శంకుస్థాపనలు జరిగాయి. స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో, ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ కరీంనగర్, వరంగల్ అర్బన్ జిల్లా ల్లో శంకుస్థాపనలు చేశారు. ఒకేరోజు 619 ఇండ్ల పనులు ప్రారంభమయ్యాయి. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ఎంపేడు గ్రామంలో స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి 30 ఇండ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్‌ఎస్ ప్రభు త్వం ప్రజల మనసెరిగి పని చేస్తున్నదన్నారు. నిరుపేదలకు గూడు కల్పించాలన్న ఉద్దేశంతోనే డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇస్తున్నదని చెప్పారు. పేదలకు సేవచేయడం తాను అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి, రాంపూర్ గ్రామాల్లో 40 ఇండ్లకు, జమ్మికుంట మండలం విలాసాగర్‌లో 24, ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి, చిన్నకోమటిపల్లి, ఉజునూరు గ్రామాల్లో 125 ఇండ్లకు, వరంగల్ అర్బన్ జిల్లా కమలాపూర్‌లో 350 ఇండ్లకు, అదే మండలం గూడురులో 50 ఇండ్లకు మంత్రి ఈటల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత కాలం టీఆర్‌ఎస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందన్నారు. ఇతర రాష్ర్టాల్లో లేని విధంగా వ్యవసాయానికి 24గంటల కరెంటు, పెట్టుబడుల కోసం ఎకరానికి ఏడాదికి రూ.8 వేలు ఇస్తున్న ఘనత టీఆర్‌ఎస్ సర్కారుకే దక్కుతుందన్నారు. కార్యక్రమాల్లో వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి కాట, ఆర్డీవోలు వెంకారెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

గులాబీ పార్టీలోకి భారీగా చేరికలు



హైదరాబాద్ రాంనగర్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో హోంమంత్రి నాయిని.. వనపర్తిలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి సమక్షంలో చేరిన యువకులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. గురువారం కూడా గులాబీ గూటికి భారీగా చేరారు. హైదరాబాద్‌లోని రాంనగర్‌లో అడిక్‌మెట్ డివిజన్‌కు చెందిన దాదాపు 500 మంది వివిధ పార్టీలకు చెందిన వారు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, కార్పొరేటర్ వీ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్, మిడ్జిల్ మండలాలకు చెందిన పలువురు టీడీపీ, కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో గులాబీ పార్టీలో చేరారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన గౌడ కులస్థులు హుజూరాబాద్‌లో మంత్రి ఈటల రాజేందర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కరీంపేట్‌లో 50 మంది యువకులు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో, వనపర్తి, పెద్దమందడి మండలాలకు చెందిన 60మంది యువకులు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమక్షంలో, మహబూబ్‌నగర్ జిల్లా దామరగిద్దకు చెందిన కాంగ్రెస్ నాయకులు 150మంది ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో, నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఐతోల్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు 200 మంది ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ, మాడ్గుల మండలాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నాయకులు దాదాపు 400 మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి గులాబీ కండువా కప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండలం తుర్కలపల్లికి చెందిన కాంగ్రెస్, టీడీపీ నాయకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

బస్సు చక్రం కింద పడి బీటెక్ విద్యార్థి మృతి

నిజామాబాద్ క్రైం: నిజామాబాద్‌లో ప్రమాదవశాత్తు బస్సు చక్రాల కింద పడి బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఆదర్శనగర్‌కు చెందిన తోకల మదన్‌కుమార్(22) ఆర్మూర్‌లోని పెర్కిట్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గురువారం ఉదయం 9గంటలకు కళాశాలకు వెళ్లేందుకు కంఠేశ్వర్ బస్టాప్ వద్దకు చేరుకున్నాడు. మెట్‌పల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కాడు. ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో డోర్ వద్ద నిలబడ్డాడు. బస్సు ముందుకు కదలడంతో అదుపుతప్పి కిందపడి పోగా, వెనుక చక్రం అతడి తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. విషయం తెలుసుకున్న విద్యార్థులు సంఘటనా స్థలానికి చేరుకుని కొద్దిసేపు ఆందోళనకు దిగారు.

చిట్టీల వ్యాపారి ఆత్మహత్య

కామారెడ్డి రూరల్: కామారెడ్డికి చెందిన చిట్టీల వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. దేవునిపల్లి ఎస్సై సంతోష్‌కుమార్ కథనం ప్రకారం.. కామారెడ్డి పెద్దబజార్‌కు చెందిన బక్కాయల సతీశ్‌కుమార్(35) కొన్నేండ్లుగా చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. కొద్ది రోజులుగా చిట్టీ డబ్బులు తీసుకున్న వారు సకాలంలో చెల్లించకపోవడం, తాను చెల్లించాల్సిన వారి నుంచి ఒత్తిళ్లు పెరిగాయి. ఇతరుల నుంచి దాదాపు రూ.35 లక్షల వరకు రావాల్సి ఉండటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఉదయం ఇంటినుంచి వెళ్లి తిరిగి రాకపోగా.. క్యాసంపల్లి శివారులో గురువారం చెట్టుకు వేలాడుతూ విగత జీవిగా కనిపించాడు.



జనగామలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ మల్లారెడ్డి

దొంగనోట్ల ముఠా అరెస్ట్

జనగామ టౌన్: జనగామలో దొంగ నోట్ల ముఠా గుట్టురట్టయింది. వెస్ట్‌జోన్ డీసీపీ మల్లారెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం విలేకరులకు వెల్లడించారు. గతనెల 28న జనగామలోని భవాని బ్యాంగిల్ స్టోర్‌కు కారులో వచ్చిన ఓ మహిళ రూ.270 విలువ చేసే వస్తువులు కొనుగోలు చేసింది. అందుకు రూ.2 వేల నోటు ఇచ్చి మిగిలిన చిల్లర రూ.1,730 తీసుకెళ్లింది. అనంతరం దుకాణ యజమాని భానుచందర్ ఆ నోటుపై అనుమానంతో పోలీసులకు సమాచారమివ్వగా అది నకిలీ అని తేలింది. ఈ మేరకు కంగన్‌హాల్ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆమె వచ్చిన కారు నంబర్ ఆధారంగా బెజవాడ రాజీవ్, ఎండీ చాందినీ, ఎండీ షఫీలను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కార్లు, దొంగ నోట్ల తయారీకి ఉపయోగించే తెల్ల కాగితాలు, స్కానర్‌తో కూడిన హెచ్‌పీ ప్రింటర్, 5 సెల్‌ఫోన్లు, 52 నకిలీ రూ.2వేల నోట్లు, సుమారు రూ.10వేల నగదు స్వాధీనం చేసుకున్నామని డీసీపీ వెల్లడించారు.

సెల్‌ఫోన్ బ్యాటరీ పేలి ఏడుగురికి గాయాలు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి/నమస్తే తెలంగాణ: మంటల్లో పడిన సెల్‌ఫోన్ బ్యాటరీ పేలడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధర్మారంతండాలో గురువారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. గుగులోతు రమేశ్ (30), గుగులోతు చరణ్(8), గుగులోతు హచ్చి(70), గుగులోతు ప్రకాశ్ (18), బానోత్ భద్రు(65), బానోత్ దీపిక(9), బానోత్ కైక(8) ఉదయాన్నే చలిమంట కాచుకుంటున్నారు. ఆ మంటలో చెత్త వేస్తున్న క్రమంలో పాడైన సెల్‌ఫోన్ బ్యాటరీ సైతం పడింది. దీంతో బ్యాటరీ పేలడంతో రమేశ్, చరణ్, హచ్చి తీవ్రంగా గాయపడగా మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించి చికిత్స చేయించారు.

కారు, లారీ ఢీకొని ఇద్దరి దుర్మరణం

రాజాపూర్: మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ సమీపంలో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కక్కులూరు, శంకర్‌రావుపల్లికి చెందిన ఇద్దరు మృతి చెందారు. ఎస్సై నిరంజన్‌రెడ్డి కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం కక్కులూరుకు చెందిన పూర్ణ చందర్‌రావు(61), శంకర్‌రావు పల్లికి చెందిన మాధవరెడ్డి (50) వ్యక్తిగత పని మీద మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నారు. 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి ఉన్న ఓ ప్రైవేటు కంపెనీకి సమీపంలోకి రాగానే కారు ముందు టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో అదుపు తప్పి కారు రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టి ఆ వెంటనే రోడ్డుపై వెళ్తున్న లారీని ఢీ సైతం కొట్టింది. ఈ క్రమంలోనే కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.

తల్లిదండ్రులను గెంటేసిన కుమారుడు

■ దీక్ష చేపట్టిన వృద్ధ దంపతులు



ఇంటిముందు కూర్చున్న వృద్ధ దంపతులు

పాల్వంచ: అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిదండ్రులను ఇంటినుంచి బయటికి గెంటేసిన ఓ కొడుకు కథ ఇది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణానికి చెందిన సుదర్శనాచారి దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు. కేటీపీఎస్‌లో పనిచేస్తూ పదేండ్ల కిందట సుదర్శనాచారి రిటైరయ్యారు. వచ్చిన డబ్బులతో ఇల్లు కట్టుకున్నాడు. జ్యూయలరీ షాపు నడిపిస్తున్న కొడుకు సతీశ్‌కు రెండేండ్ల కిందట పెండ్లి చేశాడు. అప్పటినుంచి ఇంట్లో కలహాలు మొదలయ్యాయి. దీంతో కొడుకును ఇబ్బంది పెట్టడమెందుకని కూతుళ్ల దగ్గర ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇటీవల సుదర్శనాచారి అనారోగ్యానికి గురయ్యాడు. గురువారం కొడుకు ఇంటికి వచ్చారు. తాము బాగోగులు చూడలేమని చెప్పి సతీశ్ తల్లిదండ్రులను గెంటేశాడు. దీంతో వారు ఇంటి ముందు దీక్షకు దిగారు.

అత్తను హతమార్చిన కోడలు

పాల్వంచ: కోడలి చేతిలో అత్త హతమైంది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. వెంకటేశ్వరహిల్స్ కాలనీ నివాసి బూర్గుల దుర్గమ్మ (55) కేటీపీఎస్ ఉద్యోగి. ఈమెకు రాజేశ్, సురేశ్ అనే ఇద్దరు సంతానం. రాజేశ్ కేటీపీఎస్ దవాఖానలో ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాజేశ్ డ్యూటీలో భాగంగా హైదరాబాద్ వెళ్లాడు. కోడలు భాగ్యరాణి మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో అత్త ఆమెను నిలదీసిందని, ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడువ జరిగినట్టు తెలుస్తున్నది. అత్త దుర్గమ్మ నిద్రిస్తున్న సమయంలో కోడలు ఆమె ముఖంపై దిండుతో అదిమి హత్య చేసిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు భాగ్యరాణిని అదుపులోకి తీసుకున్నారు.

కాంగ్రెస్ నేతలకు గుణపాఠం చెప్పాలి

■ రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు, నమస్తే తెలంగాణ: దేశాన్ని దోచుకుతిన్న కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల సమయంలోనే ప్రజలు గుణపాఠం చెప్పాలని రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి కోరారు. కాంగ్రెస్ నేతలు ఈ ఎన్నికల్లో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు పన్నాగాలు పన్నుతున్నారని, టీఆర్‌ఎస్ కార్యకర్తలు సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలువాలని పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా తాండూరులో గురువారం టీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రపతి, ప్రధాని మెచ్చుకునే విధంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని, ఎన్నికల్లో ఇవ్వని ఎన్నో హామీలను అమలు చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలోనే మొదటి బైపాస్ రోడ్డును తాండూరుకు కేటాయించి, రూ. 110 కోట్ల నిధులు మంజూరు చేయించడం గర్వకారణమన్నారు. ఎమ్మెల్సీ వీజీ గౌడ్ మాట్లాడుతూ 60 ఏండ్ల కాంగ్రెస్, టీడీపీల పాలనలో తెలంగాణ మరింత వెనుకబడిందన్నారు. రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ చైర్మన్ నాగేందర్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 4600 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం నేడు సీఎం కేసీఆర్ ముందు చూపుతో 14,600 మెగా వాట్లకు చేరిందన్నారు. వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి మాట్లాడుతూ కేవలం మూడున్నరేండ్లలో అభివృద్ధి కార్యక్రమాలకు రూ. లక్షా 49 వేల కోట్లు వెచ్చించిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు.



లారీ ఓనర్స్ ఆఫీసును ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ వీజీ గౌడ్

అన్ని జిల్లాల్లో డ్రైవర్లకు శిక్షణా కేంద్రాలు

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి జిల్లాలో ఐదు ఎకరాల స్థలం కేటాయించి ఆధునిక సామగ్రితో డ్రైవర్లకు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి తెలిపారు. తాండూరులో గురువారం లారీ ఓనర్స్ అసోసియేషన్‌ను ప్రారంభించి మాట్లాడారు వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఇప్పటికే స్థల ఎంపిక పూర్తయిందన్నారు.

పోలీసుల పనితీరుపై థర్డ్‌పార్టీ విచారణ

మార్గదర్శకాల ప్రకారమే ప్రమోషన్లు: డీజీపీ మహేందర్‌రెడ్డి.. వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో పర్యటన

వరంగల్ ప్రధాన ప్రతినిధి/మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు చేరువైనట్టు డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. పోలీసుల పనితీరు కోసం థర్డ్ పార్టీ విచారణ చేపట్టి రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లకు, ప్రతి పోలీస్ అధికారికి ర్యాంకింగ్ ఇస్తామని చెప్పారు. జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం ఆయన హెలీకాప్టర్‌లో వరంగల్ అర్బన్, మహబూబాబాద్ జిల్లాల్లో పర్యటించారు. వరంగల్ అర్బన్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో అత్యాధునిక టవర్, కమాండ్ కంట్రోల్ యూనిట్ నిర్మాణాలను పరిశీలించారు. సీసీ కెమెరా కమాండ్ కంట్రోల్ యూనిట్‌ను ప్రారంభించారు. కమిషనరేట్ పరిధిలోని ఎస్‌హెచ్‌వో నుంచి సీపీ స్థాయి వరకు వివిధ శ్రేణులతో నిట్‌లో డీజీపీ మహేందర్‌రెడ్డి సమీక్షించారు. మహబూబాబాద్ పట్టణ సమీపంలోని గుమ్మునూరు ప్రాంతంలో నిర్మించే పోలీసు ప్రధాన కార్యాలయాల ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్నతాధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో మీడియాతో మాట్లాడారు. నూతన టెక్నాలజీ ద్వారా నేరాలను అదుపుచేస్తున్నామని డీజీపీ తెలిపారు. పదోన్నతుల విషయంలో మార్గదర్శకాలను పాటిస్తామన్నారు. కొందరు కోర్టులు, ట్రిబ్యునల్స్‌కు వెళ్తుండటంతో ప్రమోషన్ల విషయంలో కొంత జాప్యం జరుగుతున్నదని చెప్పారు. డీజీపీ వెంట వరంగల్‌లో ఐజీ నాగిరెడ్డి, సీపీ సుధీర్‌బాబు, వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి, మహబూబాద్‌లో ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.



వరంగల్ పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో సీసీ కెమెరా కమాండ్ కంట్రోల్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి, చిత్రంలో ఐజీ నాగిరెడ్డి, సీపీ, కలెక్టర్

నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
శుక్రవారం 5 జనవరి 2018

సఫారీ ముచ్చట్లు

తలకిందులుగా 'త్రివర్ణం'

అంతర్జాతీయ వేదికల్లో మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు ఆతిథ్య దేశంతో పాటు పోటీల్లో పాల్గొనే అన్ని దేశాల జాతీయ పతకాలను ఎగురవేయడం ఆనవాయితీ. క్రికెట్‌లోనూ ఇది కొనసాగుతున్నది. అయితే కేప్‌టౌన్‌లో భారత జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేసి అక్కడి అధికారులు కాస్త నిర్లక్ష్యాన్ని చూపెట్టారు. కొద్దిసేపటి తర్వాత ఎవరో వచ్చి చెబితే తప్పును సరిదిద్దుకున్నా.. అప్పటికే ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

రెండు నిమిషాల్లోనే స్నానం

తొలి టెస్టుకు వేదికైన కేప్‌టౌన్‌లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. కనీసం పిచ్‌పై పచ్చిక పెంచడానికి కూడా సరిపడా నీళ్లు లభించని పరిస్థితి. దీంతో ఆటగాళ్లకు కూడా నీటి విషయంలో స్థానిక అధికారులు కొన్ని సూచనలు చేశారు. రెండు నిమిషాల కంటే ఎక్కువసేపు స్నానం చేయొద్దని క్రికెటర్లను కోరారు. దీంతో ఎప్పుడు స్నానానికి వెళ్లినా ఆటగాళ్లు రెండు నిమిషాల్లోనే బయటకు వచ్చేస్తున్నారంట. అయితే ఈ అంశంపై టీమ్‌ఇండియా ఆటగాళ్లు ఎలాంటి అసంతృప్తిని వ్యక్తం చేయడం లేదు. 'మేం క్రికెట్ ఆడేందుకు వచ్చాం. బాగా ఆడాలి. గెలువాలి. ఇదే మా లక్ష్యం' అని ఓ క్రికెటర్ మీడియాతో పంచుకున్నాడు. ప్రతి రోజు రెండు సెషన్లలో ప్రాక్టీస్ చేస్తున్న ఆటగాళ్లు అది ముగిశాక షవర్ల కింద సేద తీరుతుంటారు. కానీ ఇక్కడ ఆ అవకాశం లేదు.

కోహ్లీ డుమ్మా

ద్వైపాక్షిక సిరీస్‌కు ప్రారంభానికి ముందు రెండు జట్ల కెప్టెన్లు మీడియాతో మాట్లాడటం ఆనవాయితీ. కానీ దీనికి కోహ్లీ మంగళం పాడాడు. గురువారం మ్యాచ్‌కు సంబంధించిన అంశాలపై మాట్లాడాల్సి ఉండగా కోహ్లీ అక్కడికి రాలేదు. దాదాపు గంట ఆలస్యంగా బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ మీడియా సమావేశానికి వచ్చి పలు అంశాలపై మాట్లాడాడు. విదేశీ పర్యటనల్లో ధోనీ ఏనాడూ మీడియా సమావేశానికి గైర్హాజరు కాలేదు. అయితే కీలకమైన సిరీస్‌కు ముందు విరాట్ ఇలా చేయడం విమర్శలకు ఊతమిచ్చింది. మరోవైపు అప్షనల్ ప్రాక్టీస్ కావడంతో ఒక్క ప్లేయర్ కూడా మైదానం వైపు రాలేదు. చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్, కోచ్ రవిశాస్త్రి పిచ్‌ను పరిశీలించి వెళ్లారు.

'ఫ్రీడమ్' ఎవరిదో?

నేటి నుంచి భారత్, దక్షిణాఫ్రికా తొలి టెస్టు
పేసర్లపైనే టీమ్‌ఇండియా భారం
ఆధిపత్యం కోసం సఫారీసేన కసరత్తు


డుప్లెసిస్


ఆమ్లా

కేప్‌టౌన్: అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్, దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం నుంచి ఇరు జట్ల మధ్య తొలి టెస్టు జరుగనుంది. పాత చరిత్రను తిరగరాస్తూ.. కొత్త రికార్డులను సృష్టించాలని భావిస్తున్న విరాట్‌సేన ఈ మ్యాచ్ కోసం అన్ని అస్త్రాలను సిద్ధం చేసుకుంది. 2014-15లో ఆసీస్ చేతిలో చివరిసారి 0-2తో టెస్టు సిరీస్ ఓడిన టీమ్‌ఇండియా అప్పట్నించి జైత్రయాత్ర సాగిస్తున్నది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని తొలి మ్యాచ్‌లోనే సఫారీలను దెబ్బకొట్టి శుభారంభం చేయాలని పట్టుదలగా కనిపిస్తున్నది. దీనికి తోడు ఈ ఏడాది దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియాతో కలిపి మొత్తం 12 టెస్టులు ఆడనుంది. వీటిలో సగానికి పైగా గెలిచి విదేశీ చెత్త రికార్డులకు మంగళం పాడాలని భావిస్తున్నది. 2013-14 సిరీస్‌లో ఆడిన 13 మంది ఆటగాళ్లు ప్రస్తుత జట్టులో ఉండటం టీమ్‌ఇండియాకు కలిసొచ్చే అంశమే అయినా.. స్వదేశంలో పటిష్టమైన సఫారీ పేస్ బౌలింగ్‌ను ఎంత మేరకు నిలువరిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. గతంలో ఇక్కడ ఆడిన ఆరు సిరీస్‌ల్లో భారత్ రెండు మ్యాచ్‌లే గెలిచింది. ద్రవిడ్ (2006-07), ధోనీ (2010-11) నాయకత్వంలో ఈ విజయాలు వచ్చాయి. 2010-11, 2013-14లో సిరీస్ విజయం అంచులకు వచ్చి చతికిలపడ్డ టీమ్‌ఇండియా ఈసారి ఎలాగైనా ఒడిసిపట్టుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నది. అయితే తొలి టెస్టుకు వేదికైన న్యూలాండ్స్‌లో భారత్ ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం కూడా లేదు. రెండు పరాజయాలు, రెండు డ్రాలతో మ్యాచ్‌లను ముగించింది. మరి ఈసారైనా విజయంతో శుభారంభం చేస్తారో చూడాలి.

తుది జట్టు కూర్పు ఎలా..?

చరిత్ర, రికార్డులను పక్కనబెడితే.. ప్రస్తుతం ఎక్కడ చూసినా న్యూలాండ్స్ వికెట్ గురించే చర్చ మొదలైంది. పిచ్‌పై పచ్చిక ఉండటంతో టీమ్‌ఇండియా తుది జట్టు ఎలా ఉంటుందోనన్న ఆసక్తి పెరిగింది. ఐదుగురు బౌలర్ల వ్యూహాన్ని పక్కనబెట్టి ముగ్గురు పేసర్లు, ఒక స్పిన్నర్ కాంబినేషన్ వైపు కోహ్లీ మొగ్గు చూపే అవకాశాలున్నాయి. ఇదే జరిగితే భువనేశ్వర్, ఇషాంత్, షమీల పేస్ అటాక్‌కు తోడుగా అశ్విన్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నాడు. జడేజా వైరల్ జ్వరం నుంచి ఇంకా కోలుకోలేదు. ఇక బ్యాటింగ్‌లో ఎక్స్‌ట్రా బ్యాట్స్‌మన్‌ను తీసుకోవాలని మేనేజ్‌మెంట్ యోచన. ఆల్‌రౌండర్‌గా హార్దిక్‌కు అవకాశం ఇస్తే ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతున్న రహానేకు తుది జట్టులో అవకాశం కష్టమే. ఇక స్వదేశంలో సెంచరీల మోత మోగించిన రోహిత్‌కు లైన్ క్లియర్ అవుతుందా చూడాలి. చీలమండ గాయం నుంచి కోలుకుని ఫిట్‌నెస్ సాధించిన ధవన్‌కు తోడుగా మురళీ విజయ్ ఓపెనింగ్ చేయొచ్చు. పుజార, కోహ్లీ, సాహా యధావిధిగా తమ స్థానాల్లో ఆడనున్నారు.

ఎవరెవరికి అవకాశం..!

దక్షిణాఫ్రికా కూడా తుది జట్టు ఎంపికపై మల్లగుల్లాలు పడుతున్నది. ఈ సిరీస్ కోసం తమ పేస్ అస్త్రాలన్నింటిని సిద్ధం చేసుకున్నా.. తుది 11 మందిలో ఎవరికి అవకాశం ఇవ్వాలో తేల్చుకోలేకపోతున్నది. అయితే ఈ మ్యాచ్ కోసం డుప్లెసిస్ కొత్త కూర్పును ప్రయత్నించాలని భావిస్తున్నాడు. డివిలియర్స్, బావుమా, పెహెల్‌కావో, మోరిస్, స్టెయిన్, మోర్కెల్‌లో ఎవర్ని తీసుకోవాలన్న డైలామా కొనసాగుతున్నది. ముగ్గురు పేసర్లు, ఓ స్పిన్నర్ వ్యూహంతో బరిలోకి దిగాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నది. దీంతో ఏకైక స్పిన్నర్‌గా కేశవ్ మహారాజ్‌కు అవకాశం దక్కొచ్చు. పిచ్ స్వభావాన్ని బట్టి ఎక్స్‌ట్రా బ్యాట్స్‌మన్ వైపు మొగ్గుతున్నారు.



నైపుణ్యాలు సమం.. ఆడటంలోనే అధమం..
గమ్యం స్పష్టం.. గెలువడంలోనే నైరాశ్యం..
అవకాశాలు సమానం.. అందుకోవడంలోనే
వైఫల్యం..26 ఏండ్ల చరిత్రలో.. ఆడిన ఆరు
సిరీస్‌ల్లో.. ఐదు ఓటములు.. ఒకే ఒక్క డ్రా..
17 మ్యాచ్‌లు.. 2 విజయాలు.. 8 పరాజయాలు..
7 డ్రాలు.. దక్షిణాఫ్రికా గడ్డపై భారత్ జట్టు ట్రాక్
రికార్డు ఇది..!
సీన్ తిరిగేస్తే..
మూడేండ్లుగా పరాజయమే ఎరుగని చరిత్ర..
వరుసగా తొమ్మిది సిరీస్ విజయాలు.. స్వదేశంలో
ఆరు.. విదేశాల్లో మూడు.. పదునెక్కిన పేస్
బలగం..మెరుపెక్కిన బ్యాటింగ్ బలం.. రికార్డు
విజయాలు.. అచ్చెరువొందే ప్రదర్శనలు..
అద్భుతాలు చూపెట్టిననాయకత్వం.. ప్రస్తుతం
టీమ్‌ఇండియా సంచలన చరిత్ర ఇది..!!
ఊహించి చూసినా.. వాస్తవాలు
ఆలోచించినా.. ఏమాత్రం పొంతన లేని
ఈ రెండు 'ప్రదర్శనల' నేపథ్యంలో మరోసారి
భారత్-దక్షిణాఫ్రికా మధ్య మూడు మ్యాచ్‌ల
'ఫ్రీడమ్' టెస్టు సిరీస్‌కు రంగం సిద్ధమైంది.
ఓవైపు పేస్ వ్యూహం.. మరోవైపు బ్యాటింగ్
మంత్రం.. ఒకరిదేమో స్వదేశీ అనుకూలత..
మరొకరిదేమో విదేశీ ఒత్తిడి.. తొలి సిరీస్ గెలుపు
కోసం విరాట్‌సేన పోరాటం.. ఆధిపత్యం కోసం
ఆతిథ్య జట్టు ఆరాటం.. కొత్త ఆశలు..
కొంగొత్త ప్రణాళికలతో టీమ్‌ఇండియా..
తిరుగులేనిరికార్డులతో సఫారీలు..
ఓవరాల్‌గా కొదమ సింహాల పోరును
తలదన్నే రీతిలో జరుగబోతున్న
తొలి టెస్టులో లక్ష్యం చేరేదెవరు..?
ఘన చరితకు ఎక్కేదెవరు..?
స్వేచ్ఛ (ఫ్రీడమ్)ను ప్రసాదించేవారు
ఎవరు..? తెలుసుకోవాలంటే..
చూడాల్సిందే...!!


కోహ్లీ
పాండ్యా
ఇషాంత్

5 ఈ టెస్టులో షమీ ఐదు వికెట్లు తీస్తే.. వేగంగా 100 వికెట్లు తీసిన రెండో ఫాస్టెస్ట్ బౌలర్‌గా రికార్డులకెక్కుతాడు.

7 స్వదేశంలో డుప్లెసిస్ నాయకత్వంలో జరిగిన ఏడు టెస్టు సిరీస్‌ల్లో ఆరు గెలిచి ఒకటి డ్రా చేసుకున్నాడు.

మ. గం. 2 నుంచి సోనీ టెన్-1లో

జట్లు (అంచనా)

భారత్: కోహ్లీ (కెప్టెన్), ధవన్ / రాహుల్, మురళీ విజయ్, పుజార, రహనే, రోహిత్ / పాండ్యా, సాహా, అశ్విన్, భువనేశ్వర్, షమీ, ఇషాంత్. **దక్షిణాఫ్రికా:** డుప్లెసిస్ (కెప్టెన్), ఎల్గర్, మార్క్‌రామ్, ఆమ్లా, డివిలియర్స్ / బావుమా, డికాక్, పెహెల్‌కావో / మోరిస్, ఫిలాండర్, రబడ, స్టెయిన్ / మోర్కెల్, కేశవ్ మహరాజ్.

పిచ్, వాతావరణం

పిచ్‌పై పచ్చిక ఉంది. ఇక్కడ జరిగిన 54 టెస్టుల్లో 44 సార్లు టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్నారు. అక్కడక్కడా పగుళ్లు కనిపిస్తున్నాయి. తొలి, నాలుగో రోజు వాతావరణం మేఘావృతంగా ఉండే అవకాశం ఉంది.

తడబడి.. నిలబడి

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 233/5


రూట్
మాలన్

సిడ్నీ: ఆస్ట్రేలియాతో గురువారం ప్రారంభమైన యాషెస్ ఐదో టెస్టులో ఇంగ్లండ్ తడబడి కోలుకుంది. కెప్టెన్ జో రూట్ (141 బంతుల్లో 83; 8 ఫోర్లు) బాధ్యాతయుతమైన ఇన్నింగ్స్‌తో తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 81.4 ఓవర్లలో 5 వికెట్లకు 233 పరుగులు చేసింది. మాలన్ (55 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ ఆరంభంలోనే ఓపెనర్ స్టోన్‌మన్ (24) వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత డబుల్ సెంచరీ హీరో కుక్ (39)కు జతకలిసిన విన్సీ (25) స్కోరు బోర్డును ముందుకు నడిపాడు. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 60 పరుగులు జోడించారు. కానీ స్వల్ప వ్యవధిలో కుక్, వీన్సి ఔట్‌కావడంతో ఇంగ్లండ్ 95 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో రూట్, మలాన్ ఇన్నింగ్స్‌ను నిర్మించే బాధ్యతను భుజాలకెత్తుకున్నారు. ఈ ఇద్దరూ ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ చెత్త బంతులను బౌండరీకి తరలించారు. ఈ క్రమంలో రూట్ అర్ధసెంచరీ పూర్తి చేసుకుని సెంచరీ దిశగా దూసుకుపోయాడు. కానీ మరికాసేపట్లో ఆట ముగుస్తుందనగా స్టార్క్.. రూట్‌ను పెవిలియన్‌కు పంపి షాకిచ్చాడు. దీంతో నాలుగో వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కొద్దిసేపటికే బెయిర్‌స్టో (5) కూడా ఔట్‌కావడంతో ఇంగ్లండ్ మళ్లీ కష్టాల్లో పడింది. హాజెల్‌వుడ్, కమిన్స్ చెరో రెండు వికెట్లు తీశారు.



వార్నర్ హైదరాబాద్‌కే..

ధోనీ, కోహ్లీ, రోహిత్ పాత ఫ్రాంచైజీలకే.. గేల్, అశ్విన్, గంభీర్‌లకు మొండి చెయ్యి

ముంబై: ఐపీఎల్‌లో స్టార్ ఆటగాళ్లు ఏఏ ఫ్రాంచైజీలకు ఆడుతారనే అంశంపై కాస్త స్పష్టత వచ్చింది. గురువారం జరిగిన రిటెన్షన్‌లో నలుగురు కెప్టెన్లను పాత ఫ్రాంచైజీలకే ప్రాతినిధ్యం వహించనున్నారు. డేవిడ్ వార్నర్ (రూ. 12 కోట్లు)ను సన్ రైజర్స్ హైదరాబాద్ అట్టిపెట్టుకోగా, ధోనీ (రూ. 15 కోట్లు), కోహ్లీ (రూ. 17 కోట్లు), రోహిత్ (రూ. 15 కోట్లు) వరుసగా చెన్నై, బెంగళూరు, ముంబై ఇండియన్స్‌కే ఆడనున్నారు. సూపర్‌కింగ్స్, ఆర్‌సీబీ, ముంబై ఇండియన్స్ ముగ్గురు చొప్పున అట్టిపెట్టుకున్నాయి. మరో ఇద్దరు ప్లేయర్లను ఆర్‌టీఎం (రైట్ టు మ్యాచ్) ద్వారా తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. టీ20 స్టార్ హిట్టర్ క్రిస్ గేల్‌ను ఆర్‌సీబీ వదిలేసుకోగా, గంభీర్‌కు కోల్‌కతా పెద్ద షాకే ఇచ్చింది. అశ్విన్‌ను కూడా సూపర్‌కింగ్స్ వదిలేసింది. దీంతో ఈనెల 27, 28న బెంగళూరులో జరిగే వేలం మరింత ఆసక్తికరంగా సాగే అవకాశాలు కనబడుతున్నాయి. హైదరాబాద్, కోల్‌కతా వేలంలో చెరో రూ. 59 కోట్లు ఖర్చు చేయనున్నాయి. పంజాబ్, రాజస్థాన్ వద్ద క్యాప్ సాలరీ రూ. 69.5 కోట్లు ఉండగా, ఆర్‌సీబీ రూ. 49 కోట్లు, చెన్నై, ఢిల్లీ, ముంబై జట్లు రూ. 47 కోట్లు చొప్పున ఖర్చు చేసుకోవచ్చు.

రిటేన్ ఆటగాళ్ల వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్: వార్నర్, భువనేశ్వర్ (రూ. 8.5 కోట్లు).
చెన్నై సూపర్‌కింగ్స్: ధోనీ, రైనా (రూ. 11 కోట్లు), జడేజా (రూ. 7 కోట్లు).
ఢిల్లీ డేర్‌డెవిల్స్: రిషబ్ పంత్ (రూ. 8 కోట్లు), క్రిస్ మోరిస్ (రూ. 7.1 కోట్లు), శ్రేయాస్ అయ్యర్ (రూ.7 కోట్లు).
కింగ్స్ ఎలెవన్ పంజాబ్: అక్షర్ పటేల్ (రూ. 6.75 కోట్లు)
కోల్‌కతా నైట్‌రైడర్స్ : సునీల్ నరైన్ (రూ.8.5 కోట్లు), ఆండ్రీ రస్సెల్ (రూ. 7 కోట్లు).
ముంబై ఇండియన్స్: రోహిత్, హార్దిక్ పాండ్య (రూ.11 కోట్లు), బుమ్రా (రూ. 7 కోట్లు).
రాజస్థాన్ రాయల్స్: స్టీవ్ స్మిత్ (రూ.12 కోట్లు)
రాయల్ చాలెంజర్స్ బెంగళూరు : విరాట్ కోహ్లీ, డివిలియర్స్ (రూ. 11 కోట్లు), సర్ఫరాజ్ (రూ. 1.75 కోట్లు).

హైదరాబాద్ డబుల్ ధమాక


మహిళల చాంపియన్ హైద్రాబాద్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల బాస్కెట్‌బాల్ టోర్నీలో హైదరాబాద్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. పురుషుల ఫైనల్లో హైద్రాబాద్ జట్టు 84-63తో రంగారెడ్డిపై గెలిచింది. రంగారెడ్డి జట్టు ద్వితీయస్థానం దక్కింది. మహిళల టైటిల్ పోరులోనూ హైద్రాబాద్ 55-21తో మెదక్‌ను ఓడించింది. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమణ యాదవ్ పర్యవేక్షణలో జరిగిన టోర్నీలో నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నారు. ముగింపు కార్యక్రమానికి విచ్చేసిన ఖమ్మం ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ విజేతలకు ట్రోఫీలను అందజేశారు.

భారత్ టైటిల్‌ను నిలబెట్టుకునేనా..?

ఈ నెల 7 నుంచి అంధుల క్రికెట్ ప్రపంచకప్



న్యూఢిల్లీ: అంధుల క్రికెట్ ప్రపంచకప్ కోసం భారత జట్టు సిద్ధమైంది. పాకిస్థాన్, యూఏఈలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీ జనవరి 7 నుంచి 21 వరకు జరుగనున్నది. భారత్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్న ఈ ప్రపంచకప్‌లో మొత్తం ఆరు జట్లు పాల్గొంటున్నాయి. పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, ఆస్ట్రేలియా జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. అజయ్‌కుమార్ సారథ్యంలోని భారత జట్టుకు దిగ్గజ వికెట్ కీపర్ సయ్యద్ కిర్మాణీ ఆల్ ద బెస్ట్ చెప్పారు. భారత్ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని కోరారు. కాగా భారత జట్టు 2017 అంధుల ప్రపంచ టీ20ని కూడా గెలుచుకున్న సంగతి తెలిసిందే.

ఫిర్దోస్‌కు రజతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ పరిధిలోని గురుకులాల విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటుకున్నారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఇటీవల నిర్వహించిన యూత్ నేషనల్స్, ఇండియన్ ఇంటర్నేషనల్ రెగెట్టా చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన మసీహా ఫిర్దోస్ రజతంతో మెరిశాడు. సోను (వరంగల్), అఫన్ ముబీన్ (హైదరాబాద్) కాంస్యాలను దక్కించుకున్నాడు. క్రీడాపోటీల్లో విజేతలైన విద్యార్థులను గురువారం మైనార్టీ గురుకుల విద్యాలయాల సొసైటీ కార్యదర్శి కార్యదర్శి షఫీయుల్లా అభినందించారు. ఇతర క్రీడాంశాల్లో మైనార్టీ గురుకులాల విద్యార్థులు 4, 5, 9, 13, 18 స్థానాలను సాధించారు.

డేర్‌డెవిల్స్ కోచ్‌గా పాంటింగ్



ముంబై: ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ఢిల్లీ డేర్‌డెవిల్స్ కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈ మేరకు డేర్‌డెవిల్స్ సీఈవో హేమంత్ దువా ఒక ప్రకటనలో తెలిపాడు. గత సీజన్‌లో ఢిల్లీకి కోచ్‌గా ఉన్న రాహుల్ ద్రవిడ్ పరస్పర విరుద్ధ ప్రయోజనాల కారణంగా భారత అండర్-19 కోచ్‌గా ఉండేందుకే మొగ్గు చూపడంతో ఆ స్థానంలో పాంటింగ్‌ను నియమించారు. ఆసీస్‌కు మూడు ప్రపంచకప్‌లు అందించిన ఈ మాజీ కెప్టెన్ గతంలో ముంబై ఇండియన్స్‌కు బ్యాటింగ్ సలహాదారుగా ఉండి ఆ జట్టు టైటిల్‌ను గెలువడంలో కీలకపాత్ర పోషించాడు.. తాజాగా ఢిల్లీ ఇతనిని కోచ్‌గా ఎంచుకున్నది.


సైనా

ముంబై గెలుపు

సైనా పోరాటం వృథా

లక్నో: అద్భుత ఆటతీరుతో చెలరేగిన భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ శ్రమ వృథా అయింది. పీబీఎల్‌లో భాగంగా గురువారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ముంబై రాకెట్స్ 4-1తో అవధ్ వారియర్స్‌పై విజయం సాధించింది. మొదట జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో లీయాంగ్, స్టొయెవా జోడి (ముంబై) 15-10, 14-15, 15-7తో తంగ్‌చున్, పెడర్సెన్‌పై, పురుషుల సింగిల్స్‌లో సమీర్ వర్మ (ముంబై) 15-6, 15-14తో హర్షిత్ అగర్వాల్‌పై విజయం సాధించి ముంబైని ఆధిక్యంలో నిలిపారు. ఆ తర్వాత మహిళల సింగిల్స్‌లో సైనానెహ్వాల్ (అవధ్) 8-15, 15-10, 15-13తో బివాన్ జంగ్‌పై, పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ (అవధ్) 15-13, 13-15, 15-4తో సాన్ వాన్ హోపై విజయం సాధించి ఆధిక్యాన్ని సమం చేశాడు. అయితే కీలకమైన ట్రంప్ మ్యాచ్ పురుషుల డబుల్స్‌లో లీయాంగ్, టన్ బూన్ (ముంబై)15-13, 15-12తో సెటియావన్, చిన్ చుంగ్‌పై గెలువడంతో అవధ్‌కు పరాజయం ఖరారైంది.

'ఆస్ట్రేలియన్'కు ముర్రే దూరం



సిడ్నీ: బ్రిటన్ టెన్నిస్ ఆటగాడు ఆండీ ముర్రే.. అభిమానులకు చేదు వార్త చెప్పాడు. నడుము నొప్పితో బాధపడుతున్న ముర్రే ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి వైదొలుగుతున్నట్టు సంచలన నిర్ణయాన్ని ప్రకటించాడు. గతేడాది వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్లో ఓటమి నుంచి ఇప్పటి వరకూ ఆటకు దూరంగా ఉన్న ఈ బ్రిటీష్ ఆటగాడు, రెండు రోజుల క్రితమే బ్రిస్బేన్ ఓపెన్‌లో ఆడటం లేదని ప్రకటించాడు. జపాన్ స్టార్ ప్లేయర్ నిషికోరి కూడా గాయం కారణంగా ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి వైదొలిగాడు. మరోవైపు మాజీ నెంబర్ వన్ నొవాక్ జొకోవిచ్ బరిలోకి దిగే విషయమై ఇంకా స్పష్టత రాలేదు. మోచేయి గాయంతో బాధపడుతున్న ఈ సెర్బియా ఆటగాడు త్వరలోనే తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపాడు.

సినిమా టాకీస్‌లోనే తినుబండారాలు ఎందుకు కొనాలి?

ఇంటి నుంచి తెచ్చుకుంటే తప్పేంటి ■ మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బాంబే హైకోర్టు

ముంబై: సినిమా టాకీస్‌లలో బయటి తినుబండారాల నిషేధంపై మూడు వారాల్లో వివరణ ఇవ్వాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని బాంబే హైకోర్టు ఆదేశించింది. ప్రేక్షకులు తినుబండారాలను సినిమా టాకీస్‌లోనే కొనాలని ఎందుకు ఒత్తిడి తెస్తున్నారని ప్రశ్నించింది. టాకీస్‌ల్లోకి బయటి తినుబండారాలను అనుమతించడం లేదని, సెక్యూరిటీ గార్డులు ప్రేక్షకుల బ్యాగులను తనిఖీ చేయకుండా చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు విచారించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ ఓ వ్యక్తి ఆహారాన్ని తన వెంట సినిమా టాకీస్‌లోకి తీసుకెళవద్దని చట్టంలో ఎక్కడా లేదన్నారు. సినిమా టాకీస్‌లో ఎలాంటి తినుబండారాలను అమ్మకూడదన్న నిబంధనలను టాకీస్‌లు ఉల్లంఘించడమే కాక బయటి తినుబండారాలను లోపలికి అనుమతించడం లేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ధర్మాసనం పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.



దక్షిణాఫ్రికాలో రైలు ప్రమాదం 18 మంది మృతి

జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో జరిగిన రైలు ప్రమాదంలో 18 మంది మరణించగా, 260 మంది గాయపడ్డారు. సెలవులు గడిపి ఇండ్లకు తిరిగి వస్తున్న ప్రయాణికులతో పోర్ట్ ఎలిజబెత్ నుంచి జొహాన్నెస్‌బర్గ్ వరకు వెళుతున్న రైలు ట్రాక్‌ను దాటుతుండగా ఒక పెద్ద ట్రక్కు దూసుకురావడంతో ఈ ప్రమాదం జరిగింది. ట్రక్కును రైలు 400 మీటర్ల దూరం లాక్కెళ్లింది. ప్రమాద సమయంలో రైలులో 429 మంది ప్రయాణికులు ఉన్నారు. రైలు, ట్రక్కు ఢీ కొన్నప్పుడు మంటలు చెలరేగాయి. దీంతో సుమారు ఆరు బోగీలు దగ్ధమయ్యాయి. విద్యుత్ లైన్లు దెబ్బ తిన్నాయి. ప్రమాదానికి మానవ తప్పిదమే కారణమని భావిస్తున్నారు.

ఉత్తర భారతం గజగజ

- కార్గిల్‌లో -20 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత
- ఢిల్లీని వదలని పొగమంచు



న్యూఢిల్లీ, జనవరి 4: ఉత్తర భారతాన్ని చలి వణికిస్తున్నది. లడక్ ప్రాంత పరిధిలోని కార్గిల్‌లో ఉష్ణోగ్రత '-20'డిగ్రీలకు పడిపోయింది. కశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లోనూ చలి తీవ్రత అధికంగా ఉన్నది. ఢిల్లీలోనూ ఉష్ణోగ్రత 5డిగ్రీలకు పడిపోయింది. ఢిల్లీని ఆవరించిన పొగమంచు ఇంకా వదలడం లేదు. గురువారం ఉదయం దృశ్య గోచరత 50 మీటర్లకు మించలేదు. ప్రధానంగా ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లో పొగమంచు దట్టంగా ఉంది. దీంతో దాదాపు 200 విమానాలు ఆలస్యంగా నడిచాయి. 11 విమానాలను రద్దు చేశారు. అలాగే 92 రైళ్లు ఆలస్యంగా నడువగా, 44 రైళ్ల సమయాలను రీషెడ్యూల్ చేశారు.19 రైళ్లు రద్దయ్యాయి. హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోనూ చలి తీవ్రత అధికంగా ఉంది.



